
RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ | 05 ఫిబ్రవరి 2026 గురువారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:207

# కేసీఆర్.. నువ్వేలా జాతిపిత అవుతావు: రేవంత్ రెడ్డి



## పదేళ్ల అధికారంలో ఉండి రాష్ట్రాన్ని దోచుకున్నారని మండిపాటు

## మొగుడు పెళ్లాం మాట్లాడుకున్నా ఫోన్ ట్యాపింగ్ చేశారని ఆగ్రహం

## బీఆర్ఎస్ నాయకులు దోపిడీదారులు అంటూ విమర్శలు

**మిర్యాలగూడ ప్రజాబలం ప్రతినిధి:** "భార్యాభర్తలు మాట్లాడుకుంటే దొంగచాటుగా విన్న సన్నాసివి, నువ్వేలా జాతిపిత అవుతావు?" అని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసును ఉద్దేశించి ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడలో బుధవారం జరిగిన 'ప్రజా పాలన ప్రగతిబాట' భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కేసీఆర్ కుటుంబంపై, బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు.

కొంతమంది 'జాతిపిత'ను విచారిస్తారా అని అడుగుతున్నారని, అసలు "ఎవరికిరా నువ్వు జాతిపిత? నీ జాతికి నువ్వు పిత కావొచ్చు.. మాకు కాదు" అని రేవంత్ రెడ్డి అన్నారు.

"ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ మొత్తం కనుమరుగైనా తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన సోనియమ్మ తెలంగాణ తల్లి అవుతుంది.

తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసిన ప్రొఫెసర్ జయశంకర్ జాతిపిత అవుతాడు. లులి, సన్నాసి, దొంగ అయిన నువ్వేలా జాతిపిత అవుతావు?" అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి తీవ్ర పదజాలంతో విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై మాట్లాడుతూ.. "అన్నం తినేవాళ్లు ఎవరైనా భార్యాభర్తలు మాట్లాడుకుంటే వింటారా? సిగ్గుతో తలదించుకోవాలి. నిజానికి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ముఖాలకు ముసుగులు తొడిగి పోలీసులు విచారణకు తీసుకురావాల్సింది" అని వ్యాఖ్యానించారు.

తాము జాతిపిత అయితే కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్, కేటీఆర్ జన్వాడ ఫామ్‌హౌస్, హరీశ్‌రావు మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లతో పాటు వేల కోట్ల ఆస్తులను తెలంగాణ ప్రజలకు రాసిస్తారా అని సవాల్ విసిరారు. తెలంగాణ ఉద్యమకారుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు కనీసం చిన్న పదవి కూడా ఇవ్వలేదని ఆరోపించారు.

**స్థానిక నేతపై విమర్శలు, అభివృద్ధి పనులకు శ్రీకారం**

సభకు ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిర్యాలగూడలో రూ.200 కోట్లతో నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావును 'నమ్మకద్రోహి', 'నక్క జిత్తుల వ్యక్తి' అని అభివర్ణించారు. "జానారెడ్డి చెప్పులు, నీళ్లసీసాలు మోసిన భాస్కర్‌రావు, ఎమ్మెల్యేగా గెలిచాక ఆత్మగౌరవాన్ని ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ పాదాల దగ్గర పెట్టాడు. అలాంటి వ్యక్తికి మళ్లీ ఓటేస్తారా? గంగిరెద్దుల్లా ఓట్లు అడగడానికి వస్తే కర్రు కాల్చి వాత పెట్టండి" అని ప్రజలకు పిలుపునిచ్చారు.

**ప్రభుత్వ పథకాలే గెలిపిస్తాయి**

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి మున్సిపల్ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని ప్రజలను కోరారు. "పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. మేము లక్షలాది కార్డులిచ్చి సన్న బియ్యం అందిస్తున్నాం. ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతులకు ఎకరానికి రూ.6 వేల రైతు భరోసా, రూ.500 బోనస్‌తో పాటు రుణమాఫీ చేశాం. 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం" అని ప్రభుత్వ విజయాలను వివరించారు. ఓటు వేసే ముందు ఈ పథకాలన్నింటినీ గుర్తు చేసుకోవాలని కోరారు. మున్సిపల్ శాఖ తన వద్దే ఉందని, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే పట్టణాలను అద్దంలా తీర్చిదిద్దే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.





## బీజేపీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన చామల కిరణ్ రెడ్డి




నిన్న లోక్ సభలో 8 మంది కాంగ్రెస్ ఎంపీలను సస్పెండ్ చేశారు .పార్లమెంట్ లో వాస్తవాలు బయటకు రాకుండా బీజేపీ అడ్డుకుంటుంది.లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతుంటే అనురాగ్ ఠాగూర్,నిశికాంత్ దూబే లాంటి వాళ్ళు అడ్డు తగిలారు,రాహుల్ గాంధీ మైక్ ను స్పీకర్ వేరే వారికి ఇచ్చారు.దీనిపై ఆందోళన చేస్తే మమ్మల్ని సస్పెండ్ చేశారు

8 మంది ఎంపీల నోరును నొక్కే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేస్తోంది

బీజేపీకి లోక్ సభ సమావేశాలను సజావుగా నడపాలనే ఉదేశ్యం లేదు

దేశంలో ఉన్న ప్రజా సమస్యలపై పార్లమెంటులో మాట్లాడనివ్వడం లేదు

బీజేపీ ఇష్టానుసారంగా వ్యవహరిస్తోంది,మమ్మల్ని ప్రజలు గెలిపించింది ప్రజా సమస్యల గురించి పార్లమెంటులో మాట్లాడటం కోసమే .లోక్ సభ ప్రవేశ ద్వారం వద్ద బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేసిన 8 మంది సస్పెండ్ అయిన ఎంపీలు

# మంచి ఉన్నంత కాలమే మర్యాద లేదంటే యుద్ధమే!

## శక్తి ఇచ్చారు అభివృద్ధి చేసి చూపిస్తా! ఏదులాపురం మున్సిపాలిటీని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతాం మంత్రి పొంగులేటి







**ఖమ్మం ప్రతినిధి ఫిబ్రవరి 04** ఏదులాపురం మున్సిపాలిటీ రాష్ట్రంలో మన ప్రభుత్వం ఉంది మీ శ్రీనన్న మంత్రిగా కీలక స్థానంలో ఉన్నాడు. మీ దీవెనలతో ఏదంటే అది చేయగలిగే శక్తి నాకు వచ్చింది.. ఇక అభివృద్ధి చేసి చూపిస్తా అని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 28 వార్డు లో ఆయన విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గత పాలకుల తీరుపై నిప్పులు చెరిగారు

**రావణ కాష్టాన్ని పారద్రోలారు**

రాష్ట్ర ప్రజలు పదేళ్ల 'రావణాసుర' పాలనను అంతం చేసి, ప్రజా పరిపాలనను తెచ్చుకున్నారని మంత్రి వ్యాఖ్యానించారు. "మంచి ఉన్నంత కాలమే మర్యాద ఉంటుంది.. అది లేనప్పుడు యుద్ధం చేయాల్సిందే" అని ఆయన స్పష్టం చేశారు. గత ప్రభుత్వం కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిందని, పేదల ఇళ్ల కంటే దొరల ఇళ్లకే ప్రాధాన్యత ఇచ్చిందని ఆరోపించారు. కనీసం హాస్టల్ విద్యార్థులకు సరిగ్గా అన్నం పెట్టలేని వారు నేడు కబుర్లు చెబుతున్నారని అలాంటి వారిని నమ్మవద్దని కోరారు.

**పార్టీ రంగులు చూడబోం**

పేదరికమే ప్రామాణికం సొంతింటి కల నెరవేర్చే విషయంలో రాజకీయాలకు తావులేదని మంత్రి స్పష్టం చేశారు మీరు ఏ పార్టీకి ఓటు వేశారనేది నాకు అనవసరం. మీరు అర్హులైన పేదవాళ్లయితే చాలు.. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి తీరుతాం అని ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 22,500 కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టామని, వచ్చే ఏప్రిల్ నుంచి మరో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ చేస్తామని వెల్లడించారు. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తారీఖునే జీతాలు వంటి వాటితో నేడు ప్రతి ఇల్లూ సంతోషంగా ఉందన్నారు

**పెద్ద కొడుకుగా బాధ్యత నాది**

ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఒక మేటి (రోల్ మోడల్) మున్సిపాలిటీగా తీర్చిదిద్దే బాధ్యతను తాను తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు మీ ఇంటి పెద్ద కొడుకుగా మీ సమస్యలన్నీ తీరుస్తాను. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాను అని భరోసా ఇచ్చారు మాటలు చెప్పే వారిని కాకుండా పని చేసే వారిని గుర్తించాలని ప్రజలను కోరారు డిపాజిట్లు రాకుండా బుద్ధి చెప్పండి

ఈ నెల 11న జరిగే ఎన్నికల్లో ప్రత్యర్థులకు డిపాజిట్లు రాకుండా బుద్ధి చెప్పాలని మంత్రి పిలుపునిచ్చారు 28 వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి నూకల రామ్మోహన్ రెడ్డి హస్తం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు

ప్రజాబలం

05 ఫిబ్రవరి 2026 గురువారం

## అంతర్జాతీయ మార్కెట్‌లో భారత్ పైచేయి

భారత ఆర్థిక వ్యవస్థ అంతర్జాతీయ స్థాయిలో ఒక నూతన శకాన్ని ఆరంభించింది. ప్రపంచవ్యాప్తంగా అగ్రగామి దేశాలతో వరుసగా కుదుర్చుకుంటున్న వాణిజ్య ఒప్పందాలతో భారత్ తన ఆర్థిక వ్యూహాన్ని పూర్తిగా మార్చేస్తోంది. ముఖ్యంగా అమెరికాతో కుదిరిన తాజా చారిత్రక వాణిజ్య ఒప్పందం భారత్ ఆర్థిక చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోనుంది. ప్రపంచ స్థూల దేశీయ ఉత్పత్తిలో సగానికి పైగా వాటా కలిగిన దేశాలతో భారత్ ప్రస్తుతం వాణిజ్య బంధాలను కలిగి ఉండటం ఇక్కడ గుర్తించాల్సిన విషయం. కేవలం కొన్ని రోజుల వ్యవధిలోనే రెండు కీలకమైన అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేయడం ద్వారా దేశం తన వ్యూహాత్మక దౌత్యాన్ని అనుసరిస్తోంది.భారత్, అమెరికా మధ్య ట్రేడ్ డీల్ కు అంగీకారం జరిగిన తరువాత రష్యా చమురు కొనుగోలు హాట్ టాపిక్ అవుతోంది. అయితే రష్యా ముడి చమురును కొనడం పూర్తిగా ఆపివేయడం వల్ల ఇండియాకు సమస్యలు ఏర్పడవచ్చు. రేటింగ్ ఏజెన్సీ మూడీస్ ఫిబ్రవరి 3 తన నివేదికలో, భారత్ ఇటీవల నెలల్లో రష్యా నుండి ముడి చమురును కొనడం క్రమంగా తగ్గించిందని పేర్కొంది. అందుకు అమెరికానే కారణం అని తెలిసిందే. అయితే పూర్తి కొనుగోళ్లను ఒక్కసారిగా నిలిపివేస్తే ఆర్థికాభివృద్ధికి చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. ఇది దేశంలో సరఫరా లోటుకు కారణంగా మారవచ్చు. చమురు ధరలు పెరిగి ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపవచ్చు అని కొందరు నిపుణులు అంచనా వేశారు. ఎందుకంటే భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద చమురు దిగుమతిదారులలో ఒకటి.అమెరికాతో డీల్ కోసం భారత్ కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది. రష్యా నుంచి కాకుండా ఇతర దేశాల నుంచి చౌక ధరకు ముడి చమురు కొనడం సవాల్‌గా మారనుంది. ఇది ప్రపంచ వ్యాప్తంగా ధరల పెరుగుదలకు కారణం అవుతుందని, భారత్ వంటి అతిపెద్ద దిగుమతి చేసుకునే దేశంలో ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉందని మూడీస్ స్పష్టంగా పేర్కొంది. ఆర్థికాభివృద్ధిలో ఇబ్బందులను నివారించడానికి భారతదేశం వెంటనే అన్ని రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లను ఆపివేసే అవకాశం లేదని ఏజెన్సీ తెలిపింది.అమెరికా భారత వస్తువులపై టారిఫ్ 50 శాతం నుండి 18 శాతానికి తగ్గించిన వాణిజ్య ఒప్పందం కోసం వచ్చింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత్ త్వరలో రష్యా చమురును కొనడం ఆపివేస్తుందన్నారు. ఇకనుంచి వెనిజులా నుండి ఎక్కువ చమురును కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. భారత్ అమెరికా నుండి 500 బిలియన్ డాలర్లకు పైగా ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందని, ఇందులో ముడి చమురు కూడా ఉంటుందని ట్రంప్ అన్నారు. అయితే, ప్రధాని మోదీ మాత్రం టారిఫ్ తగ్గించడంపై మాత్రమే మాట్లాడారు. కానీ రష్యా చమురును ఆపివేయడం గురించి స్పష్టత ఇవ్వలేదు. రష్యా చమురు కొనుగోలు కారణంగా విధించిన అదనపు 25 శాతం పెనాల్టీ సుంకాన్ని తొలగించారని, అలాంటి కొనుగోళ్లను ఆపివేయడానికి భారత్ అంగీకరించిందని వైట్ హౌస్ అధికారి పేర్కొన్నారు. అయితే, మూడీస్ విశ్లేషణ ప్రకారం, భారత్ ఈ మార్పును నెమ్మదిగా అమలు చేస్తుంది, ఎందుకంటే తక్షణ మార్పు భారత్ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ఈ ఒప్పందం ఆభరణాలు, రత్నాలు, టెక్స్‌టైల్ వంటి రంగాలలో భారత ఎగుమతులకు ప్రయోజనం చేకూరుస్తుంది, ఎందుకంటే అమెరికా భారత్‌కు అతిపెద్ద ఎగుమతి మార్కెట్. డీల్ ప్రకటన తర్వాత, స్టాక్ మార్కెట్లో జోరు కనిపించింది. నిఫ్టీ దాదాపు 3 శాతం పెరగగా, రూపాయి బలపడి డాలర్‌కు 90.40 వద్దకు చేరుకుంది.భారత్ వాణిజ్య శాఖ గడిచిన 12 నెలల్లో అత్యంత చురుగ్గా వ్యవహరించింది. అమెరికాతో కుదిరిన తాజా ఒప్పందానికి కొద్ది రోజుల ముందే భారత్, యూరోపియన్ యూనియన్‌తో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌పై సంతకాలు చేసింది. ఒకే సంవత్సరంలో ప్రపంచంలోని రెండు అతి పెద్ద ఆర్థిక శక్తులతో కుదుర్చుకోవడం భారత ఆర్థిక చరిత్రలో ఇదే తొలిసారి. వీటితోపాటు బ్రిటన్, ఓమన్, న్యూజిలాండ్‌తో కూడా భారత్ వాణిజ్య ఒప్పందాలను పూర్తి చేసుకుంది. ఈ ఐదు దేశాలు సహా భారత్‌కు చెందిన మొత్తం జీడీపీని లెక్కిస్తే అది ప్రపంచ మొత్తం జీడీపీలో సుమారు 50 నుంచి 55 శాతం వరకు ఉంటుంది. కేవలం భారత్, యూరోపియన్ యూనియన్ వాటానే ప్రపంచ జీడీపీలో 25 శాతంగా ఉంది. గణాంకాలు అంతర్జాతీయ మార్కెట్‌లో భారత్ ఎదుగుతున్న శక్తిని స్పష్టం చేస్తున్నాయి. ఈ ఒప్పందం భారత్‌కు పొరుగు దేశాలైన బంగ్లాదేశ్ వియత్నాం, థాయ్‌లాండ్‌లతో పోలిస్తే గొప్ప పోటీతత్వాన్ని కల్పించనుంది. ప్రస్తుతం అమెరికా విధించిన కొత్త నిబంధనల ప్రకారం... బంగ్లాదేశ్‌పై 20 శాతం, వియత్నాం 20 శాతం, థాయిలాండ్‌పై 19 శాతం టారిఫ్‌లు ఉన్నాయి. కానీ భారత్‌కు ఇది కేవలం 18 శాతానికి తగ్గడం వల్ల అమెరికా మార్కెట్‌లో భారతీయ వస్తువుల ధరలు తగ్గి గిరాకీ పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అమెరికా ప్రథమ స్థానంలో ఉండగా, యూరోపియన్ యూనియన్ ద్వితీయ స్థానంలో ఉంది. భారత్ ఇప్పటికే ప్రపంచంలో నాల్గో అతి పెద్ద ఆర్థికవ్యవస్థగా ఉంది. బ్రిట్ కూడా టాప్ -5 ఆర్థిక వ్యవస్థల జాబితాలో కొనసాగుతోంది. ఈ ప్రభావవంతమైన ఆర్థిక శక్తులన్నీ ఇప్పుడు భారత్‌తో దృఢమైన వాణిజ్య బంధాన్ని కలిగి ఉన్నాయి. ప్రపంచ మొత్తం వాణిజ్యంలో ఈ కూటమి వాటా 38 నుంచి 40 శాతం వరకు ఉన్నట్టు లెక్కలు చూస్తున్నాయి. ఇవే కాకుండా, భారత్ ఇప్పటికే జపాన్, దక్షిణ కొరియా, ఆసియాన్ దేశాలు, సార్క్ దేశాలు, మారిషస్, యూఏఈ , ఆస్ట్రేలియా వంటి దేశాలతో ప్రాంతీయ, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను కలిగి ఉంది. తాజా ఒప్పందాలతో భారత తయారీ రంగం సేవా రంగానికి అంతర్జాతీయ మార్కెట్లు భారీగా అందుబాటులోకి రానున్నాయి. భారత్ తన వాణిజ్య విధానాల్లో చూపిస్తున్న ఈ దూకుడు ప్రపంచ దేశాలను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. చైనా వంటి దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని చూస్తున్న పాశ్చాత్య దేశాలకు భారత్ ఇప్పుడు ఒక నమ్మకమైన, బలమైన ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. సుంకాల తగ్గింపు వ్యూహాత్మక భాగస్వామ్యాలు, స్థిరమైన ఆర్థిక వృద్ధి భారత్‌ను త్వరలోనే 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ దిశగా నడిపిస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదని నిపుణులు అంటున్నారు.

# ఫిలిం ఇండస్ట్రీకి కేంద్రంగా హైదరాబాద్





**సమాజం కోసం, కళల ద్వారా జీవితాన్ని త్యాగం చేసిన మహానుభావుడు గద్దర్**

**గద్దర్ ఫిలిం అవార్డుల జ్యూరీ సభ్యుల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** తెలుగు సినీ పరిశ్రమకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుంది, దేశవ్యాప్తంగా ఫిలిం ఇండస్ట్రీకి హైదరాబాదును కేంద్రంగా చేయాలన్న ఆలోచనతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంది అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం సెక్రటేరియట్ లో గద్దర్ సినిమా అవార్డుల జ్యూరీ సభ్యుల సమావేశంలో మాట్లాడారు. బాంబే, కలకత్తా, చెన్నై వంటి పట్టణాల్లో సినీ ఇండస్ట్రీ పెరగడానికి అంతగా అవకాశాలు లేవు కానీ దేశంలో ఉన్న అన్ని భాషల ఇండస్ట్రీ హైదరాబాద్ లో విస్తరించడానికి సానుకూల అంశాలు అనేకంగా ఉన్నాయని డిప్యూటీ సీఎం తెలిపారు. సకల భాషల సినీ ఇండస్ట్రీ, హైదరాబాద్ కు తరలి వస్తే రాష్ట్ర యువతకు, టెక్నీషియన్లు, రైటర్లు, డైరెక్టర్లకు ఉపాధి లభిస్తుంది. సినీ ప్రపంచ మార్కెట్ కు హైదరాబాద్ కేంద్రంగా మారుతుందని తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్లూ ప్రింట్ ప్రభుత్వం తయారు చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వం కొన్ని దశాబ్ద కాలం పాటు సినిమా రంగానికి సంబంధించిన అవార్డుల విషయంలో నిర్లక్ష్యం వహించి వదిలేస్తే సమాజంలో అత్యంత ప్రభావం చూపే సామాజిక పరివర్తన తీసుకొచ్చే సినీ రంగాన్ని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అవార్డులు ఇచ్చి తిరిగి ప్రోత్సహించడం ప్రారంభించింది అని వివరించారు. సమాజం కోసం కళల ద్వారా జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహానుభావుడు గద్దర్ అని డిప్యూటీ సీఎం తెలిపారు. తెలంగాణ అంటే కళలు, విప్లవం, ప్రశ్నించడం, సున్నిత మనసుతో, ప్రేమానురాగాలతో కూడినదని, తెలంగాణ కళలు, సంస్కృతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి గద్దర్ అని తెలిపారు. అందుకే వారి పేరు మీద గత సంవత్సరం నుండి సినిమా అవార్డులు ఇవ్వడం ప్రారంభించి సినీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ, పారదర్శకత లే ప్రమాణంగా సినిమా అవార్డుల ఎంపిక ఉంటుందని, గత సంవత్సరం జ్యూరీ సభ్యులు అవార్డుల ఎంపికను గొప్పగా నిర్వహించి అభినందనలు పొందిన విషయాన్ని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. సినీ రంగ ప్రముఖులకు ఉన్న అనుభవాన్ని, నిబద్ధతను, సినిమా రంగం పట్ల వారికున్న అభిమానాన్ని దృష్టిలో పెట్టుకొని ఎఫ్ డి సి ద్వారా అందరితో సంప్రదింపులు జరిపి జ్యూరీ సభ్యులుగా ఎంపిక చేశారని ప్రభుత్వ నుంచి కావలసిన సహకారాన్ని పూర్తిస్థాయిలో అందజేస్తామని తెలిపారు. ప్రతి పని సమాజానికి ఉపయోగపడాలి, ప్రజలకు జవాబు దారిగా ఉండాలన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. గద్దర్ అవార్డుకు ఎంపిక చేసే సినిమాలో కమర్షియల్ అంశంతో పాటు సామాజిక సందేశం తప్పనిసరిగా ఉండేలా జాగ్రత్త తీసుకుంటే రాబోయే రోజుల్లో సమాజంలో మంచి సినిమాలను ప్రోత్సహించేందుకు అవకాశం ఉంటుందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈనెల 6 నుంచి గద్దర్ సినిమా అవార్డుల స్క్రీనింగ్ కార్యక్రమం ప్రారంభమవుతుంది 19న ఉగాది పండుగ రోజు గద్దర్ అవార్డుల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని తెలిపారు.

గద్దర్ అవార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా, ప్రపంచవ్యాప్తంగా ఓ గొప్ప సందేశం ఇచ్చేలా గత సంవత్సరం నిర్వహించాం, ఈ సంవత్సరం కూడా అదే రీతిలో పెద్ద ఎత్తున గద్దర్ అవార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించేందుకు ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్, × ధూ= శాఖలకు పూర్తి స్వాతంత్రం, అవసరమైన సహాయం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, × ఢజూతీ కమిషనర్ ప్రియాంక, టఏఆ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్ బాబుతో పాటు సినీ ప్రముఖులు తనికెళ్ల భరణి, ఎం రామారావు, రోజా రమణి, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ కి గుండు సున్నా

## మహేష్ కుమార్ గౌడ్



మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ కి గుండు సున్నా వచ్చే అవకాశం

బీజేపీ జాతీయ అధ్యక్షుడి రాక అందులో భాగమే మున్సిపల్ ఎన్నికల్లో మతం పేరుతో బీజేపీ రెచ్చగొట్టే ప్రయత్నం

తెలంగాణ ప్రజలారా తస్మాత్ జాగ్రత్త

8 మంది బీజేపీ ఎంపీలు,ఇద్దరు కేంద్ర మంత్రులు ఉంది బడ్జెట్ లో రాష్ట్రానికి ఎంత ఇచ్చారో బీజేపీ అధ్యకుడి సమాధానం చెప్పాలి

ఓట్ చోరీ తోనే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీలుగా గెలిచారు

కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన హామీ చట్టం ప్రకారం తెలంగాణకు న్యాయంగా రావాల్సిన పథకాలు, నిధులు, ప్రాజెక్టులు మంజూరు చేయడం లేదు.

బయ్యారం స్టీల్ ప్లాంట్, నీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా, నవోదయ పాఠశాలలు, ఐఐఎమ్ ఏర్పాటుతో పాటు పలు అంశాల్లో అన్యాయం చేసింది.

తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యంగా రాష్ట్రం ప్రణాళికలు రూపొందిస్తూ దేశ, అంతర్జాతీయ సంస్థల నుండి పెట్టుబడులను ఆకర్షిస్తుంటే కేంద్రం మాత్రం రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు సహకరించడం లేదు.

Rrr రోడ్డు, మెట్రో రైలు, మూసీ ప్రాజెక్టు వంటి కీలకాంశాలను విస్మరిస్తుంది.

బయో, ఫార్మ, సెమి కండక్టర్ పరిశ్రమల్లో, టూరిజంలో రాష్ట్రాన్ని విస్మరించారూ

దేశా జీడీపీలో తెలంగాణ వాటా 5.01 శాతం. ఈ లెక్కన కేంద్రం ఉండి రూ.3.76 లక్షల కోట్లు దక్కాల్సి ఉన్నా గత ఐదేళ్లలో రూ.1.84 లక్షల కోట్లు మాత్రమే వచ్చాయి

జీఎస్టీ వసూళ్లలో తెలంగాణ ఐదేండ్లలో రూ.4.32 క్షల కోట్లు కేంద్రానికి ఇస్తే రాష్ట్రానికి తిరిగి రూ.3.76 లక్షల కోట్లే ఇచ్చింది

సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా బడ్జెట్ లో కేంద్ర ప్రభుత్వం ఉత్తరాది రాష్ట్రాలకు పెద్ద పీట వేస్తూ దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తోంది.

తెలంగాణ ప్రజలు కడుతున్న ట్యాక్స్ గుజరాత్ ,నౌత్ రాష్ట్రాలకు తరలించడానికి బడ్జెట్

మత వైషమ్యాలకు అతీతంగా సోదరభావంతో మెలిగే తెలంగాణ ప్రజలు బీజేపీని ఆదరించరూ

జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో మతం పేరుతో రెచ్చగొట్టిన బీజేపీకి డిపాజిట్ దక్కలేదు

మహిళలకు బడ్జెట్ లో 90 వేల కోట్ల నిధులు కోత పెట్టారు

బీసీలకు ఇచ్చింది 13 వేల 600 కోట్లు మాత్రమే

భైంసా అల్లర్లను ఆసరాగా చేసుకొని బీజేపీ నేతలు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు పొందారు

అభివృది, సంక్షేమం పేరిట కాంగ్రెస్ ఓట్లు అడుగుతుంది

తెలంగాణ ప్రజలు మున్సిపల్ ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి

# ఉద్యోగాలిస్తామని మోసం చేసిన ప్రభుత్వం

హైదరాబాద్ రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీనిచ్చి రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని నిరుద్యోగ జేఏసీ నేతలు ధ్వజమెత్తారు.బుధవారం నాడు ఇందిరా పార్క్ వద్ద ఉద్యోగ నోటిఫికేషన్ సాధనకై హలో నిరుద్యోగి చలో ఇందిరా పార్క్ మహా ధర్నా కార్యక్రమాన్ని నిరుద్యోగులు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ హేమ సుదర్శన్ జిల్లోజు హాజరై మద్దతు నిచ్చారు. ఈ సందర్భంగా జేఏసీ నిరుద్యోగులు మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగానే రేవంత్ ప్రభుత్వం కూడా నిరుద్యోగులను నిండా మోసం చేస్తుందని వాపోయారు. రాహుల్ గాంధీ చిక్కడపల్లికి వచ్చి నిరుద్యోగులకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ గెలుపుకు నిరుద్యోగులంతా కలసి ఉద్యోగాలు కల్పిస్తారని ఆశ చూపిస్తే ఈ రోజు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. లక్ష ఉద్యోగాలు ఇచ్చామని బుకాయించడమే తప్ప చేసింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను పట్టించుకోకపోతే రాబోయే రోజుల్లో మున్సిపల్ ఎన్నికలలో మా సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు.

# ఘనంగా వన దేవతల తిరుగువారం పండుగ

## అమ్మవార్లను దర్శించుకున్న 5లక్షల మంది భక్తులు
## 5 వేల మంది కార్మికులతో నిరంతరం పారిశుధ్య పనులు
## మంత్రి ధనసరి అనసూయ సీతక్క.




**ప్రజాబలం ములుగు జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 4 ::** బుధవారం ఎస్ ఎస్ తాడ్వాయి మండలం మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర తిరుగువారం పండగ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ లతో కలిసి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

అనంతరం మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్ ఎస్పీ లతో కలిసి జాతర చుట్టూ పరిసర ప్రాంతాలను పరిశీలించి నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టాలని స్వచ్ఛమైన మేడారం గ్రామాన్ని గ్రామస్తులకు అందించే విధంగా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ బుధవారం మేడారం జాతర తిరువారం పండుగ ఘన నిర్వహించుకోవడం జరిగిందని సుమారు 5 లక్షల మంది భక్తులు వనదేవతలను దర్శించుకున్నారని తెలిపారు.

ప్రధాన జాతర ముగిసిన అనంతరం కూడా భక్తుల రద్దీ కొనసాగుతున్న నేపథ్యం లో వారందరికీ ఎటువంటి ఇబ్బంది లేకుండా తాగునీరు,శానిటేషన్ గానీ రవాణా సౌకర్యం ఎటువంటి లోపం లేకుండా చర్యలు తీసుకున్నామని అన్నారు.

2026 మేడారం మహా జాతరకు సుమారు రెండు కోట్ల మందికి పైగా భక్తులు వచ్చారని ఇంకా వారం రోజులపాటు భక్తుల రద్దీ కొనసాగుతుందని పేర్కొన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం జరిగిందని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి,డీఎస్పీ,ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# వన దేవతల సన్నిధిలో భక్త జనసందోహం.




**ప్రజా బలం ములుగు జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 4 ::** శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర బుధవారం తిరుగువారం సందర్భంగా వన దేవతల సన్నిధిలో భక్త జనసందోహం తో కోలాహలంగా మారింది.

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొదట గా జంపన్న వాగు లో పుణ్య స్నానాలు ఆచరించి వన దేవతలకు బంగారం,ఓడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తుల రద్దీ కొనసాగుతున్నా తరుణం లో అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

జాతర పరిసర ప్రాంతాలలోని వ్యర్థాలను పారిశుధ్య కార్మికుల ద్వారా తొలగిస్తూ వ్యాధులు ప్రబలకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



తిరుగువారం సందర్భంగా వన దేవతల పూజారులు కన్నేపల్లి ఆలయం లో శుద్ధి కార్యక్రమం నిర్వహించి వన దేవతలకు దీప దూప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అమ్మవార్ల పూజ సామాగ్రి,పట్టు వస్త్రాలను పూజారులు భద్రపరుస్తారు.

# అక్రమ మద్యం పట్టివేత



**మేడ్చల్ -- మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఫిబ్రవరి 04:** మున్సిపాలిటిలు, మున్సిపల్ కార్పొరేషన్ ల సాధారణ ఎన్నికల 2026 నేపథ్యంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఎల్లంపేట్ మున్సిపాలిటిలోని రావల్ కోల్ గ్రామం లో ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేయగా కె.సాయి కుమార్ నా/శీ పాండు ఇంట్లో అక్రమంగా నిల్వ ఉన్న 12.72 లీటర్ల మద్యం ను ఎల్లంపేట్ ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం, పోలీసు అధికారులు సీజ్ చేసారు. అనంతరం స్థానిక ఎస్సై మన్మధ కొనారికి అప్పగించారు.

# మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు అండగా మేమున్నాం




**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:** మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు అండగా మేమున్నాం అనే భరోసా ఇచ్చి వారికి ఆర్థిక సహాయం అందజేస్తున్న తెలంగాణ మీడియా అకాడమీ జర్నలిస్టుల సంక్షేమ కార్యక్రమం అభినందనీయం అని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు.

బుధవారంనాడు నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి ఆడిటోరియంలో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ మరియు అకాడమి ప్రచురించిన చిరుపుస్తకాలు (మోనోగ్రాఫ్స్) ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావుతో కలిసి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసనమండలి చైర్మన్ మాట్లాడుతూ, అక్షరమే ఆయుధంగా క్షేత్రస్థాయిలో పని చేసే జర్నలిస్టులు అకాల మృతి చెందడం బాధాకరమన్నారు. మరణించిన జర్నలిస్టుల కోసం రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమ నిధి నుండి ఆర్థిక సహాయంగా లక్ష రూపాయలు మంజూరు చేయడంతోపాటు అయిదు సంవత్సరాల పాటు పెన్షన్ సదుపాయం కల్పించడం మరణించిన జర్నలిస్టు కుటుంబాలకు తోడ్పడుతుందని అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా పాత్రికేయ రంగంలో అనేక సంవత్సరాలు సేవలందించిన ప్రముఖ జర్నలిస్టు జీవిత విశేశాలు తెలిపే చిరు పుస్తకాలు (మోనోగ్రాఫ్స్) ఆవిష్కరించడం వలన రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. నేటి సమాజంలో ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో ఎన్ని మార్పులు వచ్చినా తను నేను మాత్రం పత్రికలు చదివితేనే సంతృప్తి చేందుతానని తన అభిప్రాయాన్ని వెల్లడించారు.

విద్యా, ప్రజా వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు కె. కేశవ రావు మాట్లాడుతూ, ప్రముఖుల చరిత్ర తెలిపే పుస్తకం చదవడం సులభం. కాని అదే చరిత్ర ను మోనోగ్రాఫ్ గా అందించడం మాటలు కాదు. అది అక్షర రూపం దాల్చడంలో భాగస్వాములైన అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. సమాజానికి అద్దం పట్టేది వార్త అయితే ఆ వార్త వెనుక ఉన్న నిజాన్ని వెలికితీసిన జర్నలిస్ట్ భవిష్యత్తు తరాలకు దారి చూపిన వారవుతారు. సోషల్ మీడియా ను కంట్రోల్ చేయడం ఎవరి తరం కాదన్నారు. కానీ దీనిపై మన జర్నలిస్టులందరూ ఎకతాటిపై వచ్చి చర్చించడం లేదా వర్క్ షాప్ లు నిర్వహించి కొంత మార్పుకు నాంది పలకాలన్నారు.

తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, చనిపోయిన 18 మంది జర్నలిస్టుల కుటుంబాలకు ఒక లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం చెక్కుల పంపిణీ, ప్రమాదానికి గురైన జర్నలిస్టుకు 50 వేల ఆర్థిక సహాయం చెక్కును అందజేసినట్లు ఆయన వివరించారు. ప్రముఖ పాత్రికేయులైన 1. అబిద్ అలీఖాన్, 2. డి. సీతారాం, 3. బేతనబొట్ల నాగేశ్వరరావు, 4.పొత్తూరి వెంకటేశ్వరరావు, 5.ఎం.ఎస్.ఆచార్య, 6.ఎ.బి.కె. ప్రసాద్, 7.జి.ఎస్. వరదాచారి, 8.సి.రాఘవాచారి, 9.వి.హనుమంతరావు, 10.ఆదిరాజు వెంకటేశ్వరరావులపై మీడియా అకాడమి ప్రచురించిన 10 చిరుపుస్తకాలు (మోనోగ్రాఫ్స్) ఆవిష్కరణ చేసుకున్నట్లు ఆయన వివరించారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, సీనియర్ జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిపక్షాల నిరవధిక నిరసన..
## గందరగోళం మధ్య లోక్‌సభ వాయిదా..



న్యూ డిల్లీ ఫిబ్రవరి 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );లోక్‌సభలో ప్రతిపక్షాలు బుధవారం భారీ నిరసన చేపట్టాయి. స్పీకర్ పోడియంతోపాటు ప్రధాని మోదీ కూర్చునే సీటు వద్దకు పలువురు ఎంపీలు వచ్చి ఆందోళన చేశారు. అందులోనూ కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళా ఎంపీలు కూడా ఈ ఆందోళనలో పాల్గొన్నారు. విపక్షాల ఆందోళన మధ్య సభ వాయిదా పడింది.దీంతో ప్రధాని మోదీ ధన్యవాద ప్రసంగం కూడా వాయిదా పడినట్లైంది. షెడ్యూల్ ప్రకారం నేటి సాయంత్రం ప్రధాని మోదీ సభలో మాట్లాడాలి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రసంగించాల్సి ఉంది. అయితే, సాయంత్రం ఐదు గంటల తర్వాత సభ ప్రారంభంకాగానే విపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. దీంతో సభ గురువారానికి వాయిదా పడింది. ప్రధాని ప్రసంగం కూడా రేపే ఉండే అవకాశం ఉంది. సభలో రాహుల్ గాంధీ ఒక పుస్తకం గురించి ప్రస్తావిస్తున్న సంగతి తెలిసిందే. భారత సైన్య మాజీ అధిపతి ఎంఎం నరవాణే రచించిన పుస్తకంలోని కొన్ని అంశాల్ని చదివేందుకు ఆయన ప్రయత్నించగా.. ఇందుకు స్పీకర్ అనుమతించలేదు. దీంతో రాహుల్ సహా, కాంగ్రెస్ ఎంపీలు సభలో నిరసనకు దిగారు. బుధవారం ఉదయం నుంచి వారి నిరసన కొనసాగుతూనే ఉంది.ఈ నేపథ్యంలో సభ పలుమార్లు వాయిదాపడింది. మరోవైపు రాహుల్ గాంధీ ఈ రోజు ఉదయం మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ సభకు వస్తే.. ఈ పుస్తకాన్ని తానే ఆయనకు అందిస్తానని, అయితే, ఆయన సభలోకి వస్తారని అనుకోవడం లేదని అన్నారు. ఇదే సమయంలో రాహుల్ గాంధీకి, కేంద్ర మంత్రి రవనీత్ సింగ్ బిట్టుకు మధ్య పార్లమెంట్ ప్రాంగణంలో చిన్న వాగ్వాదం జరిగింది. రవనీత్‌ను ద్రోహి స్నేహితుడు అంటూ రాహుల్ అభివర్ణించారు. దీనికి ఆయన కూడా గట్టిగానే బదులిచ్చారు. కానీ, రవనీత్‌పై రాహుల్ వ్యాఖ్యల్ని బీజేపీకి చెందిన సిక్కు ఎంపీలు ఖండించారు.

# జమ్మూకశ్మీర్‌లో భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య ఎన్‌కౌంటర్

## ఇద్దరు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్ ఫిబ్రవరి 4 జమ్మూకశ్మీర్‌లో భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఈ ఎన్‌కౌంటర్‌లో భద్రతా బలగాలు ఇద్దరు ఉగ్రవాదులను హతం చేశాయి. ఉదంపూర్‌లో జైషే మహ్మద్‌కు చెందిన ఉగ్రవాదులు నక్కినట్లు సమాచారం అందింది. దీంతో భద్రతా బలగాలు, సిఆర్‌పిఎఫ్ బలగాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డాయి. దీంతో ఎన్‌కౌంటర్ ప్రారంభమైంది. అనంతరం అక్కడి నుంచి పారిపోయిన ఉగ్రవాదులు ఓ గుహలో దాక్కున్నారు. ఉగ్రవాదులు గుహలో ఉన్నట్లు సమాచారం అందడంతో మరోసారి గాలింపు చర్యలు చేపట్టారు. స్థానికులకు ఎలాంటి హానీ జరగకుండా ఈ ఆపరేషన్‌ను ముందుకు తీసుకెళ్లారు. ఉగ్రవాదులను గుర్తించి ఎన్‌కౌంటర్‌లో హతమార్చారు. హతమైన ఇద్దరు ఉగ్రవాదుల్లో ఒకరు పాక్ జాతీయుడు కాగా, మరొకరు స్థానికుడు. వారి నుంచి ఎం4 కార్బైన్ రైఫిల్స్, ఎకె-47 రైఫిల్స్, మందు గుండు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

# మరో వివాదంలోమంచు ఫ్యామిలీ

తిరుపతి, ఫిబ్రవరి 4, మంచు మోహన్ బాబు, మంచు విష్ణు మరోసారి వార్తల్లోకి ఎక్కారు. తిరుపతి లో మోహన్ బాబు యూనివర్సిటీ వద్ద ధర్నా చేస్తున్న ఎస్ ఎఫ్ ఐ సంఘం వాళ్ళను కిడ్నాప్ చేయించారని మోహన్ బాబు, మంచు విష్ణు, సతీష్ లపై తిరుచానూరు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయ్యింది. రీసెంట్ గానే రేణుగుంట విమానాశ్రయం లో పోలీసులు సతీష్ ని అదుపులోకి తీసుకున్నారు. మరి ఇప్పుడు మోహన్ బాబు, మంచు విష్ణులను కూడా అదుపులోకి తీసుకుంటారో లేదో చూడాలి. పూర్తి వివరాల్లోకి వెళ్తే మోహన్ బాబు యూనివర్సిటీ లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని చాలా కాలం నుండి ఆరోపణలు వస్తున్న సంగతి తెలిసిందే. మోహన్ బాబు చిన్న తనయుడు మంచు మనోజ్ కూడా ఈ విషయం పై పెద్ద పోరాటమే చేసాడు. కొట్లాట వరకు వెళ్లి పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చింది.అయితే రీసెంట్ విద్యార్థి సంఘాలు కూడా మోహబ్ బాబు యూనివర్సిటీ ఎదుట ధర్నాలు చేయడం మొదలు పెట్టాయి. విద్యార్థుల నుండి అన్యాయంగా అధిక ఫీజులు వసూలు చేసారని, తక్షణమే వాళ్లకు ఆ ఫీజులను తిరిగి చెల్లించాలని నేతలు డిమాండ్ చేశారు. దీంతో ఆగ్రహించిన మోహన్ బాబు తన బౌన్సర్ల చేత వాళ్ళను కిడ్నాప్ చేయించినట్టు తెలుస్తోంది. కారులో వచ్చిన మోహన్ బాబు బౌన్సర్లు సినీ ఫక్కీలో విద్యార్థుల సంఘాల నేతలను ఎక్కించుకొని, మోహన్ బాబు ఫామ్ హౌస్ లో బంధించారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే మోహన్ బాబు ఫామ్ హౌస్ కి వెళ్లి విద్యార్థుల సంఘం నేతలను విడిపించి బౌన్సర్లను అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియా లో బాగా వైరల్ అయ్యాయి. అయినప్పటికీ ఈ వ్యవహారం పై మోహన్ బాబు ఎలాంటి రెస్పాన్స్ కూడా ఇవ్వలేదు.విద్యార్థుల నుండి అక్రమంగా వసూలు చేసిన అదనపు ఫీజులను తిరిగి చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ మోహన్ బాబు పట్టించుకోకపోవడం తో విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు.ఈ నేపథ్యం లో వాళ్ళ బాధను అర్థం చేసుకున్న ఎస్ఎఫ్ఐ సంఘం, మరియు ఇతర విద్యార్థుల సంఘాలు యూనివర్సిటీ వద్ద ధర్నా చేపట్టి విద్యార్థుల బాధని మోహన్ బాబు కి అర్థం చేసే ప్రయత్నం చేశారు. అలాంటి వాళ్లకు సర్దిచెప్పి పంపాల్సింది పోయి, అహంకారంతో ఇలా కిడ్నాప్ చేయడం అమానుషం అంటూ సోషల్ మీడియా లో నెటిజెన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

# ఆ మూడు సీట్లు దక్కేదెలా

విజయవాడ, ఫిబ్రవరి 4, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇప్పటికీ ఒక లోటు ఉంది. రాష్ట్రమంతటా గెలిచామని ఆ పార్టీ భావిస్తోంది. కానీ ఓ మూడు చోట్ల మాత్రం ఆ పార్టీకి ఇప్పటివరకు విజయం దక్కలేదు. జగన్ ప్రభంజనంలో సైతం ఆ మూడు చోట్ల టిడిపి విజయం సాధించింది. విజయవాడ, గుంటూరు, శ్రీకాకుళం పార్లమెంట్ స్థానాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నో రకాల ప్రయోగాలు చేసింది. కానీ ఆ ప్రయోగాలు ఏవి ఫలించలేదు. ఎప్పటికప్పుడు అభ్యర్థులను మార్చింది. ఆ మార్పు ఎంతవరకు కూడా లాభం చేకూర్చలేదు. పైగా ఎంపీలుగా పోటీ చేసిన వైసీపీ నేతలకు అడ్రస్ లేకుండా పోయింది. రాజకీయ జీవితం లేకుండా పోయింది. ముఖ్యంగా విజయవాడ నుంచి పోటీ చేసిన ముగ్గురు నేతలు వైసీపీలో లేకుండా పోయారు. అందుకే ఇప్పుడు బలమైన అభ్యర్థిని రంగంలోకి దించాలని చూస్తున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎవరూ చిక్కడం లేదు. విజయవాడలో పోటీ అంటేనే నేతలు భయపడిపోతున్నారు.2014లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇక్కడ బలమైన అభ్యర్థి అవుతారని భావించి.. పారిశ్రామికవేత్త కోనేరు ప్రసాద్ ను రంగంలోకి దించింది. అంతకు ముందు రెండు ఎన్నికల్లో ఇక్కడ తెలుగుదేశం పార్టీ ఓడిపోవడంతో.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఎక్కువగా ఉంటుందని భావించింది. కానీ వైసీపీ లెక్కలు తప్పాయి. టిడిపి అభ్యర్థి కేసినేని నాని ఘనవిజయం సాధించారు. అయితే ఆ ఎన్నికల తరువాత కోనేరు ప్రసాద్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలకు దూరమయ్యారు. రాజకీయాలకు సైతం గుడ్ బై చెప్పారు.2019 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. అయితే అప్పట్లో కూడా విజయవాడ పార్లమెంటు స్థానం దక్కించుకోలేకపోయింది. రెండోసారి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన కేసినేని నాని ఇక్కడ ఘనవిజయం సాధించారు. ఆర్థిక బలం ఉన్న పొట్లూరు వరప్రసాద్ ను రంగంలోకి దించింది. ఆయన ప్రముఖ నిర్మాతగా కొనసాగుతుండగా పార్టీ అభ్యర్థిగా ప్రకటించారు జగన్. అయితే రాష్ట్రమంతటా ప్రభంజనం వీచింది కానీ .. విజయవాడలో మాత్రం టిడిపి అభ్యర్థి కేసినేని నాని గెలిచి పట్టు నిలుపుకున్నారు. అయితే ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత పొట్లూరు వరప్రసాద్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దూరమయ్యారు. క్రమేపి రాజకీయాలకు సైతం గుడ్ బై చెప్పారు.2024 ఎన్నికల్లో అనూహ్యంగా రెండుసార్లు ఎంపీగా పోటీ చేసి గెలిచిన కేశినేని నాని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. అంతకుముందు రెండుసార్లు గెలిచేసరికి అదంతా తన చరిష్మ అన్నట్టు భావించారు. అయితే ఆయన పై టిడిపి అభ్యర్థిగా తమ్ముడు కేసినేని చిన్ని పోటీ చేసి గెలిచారు. దీంతో క్రియాశీలక రాజకీయాలకు గుడ్ బై చెబుతున్నట్లు కేశినేని నాని ప్రకటించారు. అయితే విజయవాడలో పోటీ చేస్తున్న వారంతా ఇలా రాజకీయాలకు గుడ్ బై చెప్పడం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సెంటిమెంట్ గా మారింది. అక్కడ పోటీ చేసేందుకు ఎవరు ముందుకు రాని పరిస్థితి నెలకొంది.

# ఏపీ చరిత్రలో సరికొత్త అధ్యాయం

## 6న క్వాంటమ్ వ్యాలీకి భూమి పూజ

విజయవాడ, ఫిబ్రవరి 4, ఆంధ్రప్రదేశ్ చరిత్రలో సరికొత్త అధ్యాయం ప్రారంభం కాబోతోంది.. చంద్రబాబు కలల ప్రాజెక్ట్‌కు సంబంధించి కీలక ముందడుగు పడబోతోంది. ఈ నెల 6న అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ నిర్మాణాలకు సంబంధించి భూమిపూజ చేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా సమీక్షించారు. ఈ నెల 6న ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అమరావతిలో భూమిపూజ కార్యక్రమం నిర్వహించనున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు కలల ప్రాజెక్ట్ క్వాంటమ్ వ్యాలీ దిశగా మరో కీలక ముందడుగు పడింది. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ నిర్మాణాలకు సంబంధించిన భూమిపూజకు ముహూర్తం ఫిక్స్ అయ్యింది. ఈ నెల 6న ఉదయం 11 గంటలకు అమరావతిలోని ఉద్దండరాయునిపాలెం సమీపంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్న క్వాంటమ్ వ్యాలీ నిర్మాణాలకు భూమిపూజ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్ట్ కోసం ఏపీ ప్రభుత్వం 50 ఎకరాల భూమిని కేటాయించిన సంగతి తెలిసిందేమరోవైపు అమరావతిలో ఏఐ లివింగ్ ల్యాబ్స్ పేరుతో ఓ యూనివర్శిటీ ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ఐటీశాఖ ప్రతిపాదనపై ఇవాళ జరిగే కేబినెట్ సమావేశంలో చర్చిస్తారు. ఈ వర్శిటీలో స్కూల్ విద్యార్థుల నుంచి పీజీ వరకు ఏఐలో విద్యా బోధన ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ రానుండటంతో ఈ వర్శిటీ అనుబంధంగా ఉంటుందని చెబుతున్నారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఓ గేమ్ ఛేంజర్ అంటోంది ప్రభుత్వం. ఇటీవల 14మంది ప్రముఖ నిపుణులతో రెండు కమిటీలను కూడా నియమించిన సంగతి తెలిసిందే. రాబోయే రోజుల్లో మరిన్న కంపెనీలను ఆకర్షించాలని భావిస్తున్నారు. రాబోయే రోజుల్లో భారీగా పెట్టుబడులు, ఉద్యోగాలు రావడం ఖాయం అంటున్నారు.ప్రపంచవ్యాప్తంగా అందరూ క్వాంటమ్ టెక్నాలజీపై ఫోకస్ పెట్టారని చంద్రబాబు చెబుతున్నారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీ ఆధునిక పరిశోధనలకు కేంద్రంగా మారబోతోందన్నారు. ఏకంగా లక్ష మంది నిపుణుల తయారీ లక్ష్యమని చెప్పుకొచ్చారు. ఇప్పటికే క్వాంటమ్ శిక్షణకు సంబంధించి 50వేలమంది విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు రిజిస్టర్ చేసుకున్న విషయాన్ని ప్రస్తావించారు. రాబోయే రోజుల్లో క్వాంటమ్ టెక్నాలజీపై మరింత ఫోకస్ పెడతామన్నారు. ఒకవేళ ఎవరైనా క్వాంటం టెక్నాలజీ ద్వారా నోబుల్ ప్రైజ్ దక్కించుకుంటే వారికి రూ.100 కోట్లు నజరానా ఇస్తామని చంద్రబాబు ప్రకటించిన సంగతి తెలిసిందే. అంతేకాదు ఏపీ ప్రభుత్వం ప్రత్యేకంగా క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీని రూపొందించిన విషయం తెలిసిందే. అభివృద్ధి, స్టార్టప్‌ల ఏర్పాటును ప్రోత్సహించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.

# ఇక బెంగళూరు ఆరుగంటలే

కర్నూలు, ఫిబ్రవరి 4, ఏపీలో నేషనల్ హైవే ప్రాజెక్టుల పనులు వేగవంతం అయ్యాయి. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రంగంలోకి దిగి ఇటీవల ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నైకు కనెక్టివిటీకి సంబంధించి ప్రాజెక్టులపై ఆరా తీశారు. ఈ క్రమంలో నంద్యాల జిల్లాలో 167కే హైవే పనులు వేగవంతం చేశారు. ఈ నేషనల్ హైవే అందుబాటులోకి వస్తే బెంగళూరు తర్వగా వెళ్లొచ్చు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల నిర్మాణంపై ఫుల్ ఫోకస్ పెట్టింది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు.. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రాజెక్టులకు సంబంధించిన పనుల్ని వేగవంతం చేయాలని సూచించారు. ఈ క్రమంలో బెంగళూరుకు కనెక్ట్ చేసే కీలకమైన నేషనల్ హైవే (167కే) పనులు స్పీడ్ అందుకున్నాయి. ప్రస్తుతం నంద్యాల నుంచి కోవెలకుంట్ల మీదుగా నొస్సం వరకు 62 కిలో మీటర్ల హైవే పనులు చేపట్టారు.. అక్కడి నుంచి జమ్మలమడుగు కడప రోడ్డుకు కనెక్ట్ చేయనున్నారు. ఈ హైవే అందుబాటులోకి వస్తే.. 60 నుంచి 65 కిలో మీటర్ల దూరం తగ్గుతుందని.. బెంగళూరుకు 6 గంటల్లోపు వెళ్లొచ్చంటున్నారు.ఈ జాతీయ రహదారి 167కే నిర్మాణం కోసం 691.81 కోట్లు విడుదల చేశారు.. మొత్తం 486 ఎకరాల భూమిని సేకరించారు. నంద్యాల జిల్లాలోని ఆరు మండలాల్లోని (కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, నంద్యాల, సంజామల, గోస్పాడు) 22 గ్రామాల మీదుగా వెళుతోంది. మూడుచోట్ల బ్రిడ్జిలు.. అలాగే 158 చోట్ల కల్వర్టుల నిర్మాణం చేపట్టారు. ఈ హైవేలో నాలుగు ప్రాంతాల్లో బైపాస్‌లు (కోవెలకుంట్ల, రైతునగరం, నొస్సం, గోస్పాడు) కూడా నిర్మిస్తున్నారు. ఈ ఏడాది మార్చి నాటికి ఈ బైపాస్‌లు, కల్వర్టుల నిర్మాణ పనులు పూర్తవుతాయని భావిస్తున్నారు. బైపాస్‌లు అందుబాటులోకి వస్తే నంద్యాల నుంచి నొస్సం గంటలోపే వెళ్లొచ్చు.ఈ హైవే పూర్తిచేస్తే కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రజలకు బెంగళూరుతో కనెక్టివిటీ పెరుగుతుంది. ఎందుకంటే రెండు జిల్లాల నుంచి బెంగళూరుకు వెళ్లేవారిలో.. ఐటీ ఉద్యోగులు, ఉపాధి కోసం వెళ్లేవారు, వ్యాపారులు ఉంటారు. వారందరికి ప్రయాణ సమయం తగ్గుతుంది. గతంలో బెంగళూరు వెళ్లాలంటే అవుకు, కొలిమిగుండ్ల మీదుగా తాడిపత్రి, అనంతపురం మీదుగా వెళ్లేవారు. అదే 167కే జాతీయ రహదారి అందుబాటులోకి వస్తే.. జమ్మలమడుగు, ముద్దనూరు మీదుగా తాడిపత్రి హైవేలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా బెంగళూరుకు త్వరగా వెళతారు. అలాగే ఆర్ అండ్ బీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిది కూడా కర్నూలు జిల్లా కావడంతో ఆయన కూ?డా ఈ హైవే పనుల్ని వేగవంతం చేయాలని అధికారుల్ని ఆదేశించారు. మొత్తం మీద బెంగళూరు వెళ్లేవారికి కీలకమైన హైవే పనులు ఊపందుకున్నాయి.

# మళ్లీ...బూతులతో రాజకీయాలు

గుంటూరు, ఫిబ్రవరి 4, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎన్నికల విజయం తర్వాత అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించాల్సిన సమయంలో.. వీధుల వెంట జరుగుతున్న దాడులు, ప్రతిదాడులు రాష్ట్ర భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకునేలా చేస్తున్నాయి. ముఖ్యంగా మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేశ్‌ల చుట్టూ తిరుగుతున్న తాజా పరిణామాలు ప్రజాస్వామ్యవాదులను విస్మయానికి గురిచేస్తున్నాయి.నిన్న అంబటి రాంబాబు ముఖ్యమంత్రి చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. రాజకీయ విమర్శలు హుందాగా ఉండాల్సింది పోయి, బూతులతో కూడిన విమర్శలు చేయడం ఖచ్చితంగా గర్హనీయం. దీనిపై టీడీపీ శ్రేణులు భగ్గుమనడం సహజమే అయినప్పటికీ, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఆయన ఇంటిపై దాడి చేయడం సమర్థనీయం కాదు. పోలీసులు రంగప్రవేశం చేసి అంబటిని అరెస్ట్ చేయడంతో ఆ వివాదం ముగిసిందనుకున్న తరుణంలో, నేడు మరో కొత్త మంట రాజుకుంది.మంత్రి నారా లోకేశ్‌పై జోగి రమేశ్ చేసిన విమర్శలను సాకుగా చూపి టీడీపీ శ్రేణులు ఆయన ఇంటికి నిప్పు పెట్టడం అత్యంత దారుణమైన విషయం. అంబటి చేసిన వ్యక్తిగత దూషణలతో పోలిస్తే, జోగి రమేశ్ చేసినవి రాజకీయ విమర్శలుగానే పరిగణించవచ్చు. కానీ, చిన్న విమర్శను కూడా సహించలేక ఇళ్లకు నిప్పు పెట్టే స్థాయికి రాజకీయాలు దిగజారడం ఆందోళనకరం. “వైసీపీ హయాంలో జరిగిన అరాచకాలపై విసుగు చెందే ప్రజలు టీడీపీకి పట్టం కట్టారు. మళ్ళీ అదే పద్ధతులను టీడీపీ కేడర్ అనుసరిస్తే.. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి తేడా ఏముంటుంది?” అనే ప్రశ్న ఇప్పుడు సామాన్య ప్రజల నుంచి వినిపిస్తోంది.ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవజ్ఞుడు, సంయమనం పాటించే వ్యక్తి. ఆయన ఎప్పుడూ అభివృద్ధి, వ్యవస్థల ప్రక్షాళన గురించి మాట్లాడుతుంటారు.


అయితే, పార్టీ కేడర్ మాత్రం నాయకుడి మౌనాన్ని ‘చేతగానితనం’గా భావిస్తున్నట్టు కనిపిస్తోంది. “మాపై దాడులు జరిగినప్పుడు మేం భరించాం, ఇప్పుడు మా టైమ్ వచ్చింది” అనే పగతో రగిలిపోతున్న కేడర్, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటోంది. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పితే, పెట్టుబడులు రావు సరి కదా.. ఉన్న కంపెనీలు కూడా తరలిపోయే ప్రమాదం ఉంది. కేడర్ చేసే ఇటువంటి పనులు చివరకు ప్రభుత్వంపైనే మచ్చ తెస్తాయి.ఇది కేవలం ఒక పార్టీ కార్యకర్తల ఉద్రేకం మాత్రమే కాదు, రాష్ట్ర ప్రతిష్టకు సంబంధించిన అంశం. ఈ విషయంలో చంద్రబాబు, లోకేశ్ తక్షణమే జోక్యం చేసుకోవాలి. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోకూడదని, అరాచకాలకు పాల్పడితే సొంత పార్టీ వారైనా ఉపేక్షించేది లేదని కఠిన సందేశం పంపాలి. గత ప్రభుత్వ అవినీతిపై లేదా దాడులపై విచారణ జరిపి, చట్టబద్ధంగా శిక్షించాలే తప్ప వీధి పోరాటాలు పరిష్కారం కావు. ప్రతిపక్షాలు కూడా నోటిని అదుపులో పెట్టుకుని మాట్లాడాలి. బూతు పురాణాలతో రెచ్చగొట్టే ప్రయత్నం చేయడం వల్ల నష్టపోయేది వారే అని గ్రహించాలి.ప్రజలు మార్పును కోరుకుని ఓటేశారు. ఆ మార్పు అభివృద్ధిలో, పరిపాలనలో కనిపించాలే తప్ప దాడులలో కాదు. రాష్ట్రం వల్లకాడు కాకుండా ఉండాలంటే, ప్రభుత్వం తన ఉక్కుపాదాన్ని అరాచక శక్తులపై మోపాలి. అది ప్రతిపక్షమైనా, స్వపక్షమైనా సరే! శాంతియుత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాల్సిన బాధ్యత ఇప్పుడు పాలకుల భుజస్కంధాలపై ఉంది.

# కాపు సామాజికవర్గం కోసం...

ఏలూరు, ఫిబ్రవరి 4, 2024 ఎన్నికల్లో వైసీపీ ఎందుకు పరాజయం పాలైందనే ప్రశ్నకు ఆ పార్టీ నేతలు, అనుచరులు వివిధ కారణాలు చెబుతున్నారు. కొందరు ఈవీఎంలు కారణమంటూ వ్యాఖ్యానించగా, మరికొందరు కూటమి పార్టీల ఐక్యత వల్ల ఓటమి వచ్చిందని అంటున్నారు. ఇంకొందరు సరైన ప్రచారం చేయలేకపోయామని స్వయంగా ఒప్పుకుంటున్నారు. బలమైన మీడియా ప్రభావం, చంద్రబాబు రాజకీయ వ్యూహాలే కారణమని విమర్శించే వర్గం కూడా ఉంది. ఇవన్నీ కొంతవరకు నిజమే కావచ్చు. కానీ అంతకంటే లోతైన సామాజిక, రాజకీయ అంశాలు కూడా ఈ ఓటమికి కారణమయ్యాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సామాజిక వర్గాల ప్రభావం ఎప్పటినుంచో కీలకం. ముఖ్యంగా గోదావరి జిల్లాలు రాష్ట్ర రాజకీయ దిశను నిర్ణయించే స్థాయిలో ఉంటాయి. 2024 ఎన్నికల్లో అదే జరిగింది. ఈ ప్రాంతంలో బలమైన కాపు సామాజిక వర్గం ఈసారి వైసీపీకి వ్యతిరేకంగా నిలిచింది. వారు పెద్ద ఎత్తున జనసేన వైపు మొగ్గు చూపారు. దీనికి ప్రధానంగా పవన్ కళ్యాణ్ ఆకర్షణ ఒక కారణంగా చెబుతున్నారు. అయితే వైసీపీ నేతలు అవసరానికి మించి పవన్‌పై విమర్శలు చేయడం వల్ల న్యూట్రల్ ఓటర్లు కూడా దూరమయ్యారని రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. దాని ఫలితంగా ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో వైసీపీకి ఒక్క ఎమ్మెల్యే లేదా ఎంపీ సీటు కూడా దక్కలేదు.చరిత్రను చూస్తే కాంగ్రెస్? టీడీపీ ( పోటీ ఉన్న రోజుల నుంచే గోదావరి ప్రాంతాల్లో టీడీపీకి బలమైన పట్టు ఉంది. అప్పట్లో కొంతవరకు కాంగ్రెస్‌కు కూడా ఆధారం ఉండేది. ఇప్పుడు జనసేన కలిసి రావడంతో ఈ రెండు పార్టీల కలయిక మరింత బలపడింది. యాభై శాతానికి మించిన ఓటు బ్యాంకుతో ఈ జిల్లాలు కూటమికి కంచుకోటలుగా మారాయని అంటున్నారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు 20 నెలలు గడిచినా, అక్కడ వైసీపీ గ్రాఫ్ ఆశించిన స్థాయిలో పెరగలేదన్న మాట వినిపిస్తోంది.ఎన్నికల అనంతరం కాపు వర్గానికి చెందిన పలువురు కీలక నేతలు వైసీపీని వీడడం కూడా పార్టీకి దెబ్బగా మారింది. మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని టీడీపీలో చేరారు. భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పార్టీకి గుడ్‌బై చెప్పారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబుజనసేనలో చేరారు. ఇలాంటి పరిణామాలతో పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి పెరిగిందని అంటున్నారు.ఇటీవల రామచంద్రాపురం కు చెందిన రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ ( పార్టీ మారతారన్న ప్రచారం ఊపందుకుంది. తన కుమారుడికి భవిష్యత్తులో టికెట్‌పై స్పష్టత లేకపోవడం, అలాగే వైసీపీలో గెలుపు అవకాశాలపై సందేహాలు కారణాలుగా చెబుతున్నారు. ఇదే సమయంలో వంగా గీత (, ముద్రగడ కుటుంబం వంటి నేతల విషయంలో కూడా పుకార్లు వినిపిస్తున్నాయి. గోదావరి జిల్లాల్లో కూటమి ఐక్యత బలంగా ఉండటంతో ఎదురీదడం కష్టమని భావిస్తున్న కొందరు నేతలు కొత్త దారులు వెతుకుతున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. రానున్న రోజుల్లో వైసీపీ ఈ పరిస్థితిని ఎలా మార్చుకుంటుందో చూడాల్సి ఉంది.

# బిజెపి తొలితరం నేత, దక్షిణ భారతదేశం తొలి బీజేపీ ఎంపీ చందుపట్ల జంగారెడ్డి

## -నేడు ఆయన వర్ధంతి



బిజెపి తొలితరం నాయకుడు, దక్షిణ భారతదేశం తొలి బీజేపీ ఎంపీ చందుపట్ల జంగారెడ్డి.. ఈయన 1935, నవంబరు 18న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఇప్పటి తెలంగాణ రాష్ట్రంలోని పరకాల గ్రామంలో జన్మించాడు. తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా నివాసం హన్మకొండలో ఉన్నాడు. శ్రీమతి సుదేష్మాను 1953లో వివాహమాడాడు. తెలంగాణ ప్రాంతానికి హనుమకొండ నుంచే 1984 వరంగల్ జిల్లాలో కాదు అప్పటి మొత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి లోక్ సభలో బీజేపీకి ప్రాతినిధ్యం వహించిన ఏకైక వ్యక్తి చందుపట్ల జంగారెడ్డి కావడం విశేషం. ఇక ఆ ఎన్నికల్లో వాజ్ పాయ్, అద్వానీ వంటి బీజేపీ అగ్రనాయకులందరూ పరాజయం పాలయ్యారు. ఆ భారతీయ జనతా పార్టీ జిల్లాలో మొదటి వ్యక్తి. జంగారెడ్డి కొద్ది రోజులు ప్రభుత్వ పాఠశాలలో హయ్యర్ సెకండరీ (టీచర్) బడిపంతులుగా పనిచేశాడు. పరకాల నియోజకవర్గం నుండి శాసనసభ్యునిగా భారతీయ జనసంఘ పార్టీ నుండి ఇండిపెండెంట్ బి. కైలాసం పై గెలిచి శాసనసభలో అడుగుపెట్టాడు. ఇదే పరకాల అసెంబ్లీ నియోజకవర్గం నుండి శాసనసభ్యునిగా మళ్ళీ భారతీయ జనసంఘ పార్టీ నుండి 1972లో పోటీచేసి పింగళి ధర్మా రెడ్డి చేతిలో ఓటమి చెందాడు. తరువాత 1978లో మళ్ళీ పింగళి ధర్మా రెడ్డి పై శాసనసభ్యునిగా మళ్ళి భారతీయ జనసంఘ పార్టీ నుండి విజయం సాధించాడు. దీనికి వేదిక మాత్రం శాయంపేట అసెంబ్లీ నియోజకవర్గం అయింది. పరకాల అసెంబ్లీ నియోజకవర్గం ఎస్సి రిజర్వ్ కావడం మూలానా ఇద్దరు కూడా రెడ్డి సామాజికవర్గం వారు కావడం వలన పరకాల పక్కనే ఉన్న జనరల్ సీటు శాయంపేట అసెంబ్లీ నియోజకవర్గం నుండి తలపడ్డారు. 1984 లో భాజపా 543 నియోజకవర్గాలలో కేవలం రెండింటిని గెలుపొందింది ఒకటి అవిభాజ్య ఆంధ్ర ప్రదేశ్ లోని హనుమకొండ కాగా, ఏకే పటేల్ అనే బీజేపీ అభ్యర్థి గెలుపొందిన గుజరాత్ లోని మెహ్సానా నియోజక వర్గం రెండోది. హనుమకొండ నుంచే కాదు మొత్తం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నుంచి లోక్ సభలో బీజేపీకి ప్రాతినిధ్యం వహించిన ఏకైక వ్యక్తి చందుపట్ల జంగారెడ్డి. మాజీ ముఖ్యమంత్రిగా, కాంగ్రెస్‌లో కీలక నేతగా దేశంలోనే ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన దివంగత మాజీ ప్రధాని పాములపర్తి వెంకట నరసింహారావు పై 54వేల పైచిలుకు ఓట్లతో విజయం సాధించి దక్షిణ భారతదేశం తొలి బీజేపీ తొలి పార్లమెంటు సభ్యుడుగా హనుమకొండ నుండి జంగారెడ్డి ఎంపికయ్యాడు. దక్షిణ భారతదేశం నుంచి ఆయనే తొలి బీజేపీ ఎంపీ కావడం ఓ రికార్డు. ఆ సమయంలో స్థానికుడు కావడం వలన అభిమానంతో జనం జంగారెడ్డిని ఆదరించారు. ఆ విజయం చరిత్ర పుటల్లో భద్రంగా ఉంది. 1989,1991,1996లో కాంగ్రెస్ పార్టీ నుండి కమాలుద్దీన్ అహ్మద్ చేతిలో జంగారెడ్డి భారతీయ జనతా పార్టీ నుండి పోటీచేసి ఓటమి చెందారు. జంగారెడ్డి 87 యేళ్ళ వయసులో అనారోగ్యంతో బాధపడుతూ 2022, ఫిబ్రవరి 5న హైదరాబాదులో మరణించాడు. ఆయనకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

# వైసీపీకి వరుస షాకులు

నెల్లూరు, ఫిబ్రవరి 4, ఏపీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలకు వరుస షాకులు తగులుతున్నాయి. తాజాగా మరో ఇద్దరు నేతలపై కేసులు నమోదయ్యాయి. మాజీ మంత్రి విడదల రజిని, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి పోలీసులు నోటీసులు అందించారు. సీఎం చంద్రబాబు, సోమిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాకాణిపై కేసులు నమోదు కాగా.. పోలీసులు నోటీసులు ఇచ్చారు. కాకాణి ఇంటికి వెళ్లి నోటీసులు అందజేశారు.ఏపీ రాజకీయాలు హాట్ హాట్‌గా సాగుతున్నాయి. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి కేసు అధికార, విపక్ష పార్టీల మధ్య నిప్పు రాజేసింది. దీంతో మాటల తూటాలు, ఇళ్లపై దాడులు, కేసులు.. ఇలా ఏపీ రాజకీయం మొత్తం వేడెక్కిపోయింది. ఈ క్రమంలోనే విపక్ష వైసీపీ నేతలకు వరుస షాకులు తగులుతున్నాయి. ఇప్పటికే మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ మీద కేసులు నమోదు కాగా.. తాజాగా మరికొందరు మాజీ మంత్రులు కూడా కేసులు, నోటీసులతో ఉక్కిరిబిక్కిరయ్యే పరిస్థితి.తాజాగా మాజీ మంత్రి విడదల రజినీపై కేసు నమోదైంది. జనవరి 30వ తేదీన విడదల రజిని అనుచరులు, టీడీపీ నాయకుల మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో టీడీపీ నేతలు విడదల రజినీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా యడ్లపాడు పోలీసులు విడదల రజినితో పాటుగా 21 మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై కేసు నమోదు చేశారు.మరోవైపు వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. కాకాణి ఇంటికి వెళ్లిన పోలీసులు.. ఆయనకు నోటీసులు అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ టీడీపీ నేతలు చేసిన ఫిర్యాదు ఆధారంగా.. కాకాణిపై కేసులు నమోదయ్యాయి. నెల్లూరు గ్రామీణం, మనుబోలు, పొదలకూరులో కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే విచారణకు రావాలంటూ కాకాణి గోవర్ధన్ రెడ్డికి పోలీసులు నోటీసులు ఇచ్చారు.అటు వినుకొండ మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత బొల్లా బ్రహ్మనాయుడుపైనా కేసు నమోదైంది. వినుకొండ పోలీసులు బొల్లా బ్రహ్మనాయుడు మీద కేసు నమోదు చేశారు. జనవరి 31వ తేదీ వినుకొండలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో బొల్లా బ్రహ్మనాయుడు, ఇతర వైసీపీ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తోపులాట జరగ్గా.. ఓ కానిస్టేబుల్‌ను వైసీపీ నేతలు తోసేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనలో కానిస్టేబుల్ గాయపడినట్లు చెప్తున్నారు. ఈ కానిస్టేబుల్ ఫిర్యాదు ఆధారంగానే బొల్లా బ్రహ్మనాయుడుతో పాటుగా 27 మంది వైసీపీ నేతలపై వినుకొండ పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్లాన్ వర్కౌటవుతుందా

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆశించిన స్థాయిలో ప్రజల నుంచి స్పందన రావడం లేదు. తమ పార్టీ నేతలపై దాడులకు తెగబడుతున్నారని జగన్మోహన్ రెడ్డి చెప్పుకొచ్చారు. అయితే గతంలో జగన్ ఇలాంటి దాడుల విషయంలో వ్యవహరించిన తీరును ఇప్పటికీ ప్రజలు గుర్తు చేస్తున్నారు. వారికి గుర్తు లేకపోతే సోషల్ మీడియా గుర్తు చేస్తోంది. బీపీలు వస్తే పార్టీ కార్యకర్తలు, అభిమానులు దాడి చేస్తారు అన్న జగన్ మాటను ఎక్కువ మంది గుర్తు చేస్తున్నారు. అప్పట్లో టిడిపి నేత ఒక్కరూ బోస్ డీకే అనే పదాన్ని వాడారు. దానిని విచిత్రమైన బూతుగా మార్చారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు. చివరకు జగన్మోహన్ రెడ్డి అదే మాటను వక్రీకరిస్తూ.. తనను అంత మాట అంటే అభిమానులకు బీపీ వచ్చి ఆ టిడిపి నేత ఇంటిపై పడ్డారని.. అందులో ఎంత మాత్రం తప్పు లేదని తేల్చేశారు. ఇప్పుడు మాజీ మంత్రి అంబటి రాంబాబు మీడియా సమక్షంలో, పోలీసుల సమక్షంలో చంద్రబాబుపై బూతు పదం ప్రయోగించారు. ఇప్పుడు కూడా బీపీ వచ్చింది అని చంద్రబాబు ప్రకటించలేదు. ఎంతవరకు ఆయన సంయమనం పాటించమని పార్టీ శ్రేణులను కోరేరే తప్ప ఇలా సమర్థించలేదు. అయితే తాజా పరిణామాలతో జగన్ వైఖరిని మరోసారి ప్రజల ముందు ఉంచుతోంది సోషల్ మీడియా. అయితే ఈ ఘటనతో పొలిటికల్ సెంటిమెంటు రగిలించాలని వైసీపీ భావించింది. కానీ దానికి ఎంత మాత్రం ప్రజలు అవకాశం ఇవ్వడం లేదు.మొన్నటికి మొన్న కల్తీ మద్యం వ్యవహారం జరిగింది. ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా వైసీపీ నేతలే ప్లాన్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రధానంగా మాజీ మంత్రి జోగి రమేష్ పేరు బయటకు వచ్చింది. ఈ కుట్రలో ఆయన భాగస్వామ్యం అయ్యారని నిర్ధారణ కావడంతో కోర్టు రిమాండ్ విధించింది. ఆ కేసు విచారణ అలా కొనసాగుతుండగానే ఆయన బెయిల్ పై బయటకు వచ్చారు. ఇప్పుడు అదే నేత నిత్యం లోకేష్ పై విరుచుకు పడుతూనే ఉన్నారు. అంబటి రాంబాబు కంటే దారుణంగా వ్యాఖ్యానాలు చేశారు. అయితే జోగి రమేష్ ఇంటి పై దాడి జరిగింది. కానీ ప్రజల నుంచి మాత్రం సానుభూతి లభించడం లేదు. అంబటి రాంబాబు ఇంటిపై దాడి విషయంలో కూడా ప్రజలు లైట్ తీసుకుంటున్నారు. ఎందుకంటే ఆ ఇద్దరు నేతలు అత్యంత వివాదాస్పదులే. ఈ ఘటనల ద్వారా వైసీపీ రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం అంటే అంతకంటే మూర్ఖత్వం ఉండదు. వారి వల్ల మరింత చెడ్డ పేరు వస్తుందే కానీ.. ప్రజలు మాత్రం గుర్తించే ఛాన్స్ లేదు. దానిని జగన్ గుర్తించడం లేదు.ఏదైనా ప్రజా సమస్యలపై పోరాటం చేయవచ్చు కదా. సీనియర్ నేతలను ముందు పెట్టి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించవచ్చు కదా? అయితే దానిని వదిలేసి ఇలా అంబటి రాంబాబు, జోగి రమేష్ లాంటి వారితో రాజకీయాలు చేయాలనుకోవడం మూర్ఖత్వమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలు ఇటువంటి వారితో రాజకీయం చేస్తామంటే హర్షించరంటున్నారు. ఎందుకంటే రాజకీయాల్లో వీరు వ్యవహరించిన తీరు తెలిసినదే. అధికారంలో ఉన్నప్పుడు వీరు ఎంతలా తెగించి, దూకుడుగా వ్యవహరించారో తెలియనిది కాదు. అటువంటివారితో రాజకీయాలు చేయడం ఎంత మాత్రం సహేతుకం కాదని పార్టీలో సీనియర్ నేతలు సైతం అభిప్రాయపడుతున్నారు. కానీ జగన్మోహన్ రెడ్డి వారిద్దరిపై ఆధారపడి, ఆ రెండు ఘటనలపై పోరాటం ప్రారంభించడం అనేది నిజంగా సాహసమే.

# కరీంనగర్ బీఆర్ఎస్ లో నిరసనలు

కరీంనగర్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల వేడి రోజురోజుకూ పెరుగుతోంది. నామినేషన్లు వేసిన అభ్యర్థులకు పార్టీ నుంచి బీ?ఫామ్లు అందకపోవడంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది.మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్పై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బీ?ఫామ్లు డబ్బులకు అమ్ముడుపోయాయంటూ పార్టీ కార్యకర్తలు గంగుల నివాసం ముందు బైఠాయించి నిరసనకు దిగారు.మంత్రి గంగుల ఇంటి ముందు టిఆర్ఎస్ పార్టీ కండువాలు మరియు టిఆర్ఎస్ పార్టీ నుంచి ముద్రించుకున్న ప్రచార పత్రాలను తగలబెట్టారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్ రెండో డివిజన్కు చెందిన కొలగాని సాగర్కు బీఆర్ఎస్ టికెట్ విషయంలో మోసం జరిగిందంటూ అభ్యర్థులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. బీ?ఫామ్ ఇస్తామని హామీ ఇచ్చి చివరి నిమిషంలో మాట మార్చారని, కేవలం పది రోజుల క్రితమే పార్టీలో చేరిన వ్యక్తికి ఎలా బీ?ఫామ్ ఇస్తారని బాధితులు ప్రశ్నిస్తున్నారు.టికెట్ ఇస్తామని నమ్మించి మోసం చేశారంటూ ఎమ్మెల్యే గంగుల ఇంటి ముందు నిరసనలు కొనసాగుతుండగా, ఈ వ్యవహారం కరీంనగర్ రాజకీయాల్లో కొత్త ఉద్రిక్తతకు దారితీస్తోంది

## హాస్టల్ పై భవనం నుండి పడి బిటెక్ విద్యార్థి మృతి

చంద్రగిరి మోహన్ బాబు యూనివర్సిటీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థి బాలాజీ హాస్టల్ పై భవనం నుండి పడి విద్యార్థి మృతి చెందాడు. రంగంపేట లో ఉన్న ఓ ప్రైవేటు హాస్టల్ లో ఘటన జరిగింది. ఒంగోలు జిల్లాకు చెందిన విద్యార్థి హాస్టల్ పై భాగము నుండి క్రింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చంద్రగిరి పోలీసులు విచారిస్తున్నారు.

# సర్వశక్తులు ఒడ్డుతున్న హస్తం పార్టీ

హైదరాబాద్, ఫిబ్రవరి 4, మున్సిపల్ ఎన్నికల్లో హస్తం పార్టీ సర్వేలతో సర్వం పసిగట్టిందా.. అసలు ఈ సర్వేలు తమకి అనుకూలంగా ఉన్నాయా..? ప్రతికూలంగా ఉన్నాయా..? ఓ వైపు ప్రయివేట్ సంస్థల సర్వేలు,మరోవైపు ప్రభుత్వ ఇంటిలిజెన్స్ సర్వేలలో ఎక్కడ ద్విముఖ పోరు ఉండనుంది? ఎన్ని స్థానాల్లో త్రిముఖ పోరు ఉంటుంది...కొన్ని స్థానాల్లో నేతలకు సీఎం డైరెక్ట్ కాల్ చేసి భరోసా ఇవ్వడంలో మతలబు ఏంటి..? ఇంతకీ మున్సిపోల్స్ హస్తంపార్టీ హస్తగతం అయ్యేనా..?..కాంగ్రెస్ నేతలు మున్సిపల్ ఎన్నికలపై ఫోకస్ పెంచుతున్నారు. హస్తం నేతలు నాలుగు ప్రయివేట్ సంస్థలతో చేయించిన సర్వే రిపోర్టులు అందినట్లు సమాచారం. ప్రయివేట్ సంస్థల రిపోర్టులతో పాటు ప్రభుత్వ ఇంటిలిజెన్స్ రిపోర్టులను అధ్యయనం చేసిన హస్తం నేతలు తాము అనుకున్న టార్గెట్ రీచ్ అయ్యే అవకాశం ఉందని ధీమాగా ఉన్నారు. విదేశీ పర్యటనలో బిజీబిజీగా గడిపిన సీఎం రేవంత్ సైతం తెలంగాణకి రావడంతోనే సర్వే రిపోర్టులు పరిశీలించినట్లు సమాచారం. రిపోర్టులు తమకి అనుకూలంగా ఉన్నాయని, ఎలాంటి పొరపాట్లు చేయకుండా ఉంటే తొంభై శాతం స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకోవచ్చని నేతలకు దిశానిర్దేశం చేసినట్లు సమాచారం..సర్వే రిపోర్టులు తమకి అనుకూలంగా ఉన్నప్పటికీ పలు విషయాల్లో హస్తం నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఉత్తర తెలంగాణలో బీజేపీకి అనుకూలంగా ఉన్నట్లు సర్వేల్లో వెల్లడైనట్లు తెలుస్తోంది. బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్న ప్రాంతం కావడంతో పాటు అర్బన్ ప్రాంతంలో హిందుత్వ ప్రభావం ఉండడంతో ఉత్తర తెలంగాణలోని పలు మున్సిపాలిటీలలో బీజేపీకి అనుకూలంగా ఉంది. ఆ స్థానాల్లో త్రిముఖ పోరు ఉండనున్నట్లు హస్తం నేతలు అంచనా వేస్తున్నారు. త్రిముఖ పోటీ ఉన్న దగ్గర ఏవిధంగా ప్రచారం చేయాలో సీఎం రేవంత్ నేతలకు దిశా నిర్దేశం చేసినట్లు సమాచారం. మైనార్టీ ఓటు బ్యాంకు కాంగ్రెస్ కు పడే విధంగా చూడడంతో పాటు, హిందుత్వ ఓటు బ్యాంకు చీలకుండా ఉండేందుకు సీఎం రేవంత్ కొత్త ప్లాన్ వేసినట్లు తెలుస్తోంది. ఈ విషయాలను నేతలకు వ్యక్తిగతంగా కాల్ చేసి వివరించడానికి సీఎం సిద్ధమైనట్లు సమాచారం..దక్షిణ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నట్లు సర్వేల్లో వెల్లడింది. ఈ ప్రాంతంలో దాదాపుగా ద్విముఖ పోరు ఉంటుందని హస్తం నేతలు అంచనా వేశారు. ఈ స్థానాల్లో గత పదేళ్లలో కేసీఆర్ చేసిన వైఫల్యాలను ఎండగట్టేలా ప్రచార వ్యూహాలను సిద్ధం చేయాలని సీఎం సూచించారు. ఇక పార్టీకి ఇబ్బందిగా ఉన్న నియోజవర్గాల లిస్ట్ కూడ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఆయా ప్రాంతాల్లో లోకల్ గా ఉన్న సమస్యలను గుర్తించి దానికి అనుగుణంగా మేనిఫెస్టో సిద్ధం చేయాలని సీఎం రేవంత్ సూచించినట్లు సమాచారం.వాయిస్..నాయకుల మధ్య అంతర్గత పోరు, ఆధిపత్య ఇబ్బందులున్న నియోజకవర్గాలను సైతం ప్రత్యేకంగా గుర్తించినట్లు తెలుస్తోంది. ఆయా నియోజవర్గాల నాయకుల మధ్య సమన్వయం కుదిర్చే బాధ్యతను పలువురు సీనియర్ నేతలకు సీఎం రేవంత్ అప్పగించారు. ఆ నేతలు సీఎం రేవంత్ దూతగా ఆయా నియోజకవర్గాలకు వెళ్లి నేతలతో మాట్లాడి వారి మధ్య సమన్వయం కుదిర్చి రావాలని సీఎం రేవంత్ ఆదేశించారు.సర్వేలు అనుకూలంగా ఉన్నాయి కదా అని నేతలు రిలాక్స్ అయితే ఊరుకునేది లేదని సీఎం వార్నింగ్ ఇచ్చినట్టు సమాచారం. ఎన్నికలు ముగిసి మున్సిపల్ చైర్మన్ల, మేయర్ల ఎన్నిక జరిగేదాక కీలక నేతలంతా నియోజకవర్గాల పరిధిలోనే ఉండాలని సీఎం ఆదేశించారు. ఇక తొంభై శాతం టార్గెట్ పెట్టుకున్న కాంగ్రెస్ ఎంత శాతం సక్సెస్ అవుతుందో వేచి చూద్దాం...

# ఎన్నికలకు దూరంగా అన్నామలై, దినకరన్

చెన్నై, ఫిబ్రవరి 4,తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ ఎన్డీయే కూటమిలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. గత కొంతకాలంగా రాష్ట్ర బీజేపీని ఉరకలెత్తించిన మాజీ ఐపీఎస్ అధికారి కె. అన్నామలై, ఎన్నికల వ్యూహకర్తగా పేరున్న ఏఎంఎంకే అధినేత టీటీవీ దినకరన్ ఇద్దరూ ఈసారి ప్రత్యక్ష ఎన్నికల బరి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. అన్నాడీఎంకే తో పొత్తు కుదిరినందున సీట్ల సర్దుబాటు , అంతర్గత సమీకరణాల దృష్ట్యా వీరిద్దరూ దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లుగా కనిపిస్తోంది. పళని స్వామికి.. వీరికి సరిపడని రాజకీయాలు ఉన్నాయి. అన్నా డీఎంకేతో పొత్తు కోసం బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి అన్నామలై గతంలో వైదొలగారు. ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలోని అన్నాడీఎంకేతో పొత్తు పునరుద్ధరణకు అన్నామలై వైఖరి కొంత అడ్డంకిగా ఉందని భావించిన బీజేపీ అధిష్టానం, అతన్ని పక్కన పెట్టింది. ఇప్పుడు ఏకంగా ఎన్నికల బాధ్యతల నుంచే తప్పించింది. రాష్ట్రంలో కూటమి గెలుపు కోసం ఆయన పర్యవేక్షణ బాధ్యతలకు మాత్రమే పరిమితం కానున్నారు.మరోవైపు, ఏఎంఎంకే అధినేత టీటీవీ దినకరన్ కూడా ఈసారి ఎన్నికల్లో పోటీ చేయకూడదని సంచలన నిర్ణయం తీసుకున్నారు. దేని జిల్లాలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. తన శక్తియుక్తులను అభ్యర్థుల గెలుపు కోసమే వెచ్చిస్తానని, పార్టీ కేడర్‌ను ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా చూడటమే తన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఎన్డీయే కూటమికి ఎడప్పాడి పళనిస్వామి నాయకత్వం వహిస్తారని ఆయన స్పష్టం చేయడం ద్వారా కూటమిలోని ఐక్యతను చాటిచెప్పారు. ఈ ఇద్దరు కీలక నేతలు పోటీ నుంచి తప్పుకోవడం అధికార డీఎంకే కూటమికి వ్యూహాత్మకంగా లాభిస్తుందా లేక ఎన్డీయేలోని ఇతర అభ్యర్థులకు బలం చేకూరుస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది. అటు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ కూడా బలంగా పుంజుకుంటున్న తరుణంలో, క్షేత్రస్థాయిలో ఓట్ల చీలికను అరికట్టడమే లక్ష్యంగా బీజేపీ–అన్నాడీఎంకే కూటమి ఈ త్యాగాల ' వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు

# అంతర్జాతీయ కోర్టుకు ఇండియా వార్నింగ్

ముంబై, ఫిబ్రవరి 4, (న్యూస్ పల్స్) పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌పై భారత్ చర్యలకు దిగింది. ఇందులో భాగంగా 1969 నాటి సిందూ జలాల ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. దీంతో పాకిస్తాన్‌కు నీటి సరఫరా నిలిపివేసింది. సిందూ నదిపై కొత్తగా ప్రాజెక్టులు నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. దీంతో పాకిస్తాన్‌లో పంటలు ఎండుతున్నాయి. కరువు ఛాయలు అలుముకున్నాయి. సిందూ జలాలు ఇవ్వకపోతే రక్తం పారిస్తామని బెదిరించింది. కానీ భారత్ భయపడలేదు. దీంతో నెదర్లాండ్స్‌లోని అంతర్జాతీయ మధ్యవర్తిత్వం కోర్టును ఆశ్రయించింది. దీంతో కోర్టు భారత్‌ను వివరాలు కోరింది. కోర్టు ఆదేశాలను భారత్ స్పష్టంగా తిరస్కరించింది. జలవిద్యుత్ ప్రాజెక్టుల 'పాండేజ్ లాగ్‌బుక్'లు సమర్పించాలని కోరినా, భారత్ దాన్ని పాటించే ప్రసక్తి లేదని ప్రకటించింది. ఫిబ్రవరి 2, 3 తేదీల్లో పీస్ ప్యాలెస్‌లో జరిగిన విచారణకు భారత్ దూరంగా ఉంది.భారత్ పేర్కొన్న ముఖ్య అంశం, సీవోఏ ఏర్పాటు చట్టవిరుద్ధం. దానికి ఎటువంటి చట్టబద్ధత లేదని కొట్టిపారేసింది. 2025 ఏప్రిల్ 23న సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసిన నేపథ్యంలో ఈ ప్రతిష్టంభన. పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది పౌరుల మరణానికి పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని ఆరోపించి ఈ నిర్ణయం తీసుకుంది.సరిహద్దు దాటి ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే పాకిస్తాన్‌కు నీటి సరఫరా చేయలేనని భారత్ గట్టిగా చెప్పింది. ఒప్పందం తాత్కాలికంగా పక్కనపెట్టినందున అంతర్జాతీయ వేదికలకు సమాధానాలు ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. పాక్ వ్యవసాయం సింధు నదులపై ఆధారపడుతుండటంతో తర్బేలా, మంగ్లా జలాశయాల్లో నీరు ప్రమాద స్థాయిలో ఉంది.భారత్ పాల్గొనకపోయినా, కోర్టు పాక్ విన్నపాన్ని ఆధారంగా విచారణ కొనసాగిస్తోంది. సమాచారం ఇవ్వకపోతే ప్రతికూల ఆదేశాలు జారీ చేస్తామని హెచ్చరించింది. భారత్ ఇది ఏకపక్షీయమని, యథార్థాలను విస్మరించినదని వాదిస్తోంది.ఈ ప్రతిష్టంభన సింధు వివాదాన్ని నీటి పంపకాలకు మించి భారత?పాక్ దౌత్య యుద్ధంగా మార్చింది. భారత్ గట్టి నిలబడటం పాక్ ఆర్థిక ఒత్తిడిని పెంచుతుంది. భారతం లేని విచారణలు చట్టపరంగా బలహీనమే అవుతాయి.

# సెక్సీ డ్రెస్ లో రమ్మన్నారు...

హైదరాబాద్, ఫిబ్రవరి 4, అందంతో మాత్రమే కాదు, టాలెంట్ తో కూడా ఇండస్ట్రీ లో మంచి అవకాశాలను సంపాదించొచ్చు అని నిరూపించిన హీరోయిన్స్ లో ఒకరు ఐశ్వర్య రాజేష్ ప్రముఖ సీనియర్ హీరో రాజేష్ కుమార్తె గా ఈమె ఇండస్ట్రీ లోకి అడుగుపెట్టింది. లేడీ కమెడియన్ శ్రీలక్ష్మి స్వయంగా ఈమెకు మేనత్త. తమిళం లో ఎక్కువగా సినిమాలు చేస్తూ వచ్చిన ఐశ్వర్య రాజేష్, అక్కడ తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపుని ఏర్పాటు చేసుకుంది. తెలుగు లో ఈమె 'కౌసల్య కృష్ణమూర్తి' అనే చిత్రంతో ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత సాయి ధరమ్ తేజ్ హీరో గా నటించిన 'రిపబ్లిక్' లో హీరోయిన్ గా చేసింది. నాని 'టక్ జగదీశ్' చిత్రం లో ఈమె సెకండ్ హీరోయిన్ గా చేసింది. ఇవన్నీ ఒక ఎత్తు అయితే, టాలీవుడ్ లో ఆమె కెరీర్ ని పూర్తిగా మలుపు తిప్పిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'.గత ఏడాది సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ సినిమా కమర్షియల్ గా సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ గా నిల్చింది. ఇందులో ఐశ్వర్య రాజేష్ నటనకు కూడా మంచి మార్కులు పడ్డాయి. ఇదంతా పక్కన పెడితే రీసెంట్ గా ఈమె ఇచ్చిన ఒక ఇంటర్వ్యూ లో తన జీవితం లో ఎదురైనా కొన్న సంఘటనల గురించి చెప్పుకొచ్చింది. ఆమె మాట్లాడుతూ 'నేను కెరీర్ ప్రారంభ దశలో ఒక సినిమా కోసం ఆడిషన్స్ కి వెళ్లాను. ఆ చిత్ర డైరెక్టర్ నన్ను సెక్సీ నైట్ డ్రెస్ లో కనిపించమని అన్నాడు. నేను అందుకు ఒప్పుకోలేదు. ఆడిషన్స్ ఇవ్వకుండానే తిరిగి వచ్చేశాను. నా శరీరం కనిపించాలని అన్నాడు, ఆ సమయం లో నాకు చాలా కోపం వచ్చేసింది. నన్నే కాదు, ఇలా అతను గతం లో ఎంతమంది హీరోయిన్స్ ని అడిగి ఉంటాడో మీరే ఊహించుకోండి. నా సంఘటనని ఎప్పటికీ మర్చిపోలేను' అంటూ చెప్పుకొచ్చింది ఐశ్వర్య రాజేష్.ఐశ్వర్య రాజేష్ అందరి హీరోయిన్స్ లాగా హాట్ డ్రెస్ లో గ్లామర్ గా కనిపించగలదు, కానీ ఇప్పటి వరకు సినిమాల్లో అలాంటి పాత్రల్లో కనిపించలేదు. సంస్కార పక్షమైన దుస్తుల్లోనే కనిపించింది. ఇలాంటి వాళ్లకు కెరీర్ ఉండదని అందరూ అంటుంటారు. కానీ ఐశ్వర్య రాజేష్ తనకంటూ కొన్ని సిద్ధాంతాలను పెట్టుకొని, ఆ దిశగానే తన కెరీర్ ని సాగిస్తూ ముందుకెళ్తోంది. అవకాశాలు వస్తే వచ్చాయి, లేదంటే లేదు అనే స్వభావం గల అమ్మాయి. ఈ కాలం లో ఇండస్ట్రీ లో ఇలాంటి హీరోయిన్స్ దొరకడం చాలా అరుదు అంటూ సోషల్ మీడియా లో నెటిజెన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

# మణిపూర్ కొత్త సీఎంగా కేమ్‌చంద్

ఇంఫాల్, ఫిబ్రవరి 4, మణిపూర్‌లో ఏడాదిగా కొనసాగుతున్న రాష్ట్రపతి పాలన త్వరలో ముగియనుంది. ఈ ఈశాన్య రాష్ట్రానికి కొత్త ముఖ్యమంత్రిగా బీజేపీ నేత యుమ్నమ్ కేమ్‌చంద్ సింగ్ ఎన్నికయ్యారు. కుకీ, మైతీ జాతుల మధ్య ఘర్షణలతో అట్టుడికిన రాష్ట్రంలో, బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుంది. బీరేన్ సింగ్ సహా ఐదుగురి పేర్లు పరిశీలించిన తర్వాత కేమ్‌చంద్‌ను అధిష్ఠానం ఎంపిక చేసింది. దీంతో ఆయన మణిపూర్‌కు రెండో బీజేపీ సీఎం కానున్నారు. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్నాయి.ఈశాన్య రాష్ట్రంలో మణిపూర్‌లో ఏడాదిగా కొనసాగుతోన్న రాష్ట్రపతి పాలన త్వరలోనే ముగిసి, ప్రజాస్వామ్య ప్రభుత్వం అధికారం చేపట్టనుంది. ఆ రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా యుమ్నమ్ కేమ్‌చంద్ సింగ్ (62) ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన బీజేపీ శాసనసభాపక్ష సమావేశంలో కేమ్‌చంద్‌ను తమ నాయకుడిగా బీజేపీ ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. రెండేళ్లకుపైగా కుకీ, మైతీ తెగల మధ్య ఘర్షణలతో అట్టుడికిన మణిపూర్‌లో ఏడాది కిందట ముఖ్యమంత్రి పదవికి బీరేన్ సింగ్ రాజీనామా చేయడంతో అప్పటి నుంచి రాష్ట్రపతి పాలన కొనసాగుతోంది. మరో ఏడాదిలో ఎన్నికలు జరగనుండగా.. ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలని బీజేపీ నిర్ణయించుకుంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రిగా కేమ్‌చంద్‌కు అవకాశం కల్పించింది. మణిపూర్ రాష్ట్రానికి రెండో బీజేపీ సీఎం కాబోతున్నారు. సీఎం రేసులో బీరేన్ సింగ్ సహా ఐదుగురు పేర్లు వినిపించగా.. కేమ్‌చంద్‌వైపు అధిష్ఠానం మొగ్గుచూపింది. మే 2023లో మైతీ, కుకీ తెగల మధ్య ఘర్షణలతో మణిపూర్‌లో హింస చెలరేగి వందల మంది ప్రాణాలు కోల్పోయారు. వేల మంది నిరాశ్రయులు కాగా.. ఆస్తులు భారీ ఎత్తున ధ్వంసమయ్యాయి.న్యూఢిల్లీలో బీజేపీ అగ్రనేతలు సమావేశమై మణిపూర్ కొత్త సీఎం ఎంపికపై చర్చించారు. అనంతరం ఇంఫాల్‌లో జరిగిన బీజేపీ లెజిస్లేటివ్ పార్టీ సమావేశంలో మాజీ స్పీకర్ అయిన కేమ్‌చంద్‌ను తమ నేతగా ఎన్నుకున్నారు. ఇక, కేమ్‌చంద్ సింగ్జామై నియోజకవర్గం నుంచి వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. తొలిసారి 2017 ఎన్నికల్లో గెలిచిన ఆయనకు స్పీకర్ పదవి వరించింది. ఐదేళ్ల పాటు పూర్తికాలం స్పీకర్‌గా కొనసాగారు. మళ్లీ 2022 మణిపూర్ అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ విజయం సాధించారు.మణిపూర్‌లో ప్రస్తుతం పరిస్థితులు చక్కబడినట్టు పైకి కనిపిస్తున్నా.. పది రోజుల కిందట తన భార్యను చూసేందుకు నేపాల్ నుంచి వచ్చిన మైతీ వ్యక్తిని దారుణంగా కాల్చి చంపారు. దీనికిసంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌అయ్యింది.భార్యతోసంతోషంగా గడుపుతున్న అతడ్ని.. ముసుగులు ధరించి వచ్చిన కొందరు దుండగులు విచక్షణారహితంగా కాల్చి చంపారు.

# తెలంగాణ సామజిక న్యాయ దినోత్సవం శుభాకాంక్షలు తెలియచేసిన సీఎం రేవంత్

హైదరాబాద్"తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం" సందర్భంగా ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు శుభాకాంక్షలు తెలియజేశారు. అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం, సామాజిక సాధికారత కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

బడుగు, బలహీన వర్గాలు, మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం ఒక బాధ్యతగా, 'సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే' ను ఎంతో నిబద్ధతతో శాస్త్రీయ పద్ధతిలో పూర్తి చేసిందని గుర్తుచేశారు. అంతే కాకుండా, దశాబ్దాల నుంచి అపరిష్కృతంగా ఉన్న ఎస్సీ ఉపకులాల వర్గీకరణకు పరిష్కారం చూపించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు.అన్ని వర్గాలకు సమాన, సముచిత న్యాయం కల్పించాలనే ఆశయంతో తీసుకున్న నిర్ణయాల నేపథ్యంలో, ప్రతి ఏటా ఫిబ్రవరి 4వ తేదీని తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించిన విషయాన్ని గుర్తుచేశారు. సామాజిక న్యాయం కోసం ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని పునరుద్ఘాటించారు.

# రాజమండ్రి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సమీపంలో పెద్దపులి కలకలం

**ఎస్‌వీపీఎస్ ఫంక్షన్ హాల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ మధ్య ఉన్న కొబ్బరి తోటలోకి పెద్దపులి వెళ్లినట్లు గుర్తింపు**

**సీసీ కెమెరాలో రికార్డయిన పెద్దపులి కదలికలుభ ,యాందోళనలకు గురవుతున్న ప్రజలు**



ఇంత వరకు ఏలూరు జిల్లా ఏజెన్సీ ప్రాంతాన్ని వణికించిన పెద్దపులి ఇప్పుడు తూర్పుగోదావరి జిల్లాలోకి ప్రవేశించినట్లు అధికారులు భావిస్తున్నారు. ఫిబ్రవరి 1న రాజమండ్రి రూరల్ పరిధిలోని తొర్రేడులో పశువులపై దాడి చేసి చంపిన ఘటన కూడా కలకలం రేపింది. ఆ ఘటనపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మీడియా సమావేశం నిర్వహిస్తున్న సమయంలోనే వారి వెనకాలే పెద్దపులి కనిపించడం ఆందోళనను మరింత పెంచింది. పులి సంచారంపై అటవీ శాఖ అప్రమత్తమైంది. రాజమహేంద్రవరం సర్కిల్ సీసీఎఫ్ బి.ఎన్.ఎన్.మూర్తి ఆధ్వర్యంలో డీఎఫ్‌వో ప్రభాకరరావు, ఎఫ్ఆర్‌వో దావీదురాజు నాయుడు, డీఆర్‌వో శ్రీనివాస్‌రావు, రాష్ట్ర సిల్వికల్చరిస్ట్ ఆర్.శ్రీనివాసరావు తదితర అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. పులిని పట్టుకునేందుకు పూణేలోని నిపుణులతో సంప్రదింపులు జరుపుతున్నామని, బుధవారం ఉదయానికి వారిని రాజమహేంద్రవరం రప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# వికారాబాద్ లో వేడెక్కిన రాజకీయం

హైదరాబాద్, ఫిబ్రవరి 4, పురపాలిక ఎన్నికలు సమీపించిన వేళ వికారాబాద్ జిల్లాలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ఈ ఎన్నికల్లో రాజకీయ పార్టీలకే కాకుండా స్థిరాస్తి (రియల్ ఎస్టేట్) వ్యాపారుల పాత్ర మరింత కీలకంగా మారిందని తెలుస్తోంది. తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ పురపాలికల్లో మొత్తం వందకు పైగా వార్డులు ఉండగా, వాటిలో 30 నుంచి 40 వార్డుల్లో స్థిరాస్తి వ్యాపారుల ప్రభావం స్పష్టంగా కనిపించనుంది. నేరుగా బరిలోకి దిగడం, లేదా అనుచరులను రంగంలోకి దించడం ద్వారా ఎన్నికల ఫలితాలను తమకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం.ఎన్నికల్లో నేరుగా పోటీ చేసి గెలవకపోయినా, రిజర్వేషన్ విధానం ప్రకారం ఛైర్మన్ పదవులు దక్కించుకోవచ్చన్న లెక్కలతో చాలామంది వ్యాపారులు ముందడుగు వేస్తున్నారు. వార్డుల ఫలితాల ఆధారంగా బలమైన కౌన్సిలర్ల మద్దతు సాధిస్తే, తర్వాత ఛైర్మన్ ఎన్నికలో కీలక పాత్ర పోషించవచ్చన్నది వారి వ్యూహం. అందుకే ఇప్పటి నుంచే అన్ని విధాలా సిద్ధమవుతూ రాజకీయ సమీకరణాలను తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు.: తాండూరులో ఒక ప్రముఖ స్థిరాస్తి వ్యాపారి ఎన్నికల గోదాలోకి దిగకముందే తన వ్యూహాన్ని అమలు చేశారు. పోటీ చేయనున్న వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను కలిసి, స్థానిక సమస్యలపై చర్చించారు. ఓటు బ్యాంకు ఉన్న నాయకులను గుర్తించి వారికి తాయిలాలు ముట్టజెప్పినట్లు ప్రచారం సాగుతోంది. ఇదే పట్టణంలో ప్రధాన పార్టీ అభ్యర్థికి దీటుగా మరో పార్టీ నుంచి స్థిరాస్తి వ్యాపారి బరిలోకి దిగుతున్నారని సమాచారం. దీంతో తాండూరులో పోటీ మరింత ఉత్కంఠభరితంగా మారింది. వికారాబాద్ పట్టణంలో కొన్ని వార్డుల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చులను స్థిరాస్తి వ్యాపారులు భరిస్తున్నారన్న ప్రచారం జోరుగా వినిపిస్తోంది. ప్రచారం, సభలు, వాహనాలు, కార్యకర్తల నిర్వహణ వంటి అంశాలకు భారీగా ఖర్చు అవుతుండటంతో అభ్యర్థులు వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తోంది. దీని ద్వారా వ్యాపారులు భవిష్యత్తులో పురపాలిక నిర్ణయాల్లో తమ మాట చెల్లుబాటు అయ్యేలా చేసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. కొడంగల్, పరిగి పురపాలికల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. కొన్నిచోట్ల వ్యాపారులు స్వయంగా పోటీ చేస్తుండగా, మరికొన్నిచోట్ల అనుచరులను బరిలోకి దింపుతున్నారు. స్థానిక రాజకీయ నాయకులతో పొత్తులు పెట్టుకుని, గెలుపు కోసం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఈ పరిణామాలు పురపాలిక రాజకీయాలపై స్థిరాస్తి రంగం ఎంత ప్రభావం చూపుతోందో సూచిస్తున్నాయి.వికారాబాద్ జిల్లా పురపాలికలకు హైదరాబాద్‌తో ఉన్న అనుసంధానం స్థిరాస్తి వ్యాపారుల రాజకీయ ఆసక్తికి ప్రధాన కారణంగా మారింది. హైదరాబాద్ నుంచి 78 నుంచి 119 కిలోమీటర్ల దూరంలోనే ఈ పట్టణాలు ఉన్నాయి. రాజధాని పరిసరాల్లో ఎకరం భూమి ధర రూ.100 కోట్లకు పైగా పలుకుతుండగా, ఈ పురపాలికల సమీపంలోని భూములు రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు మాత్రమే ఉన్నాయి. ఈ ధరల తేడానే పెట్టుబడిదారులను ఇక్కడికి ఆకర్షిస్తోంది. హైదరాబాద్ వ్యాపారులు స్థానికులతో కలిసి భూములు కొనుగోలు చేసి, వెంచర్లు అభివృద్ధి చేసి భారీ లాభాలు పొందుతున్నారు.కొందరు స్థిరాస్తి వ్యాపారులు నేరుగా ఎన్నికల్లో పోటీ చేయకుండా, వెనకుండి తంతు నడుపుతున్నారు. తమకు నమ్మకమైన అనుచరులను బరిలోకి దింపి, అవసరమైన ఆర్థిక వనరులను సమకూరుస్తున్నారు. అనుచరులు గెలిచిన తర్వాత కీలక సందర్భాల్లో ఛైర్మన్ అభ్యర్థికి మద్దతు ఇచ్చి, భవిష్యత్తులో పురపాలిక ద్వారా లాభాలు పొందాలన్నది వారి ఆలోచన. మొత్తంగా చూస్తే, వికారాబాద్ జిల్లా పురపాలిక ఎన్నికల్లో స్థిరాస్తి వ్యాపారుల ప్రభావం ఈసారి మరింత పెరిగింది. రాజకీయాలు, వ్యాపారం ఒకదానితో ఒకటి ముడిపడుతున్న పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా, భవిష్యత్తులో పురపాలికల పాలనపై స్థిరాస్తి రంగం ఎంత ప్రభావం చూపుతుందన్నది మాత్రం ఆసక్తికరంగా మారింది.

# ఐటీ కారిడార్ లో స్కైవాక్...

హైదరాబాద్, ఫిబ్రవరి 4, హైదరాబాద్‌లోని ఐటీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ఐటీ కారిడార్‌లో సరికొత్త స్కైవాక్ నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. రాయదుర్గ్-టీహబ్ మార్గంలో ఈ కొత్త స్కైవాక్ నిర్మించాలని భావిస్తున్నారు. స్కైవాక్ నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదిత మార్గంలో.. ఉన్నతాధికారులతో కలిసి సైబరాబాద్ సీపీ క్షేత్రస్థాయిలో పర్యటించారు. రోడ్లు దాటేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో ఆ మార్గంలో స్కైవాక్ నిర్మించేందుకు ప్రతిపాదనలు రెడీ చేశారు.ఐటీ హబ్‌గా దూసుకెళ్తున్న హైదరాబాద్‌లో రోజురోజుకూ జనాభా భారీగా పెరిగిపోతోంది. ఐటీ కారిడార్‌లో నిత్యం లక్షల మంది టెకీలు రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ఉదయం, సాయంత్రం ఆ మార్గాల్లో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. ఈ ట్రాఫిక్‌ను తగ్గించేందుకు ప్రభుత్వం.. ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, రోడ్డు విస్తరణ పనులను ఎప్పటికప్పుడు చేపడుతూనే ఉంది. అయినప్పటికీ జనం, వాహనాల రద్దీతో.. నగరంలో జనం ట్రాఫిక్ ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. అదే సమయంలో ట్రాఫిక్ సమయంలో పాదచారులు నడిచేందుకు, రోడ్డు దాటేందుకు కూడా చాలా కష్టంగా మారుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం రద్దీగా ఉండే కీలక ప్రాంతాల్లో స్కైవాక్‌లను ఏర్పాటు చేస్తోంది. విశాలమైన రోడ్లు దాటలేక ఇబ్బంది పడేవారికి.. ట్రాఫిక్ ఉన్న సమయంలో.. పాదచారులు ఈ స్కైవాక్‌లను ఉపయోగించి.. సులువుగా గమ్యాన్ని చేరుకోవచ్చు.ఇప్పటికే నగరంలోని ప్రధాన కూడళ్లు, కీలక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్కైవాక్‌లపై నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంబంధించిన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. సైబరాబాద్‌లోని రాయదుర్గ్-టీ హబ్ వద్ద కొత్త స్కైవాక్ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది.హైదరాబాద్‌లోని రద్దీగా ఉండే ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యలు, పాదచారుల భద్రత, మరింత సౌకర్యంగా నడిచి వెళ్లడం కోసం ఈ స్కైవాక్‌ను నిర్మించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దీనికి సంబంధించి పోలీస్, ట్రాఫిక్ ఉన్నతాధికారులతో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం రమేష్.. క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షించారు.ఈ స్కైవాక్.. రాయదుర్గ్ నుంచి ప్రారంభమై మెట్రో స్టేషన్, ఐకియా ఫ్లైఓవర్, ఐఓసీఎల్ జంక్షన్ మీదుగా టీ-హబ్ వరకు నిర్మించనున్నారు. మెట్రో ప్రయాణికులు, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు, నగరవాసులతో కిక్కిరిసిపోయి ఉండే ట్రాఫిక్, పాదచారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని.. ఈ స్కైవాక్ ప్రాజెక్టును అధికారులు ప్రతిపాదించారు.ఈ స్కైవాక్ నిర్మాణంతో దాదాపు 30 శాతం ట్రాఫిక్ రద్దీని తగ్గించాలని అధికారులు ప్రణాళికలు వేశారు. సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సహాయంతో ఈ స్కైవాక్ ప్రతిపాదనను అధికారులు రూపొందించారు. ఈ స్కైవాక్ ఫేజ్-1లో భాగంగా 500 మీటర్ల మేర నిర్మించనున్నారు. ఇక టీ-హబ్, మైండ్ స్పేస్ సీ-గేట్‌ను కలుపుతూ 400 మీటర్ల అండర్‌పాస్ నిర్మించేందుకు కూడా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

## బీజేపీ కి రాజీనామా చేసిన జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు

వికారాబాద్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు గోరేపల్లి సుదర్శన్ గౌడ్ పార్టీకి రాజీనామా చేసారు. పార్టీ తనకు అన్యాయం చేసిందంటూ కన్నీటి పర్యంతం అయ్యారు. గతంలో తాండూర్ పట్టణ అధ్యక్షునిగా సుదర్శన్ గౌడ్ కొనసాగారు. పట్టణంలోని 28వ వార్డు నుంచి తన భార్యను కౌన్సిలర్ గా పోటీ చేసేందుకు నామినేషన్ దాఖలు చేసారు, పార్టీ బీఫామ్ ఇవ్వకపోవడంతో పార్టీకి రాజీనామా చేసారు. అదే వార్డు నుంచి తాండూర్ పట్టణ అధ్యక్షుడైన నాగారం మల్లేశంకు టికెట్ కేటాయించారు. నగరం మల్లేశం కోట్ పల్లి మండలం కొత్తపల్లిలో సర్పంచ్. ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారని అతనికి పార్టీ బి ఫామ్ ఇవ్వడంపై సుదర్శన్ ఆగ్రహం వ్యక్తం చేసారు. ఒక దగ్గర ఓటు హక్కు వినియోగించుకొని మరో దగ్గర పోటీ చేయడంపై అధికారులకు ఫిర్యాదు చేశారు. జిల్లాలో జరిగే పరిణామాలపై రాష్ట్రస్థాయి నేతలు దృష్టి పెట్టాలి . పార్టీకి ఎంతోకాలంగా సేవ చేశా.. పార్టీ తనకు అన్యాయం చేసిందంటూ ఆవేదన చెందారు.

# బంగారం ధర పెరుగుదలతో వర్సటీలకు కొత్త కష్టాలు..!

హైదరాబాద్, ఫిబ్రవరి 4, భారీగా పెరుగుతున్న బంగారం ధరలు తెలంగాణలోని వర్సటీలకు కొత్త కష్టాలను తెచ్చిపెట్టాయి. ధరలు పెరుగుతుండటంతో విద్యార్థులకు ఇచ్చే బంగారం పథకాల తయారీకి అధిక వ్యయం అవుతోంది. దీంతో డిపాజిట్ మె?త్తాన్ని పెంచాలని కోరుతూ వర్సటీ అధికారులు దాతలకు లెటర్లు రాస్తున్నారు. దాంతో పాటుగా గోల్డ్ మెడల్స్ తయారీలో గోల్డ్ వినియోగాన్ని గ్రాము వరకు తగ్గించి ఇతర లోహాలను కలిపి తయారు చేయిస్తున్నారు.బంగారం ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. గత వారం క్రితం అయితే రికార్డు స్థాయికి ధర చేరుకుంది. సామాన్యులు బంగారం, వెండి కొనుగోలు చేయాలంటేనే వణికిపోయే పరిస్థితి ఏర్పడింది. ఎంకి పెళ్లి సుబ్బి చావుకి వచ్చినట్టుగా.. బంగారం ధర పెరగటంతో వర్సటీలకు కొత్త కష్టాన్ని తెచ్చిపెట్టింది. గత కొన్ని రోజులుగా బంగారం ధరలు ఆకాశమే హద్దుగా అనూహ్యంగా పెరగడంతో వర్సటీల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు బహూకరించే బంగారు పతకాల బరువు క్రమంగా తగ్గుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని వర్సటీలు అప్రమత్తమయ్యాయి.పతకాలను ప్రవేశపెట్టిన దాతలకు డిపాజిట్ నిధి మొత్తాన్ని పెంచాలని లేఖలు రాసేందుకు రెడీ అవుతున్నాయి. మార్చి 7న జేఎన్‌టీయూహెచ్ 14వ స్నాతకోత్సవం జరగనుంది. ఈ నేపథ్యంలో డిపాజిట్ పెంచాలని లెటర్స్ రాస్తున్నారు. ఇక గత ఏడాది జూన్‌లో జరిగిన 13వ స్నాతకోత్సవంలో విద్యార్థులకు బహూకరించే 20 గ్రాముల పతకంలో వెండి, రాగితోపాటు మూడు గ్రాముల బంగారం వినియోగించారు. ఈసారి బంగారం పరిమాణాన్ని మూడు నుంచి రెండు గ్రాములకు తగ్గించారు. ఆ మేరకు వెండి, రాగిని పెంచినట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. ఈ ఏడాది మొత్తం 71 పతకాలను ప్రతిభావంతులైన విద్యార్థులకు బహూకరించనున్నారు. అందులో కొన్నింటిని వర్సిటీలు సొంత నిధులతో ప్రవేశపెట్టగా.. మరికొన్నింటిని దాతల సహకారంతో సమకూరుస్తున్నారు.గత అక్టోబరులో పాలమూరు వర్సిటీ స్నాతకోత్సవం నిర్వహించారు. అందులో 20 గ్రాముల పతకంలో 0.9 గ్రాముల బంగారం, 17.10 గ్రాముల రాగి, రెండు గ్రాముల వెండి వడినట్లు పాలమూరు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య పి.రమేశ్‌బాబు వెల్లడించారు. ఒక్కో పతకానికి రూ.15 వేల వరకు ఖర్చు అయినట్లు తెలిపారు. ప్రస్తుతం దాతలు పతకాన్ని ప్రవేశపెట్టాలంటే ఆయా వర్సిటీలను బట్టి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ముందస్తు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. వాటిని ఎండోమెంట్ మెడల్స్‌గా పిలుస్తారు. డిపాజిట్ చేసిన మొత్తంపై వచ్చే వడ్డీతో బంగారు పతకాలు తయారు చేసి స్నాతకోత్సవం సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు అందజేస్తుంటారు.బంగారం ధర ఊహకందని విధంగా భారీగా పెరిగిపోతుండటం.. వచ్చే వడ్డీ సరిపోవటం లేదు. దీంతో కొన్ని వర్సిటీలు మరికొంత మొత్తాన్ని డిపాజిట్ చేయాలని దాతలకు లేఖలు రాస్తున్నాయి. జేఎన్‌టీయూహెచ్, ఉస్మానియా యూనివర్సిటీలో డిపాజిట్ మొత్తం రూ.5 లక్షల వరకు ఉండగా.. పాలమూరు, నల్గొండలోని మహాత్మా గాంధీ వర్సిటీల్లో మాత్రం రూ.2 లక్షలు ఉంది. ఇక నుంచి వర్సటీల్లో కొత్తగా పతకాలు ప్రవేశపెట్టే వారి నుంచి రూ.3 లక్షలు తీసుకోవాలని పాలమూరు, గాంధీ వర్సిటీలు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నాయి.

# తెలంగాణలో భారీగా టైఫాయిడ్ మరణాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 4, టైఫాయిడ్ మరణాల్లో దేశంలోనే తెలంగాణ రెండో స్థానంలో ఉండటం ఇప్పుడు పెను సంచలనంగా మారింది. దేశంలో టైఫాయిడ్‌తో ప్రాణాలు విడిచే ప్రతీ ఐదుగురిలో ఒకరు తెలంగాణకు చెందిన వారు అని ఆ నివేదిక వెల్లడించింది. 2023లో దేశంలో మొత్తం 1,075 మంది టైఫాయిడ్ కారణంగా చనిపోగా.. అందులో 202 మరణాలు ఒక్క తెలంగాణలోనే నమోదయ్యాయని పేర్కొంది.దేశవ్యాప్తంగా టైఫాయిడ్‌కు సంబంధించిన గణాంకాలు.. తెలంగాణను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దేశంలో నమోదు అవుతున్న ప్రతీ 5 మరణాల్లో ఒకటి తెలంగాణ నుంచే ఉందని తాజాగా రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన రిపోర్ట్ వెల్లడించడం తీవ్ర కలకలం రేపుతోంది. 2023లో టైఫాయిడ్ బారినపడి 202 మంది చనిపోయినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా దేశంలోని అన్ని టైఫాయిడ్ మరణాల్లో 19 శాతం తెలంగాణ నుంచి ఉన్నట్లు ఆ రిపోర్ట్ చెబుతోంది. టైఫాయిడ్ వ్యాప్తికి ప్రధాన కారణాలు.. కలుషితమైన ఆహారం, నీరు, పారిశుద్ధ్య సమస్యలు అని నిపుణులు చెబుతున్నారు. అయితే టైఫాయిడ్ బారిన పడ్డ వారికి.. చికిత్సలో ఆలస్యం చేయడం వల్ల పేగులు దెబ్బతినడం వంటి ప్రాణాంతక సమస్యలు తలెత్తుతున్నాయని ఆ నివేదిక హెచ్చరించింది.2023కు సంబంధించి రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన మెడికల్ సర్టిఫికేషన్ ఆఫ్ కాజ్ ఆఫ్ డెత్ రిపోర్ట్ ప్రకారం.. మన దేశంలో టైఫాయిడ్, పారాటైఫాయిడ్ కారణంగా మొత్తం 1,075 మరణాలు నమోదైనట్లు తెలుస్తోంది. ఇక భారతదేశంలోనే రెండో అత్యధికంగా 202 మరణాలతో తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. ఇక 377 మరణాలతో మొదటి స్థానంలో ఉత్తర్‌ప్రదేశ్ ఉంది. అయితే దేశంలోని జనాభాలో తెలంగాణ జనాభా కేవలం 2.5 శాతం మాత్రమే కాగా.. టైఫాయిడ్ సంబంధిత మరణాల్లో మాత్రం 19 శాతం వాటాను కలిగి ఉండటం.. రాష్ట్రంలో పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలుపుతోంది.మూడో స్థానంలో 118 మరణాలతో పంజాబ్.. 36 మరణాలతో ఢిల్లీ నాలుగో స్థానాల్లో నిలిచాయి.సాల్మొనెల్లా టైఫీ అనే బ్యాక్టీరియా కారణంగా టైఫాయిడ్ సోకుతుంది. కలుషిత ఆహారం, నీటి ద్వారా ఈ సాల్మొనెల్లా టైఫీ బ్యాక్టీరియా వ్యాప్తి చెందుతుంది. అపరిశుభ్రమైన నీరు.. పైపులైన్లు వేసేటపుడు, మరమ్మతుల సమయంలో అందులో మురుగునీరు కలిస్తే.. వాటిని తాగడం వల్ల ఈ టైఫాయిడ్ విస్తృతంగా వ్యాప్తి చెందుతోంది. పరిశుభ్రత లేకుండా తయారు చేసే స్ట్రీట్ ఫుడ్, దాని తయారీలో ఉపయోగించే కలుషితమైన నీటిని వాడటం వల్ల.. ఎక్కువగా ఈ టైఫాయిడ్ బారిన పడుతున్నారు. నగరాల్లో నాలాలు, రోడ్లపై మురుగునీరు పొర్లడం, మురికివాడల్లో వ్యర్థాల నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల ఈ సాల్మొనెల్లా టైఫీ బ్యాక్టీరియా అతి వేగంగా వ్యాప్తి చెందుతుంది.అయితే టైఫాయిడ్ సోకిన చాలామంది.. దాన్ని ఒక సాధారణ జ్వరం అని భావించి నిర్లక్ష్యం చేస్తారు. మరికొందరు సొంతంగా మెడిసిన్ వేసుకుని తగ్గించుకుందామనే ప్రయత్నం చేస్తారు. కానీ ఇలాంటి నిర్ణయాల వల్లే వారి పరిస్థితి విషమించి ప్రాణాల మీదికి తెస్తోందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. సరైన సమయంలో ట్రీట్‌మెంట్ తీసుకోకపోతే.. ఈ టైఫాయిడ్ వల్ల పేగులకు రంధ్రాలు పడటం, రక్తంలో ఇన్ఫెక్షన్ రావడం, అవయవాలు చెడిపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు. సరైన సమయంలో సరైన మెడిసిన్ వాడకపోవడం, సాధారణ యాంటీబయాటిక్స్ పని చేయకపోవడం టైఫాయిడ్ రోగులకు మరో పెద్ద సవాలుగా మారిందని డాక్టర్లు తెలిపారు.నిపుణుల సూచించిన వివరాల ప్రకారం.. నీటిని కాచి చల్లార్చి తాగడం.. వేడి వేడి ఆహారాన్ని తినడం, జ్వరం వచ్చిన తర్వాత డాక్టర్‌ను సంప్రదించి సరైన సమయంలో ట్రీట్‌మెంట్ తీసుకోవడం వల్ల మరణాలను అరికట్టవచ్చని చెబుతున్నారు. టైఫాయిడ్ కేసులు ఎక్కువగా నమోదయ్యే ప్రాంతాలను హాట్‌స్పాట్‌లుగా గుర్తించి అక్కడ పారిశుద్ధ్య చర్యలను పూర్తిగా చేపట్టాలని సూచిస్తున్నారు.

# డైవర్షన్ పాలిటిక్స్ కంటిన్యూ...

హైదరాబాద్, ఫిబ్రవరి 4, తెలంగాణలో 12 ఏళ్లుగా డైవర్షన్ పాలిటిక్స్ కొనసాగుతున్నాయి. రాష్ట్ర విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ అలియాస్ టీఆర్ఎస్.. కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మొదటి నాలుగున్నరేళ్లు టీడీపీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తన పార్టీలో చేర్చుకున్న కేసీఆర్ ప్రతిపక్షం లేకుండా చేయాలనుకున్నారు. ఇక 2018లో ముందస్తు ఎన్నికలకు వెళ్లి డైవర్షన్ పాలిటిక్స్‌కు కొత్త అర్థం చెప్పారు. ప్రతిపక్షాలు బలహీనంగా ఉన్న సమయంలోనే ఎన్నికలకు వెళ్లి.. మరోమారు అధికారంలోకి వచ్చారు. తమ ప్రభుత్వం విమర్శలు లేదా ఆరోపణలు పెరిగినప్పుడు కేంద్ర బీజేపీపై దాడి చేయడం, బండి సంజయ్ వంటి నాయకులపై ప్రెస్‌మీట్లు నిర్వహించడం ద్వారా ప్రజల దృష్టిని మళ్లించే రాజకీయాలు చేసేవారు. ఇది క్లాసిక్ డైవర్షన్ టాక్టిక్‌గా మారింది. సొంత సమస్యల నుంచి దూరం చేయడానికి విమర్శకులపై ప్రతిదాడి చేసేవారు.ప్రస్తుతం తెలంగాణలో రేవంత్ రాజ్ నడుస్తోంది. పదేళ్ల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేశారు. ఇప్పుడు రేవంత్ కూడా కేసీఆర్‌ను మించిన డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత లేదనిపించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. తన వ్యూహాన్ని మరింత షార్ప్‌గా అమలు చేస్తున్నారు.మూసీ శుద్ధీకర ప్రాజెక్ట్‌పై హైదరాబాద్ ప్రజల్లో రేవంత్ సర్కార్‌పై వ్యతిరేకత వచ్చింది. మూసీ ఆక్రమణల కూల్చివేతతో పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. దీనిని ప్రతిపక్ష బీఆర్ఎస్ తమకు అనుకూలంగా మలచుకోవాలని భావించింది. దీంతో రేవంత్ డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఫార్ములా ఈ రేసు కేసులో నోటీసులు జారీ చేశారు. హైడ్రా కూల్చివేతలపై మొదట్లో హైదరాబాద్ వాసుల్లో హర్షం వ్యక్తమైంది. కానీ తర్వాత పెద్దల ఇళ్లు కూల్చకుండా పేదలవి కూల్చడంపై వ్యతిరేకత వచ్చింది. దీని నుంచి దృష్టి మళ్లించేందుకు రేవంత్‌రెడ్డి ఫీచర్ సిటీని తెరపైకి తెచ్చారు.హెచ్‌సీయూ భూములను అమ్మేందుకు రేవంత్ సర్కార్ సిద్ధమైంది. ఈమేరకు భూమల్లోని చెట్లను బుల్డోజర్లతో తొలగించడం రాష్ట్రవ్యాపంగా రచ్చకు తెరలేపింది. అడవిని తొలగిస్తున్నారని, వన్యప్రాణులను చంపేస్తున్నారని మీడియాలో పెద్ద ఎత్తుక కథనాలు వచ్చాయి. పర్యావరణ ప్రేమికులు కోర్టును ఆశ్రయించారు. దీంతో యథాతధ స్థితి కొనసాగించాలని న్యాయస్థానాలు స్టే విధించాయి. దీనిని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నించింది. ఈ సమయంలోనూ రేవంత్‌రెడ్డి ప్రజల దృష్టి మళ్లించేందుకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డుల జారీ, సన్నబియ్యం పంపిణీ అంశాన్ని తెరపైకి తెచ్చారు.తాజాగా, నైనా బొగ్గు టెండర్‌లో భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి మధ్య ఆధిపత్య పోరు బయటపడింది. టెండర్ కోసం ఇద్దరు మంత్రులు పోటీ పడడం, భట్టికి చెందిన సంస్థకు అప్పగించే ప్రయత్నాలు జరగడం సంచలనమైంది. ఇదే సమయంలో కోమటిరెడ్డికి, ఓ ఐఏఎస్‌కు లింకు అంటగట్టడం, ఐఏఎస్‌లు అంతా ఒక్కటై కేసు పెట్టడం రేవంత్ సర్కార్‌కు మచ్చగా మారింది. దీంతో రేవంత్‌రెడ్డి మరోమారు డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరతీశారు. ఫోన్ ట్యాపింగ్ కేసును తెరపైకి తెచ్చి మాజీ మంత్రి హరీశ్ రావు, కేటీఆర్, సంతోష్ రావులకు నోటీసులు ఇచ్చారు. విచారణ చేయించారు.మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన ఈ సమయంలో, కాంగ్రెస్ మెజారిటీ మున్సిపాలిటీలను కౌవసం చేసుకుని బలంగా కనిపించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనికి భాగంగా, ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ద్వారా మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు నోటీసులు జారీ చేశారు. ఎన్నికలు ముగిసే వరకు ఈ డ్రామాను సస్పెండ్ చేయడం ద్వారా ప్రభుత్వ వ్యతిరేకతను అణచివేయాలని భావిస్తున్నారు.ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు రేవంత్‌రెడ్డి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. లోపాలు బయట పడిన సమయంలో విపక్ష నాయకులపై కేసులు పెట్టడం వల్ల ప్రజలు ప్రభుత్వ విఫలాలను మరచిపోతారు. ఇది కేవలం రాజకీయ డైవర్షన్ కాదు, విచారణల ద్వారా ఎదుగుదలను కూడా సృష్టిస్తుంది.ఈ వ్యూహం కొంతమేర పని చేసినా, ప్రజలు దీర్ఘకాలిక సమస్యలు (మూసీ, టెండర్లు) మరచిపోరేలా లేదు. కేసీఆర్ తన హయాంలో చేసినట్లే రేవంత్ కూడా ఇదే మార్గం తీసుకుంటుంటే, ఎన్నికల్లో కాంగ్రెస్ బలం నిజమేనా అనేది పరీక్షించాలి. డైవర్షన్ పాలిటిక్స్ రాజకీయాల్లో సాధారణం కాబట్టి, దీర్ఘకాలంలో పాలసీలు, అభివృద్ధి చూపితేనే నిజమైన విజయం వస్తుంది.

# డీఎస్పీ నుంచి సిఐగా డిమోషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 4, తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఓ డీఎస్పీకి డిమోషన్ ఇచ్చింది. అతడికి డీఎస్పీ హోదా రద్దు చేసి ఇన్‌స్పెక్టర్ స్థాయికి తగ్గిస్తూ హోంశాఖ సంచలన ఉత్తర్వులు జారీ చేసింది. ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడు, ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న దుగ్యాల ప్రణీత్ రావు డీఎస్పీ హోదాను రద్దు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. తక్కువ కాలంలోనే రూల్స్‌కు విరుద్ధంగా డీఎస్పీగా పదోన్నతి పొందటం పాటు.. ప్రొబేషన్ కాలంలోనే విధుల దుర్వినియోగానికి పాల్పడినందుకు గాను సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు హోంశాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు.దీంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రణీత్‌రావుకు కల్పించిన యాక్సిలరేటెడ్ పదోన్నతి క్యాన్సిల్ అయింది. ఇకపై ఆయన ఇన్‌స్పెక్టర్ హోదాతోనే కొనసాగనున్నారు. సాధారణంగా తీవ్రవాద, ఉగ్రవాద కార్యకలాపాల అణచివేతలో విశేష ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులకు మాత్రమే తక్కువ కాలంలో యాక్సిలరేటెడ్ ప్రమోషన్ కల్పించే విధానం తెలంగాణలో అమల్లో ఉంది. అలాంటి కార్యకలాపాల్లో ప్రణీత్ రావు పనిచేయకపోయినా రాజకీయ లబ్ధి కోసం డీఎస్పీగా పదోన్నతి కల్పించడం అప్పట్లోనే కలకలం రేపింది. 2007 ఎస్సై బ్యాచ్‌లో దాదాపు 300 మంది విధులు నిర్వహిస్తుండగా.. ఒక్క ప్రణీత్ రావుకు మాత్రమే డీఎస్పీగా పదోన్నతి కల్పించారు. ఈ ఘటన వివాదానికి దారితీసింది.ప్రణీత్‌రావు సర్వీస్ చూసినట్లయితే.. ఎస్సై హోదాలో 2016 అక్టోబరు 24న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. 2023 డిసెంబరు 13 వరకు అక్కడే పనిచేశారు. ఎస్ఐబీలో ఉన్నప్పుడే ఇన్‌స్పెక్టర్‌గా, యాక్సిలరేటెడ్ విధానంలో డీఎస్పీగా కూడా ప్రమోషన్ పొందాడు. ఎస్ఐబీలో ఆయన నేతృత్వంలోనే స్పెషల్ ఆపరేషన్స్ టార్గెట్ ఏర్పాటైంది. 2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజు అంటే డిసెంబరు 4న ఎస్ఐబీ భవనంలోని సీసీ కెమెరాలను స్విచ్ఆఫ్ చేసి, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లలోని హార్డ్‌డిస్క్‌లు, అందులోని డేటాను ధ్వంసం చేశారు.ఈ వ్యవహారంలో ప్రణీత్‌రావు కీలకపాత్ర పోషించినట్లు సిట్ దర్యాప్తులో తేలింది. దీంతో అతడ్ని సస్పెండ్ చేయాలని నాటి ఇంటెలిజెన్స్ విభాగం అదనపు డీజీపీ 2024 జనవరి 17న ప్రభుత్వానికి సిఫారసు చేశారు. ఈ క్రమంలో అదే ఏడాది మార్చిలో ప్రణీత్‌రావును అధికారులు సస్పెండ్ చేశారు. ఆ తర్వాత జైలుకు కూడా పంపారు. తాజాగా అతడికి డిమోషన్ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది

## వేములవాడ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి

## -కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ పెద్దపల్లి జిల్లా ప్రధానకార్యదర్శి గోటికార్ కిషన్ జీ



వేములవాడ, వేములవాడ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను పట్టణ ప్రజలు ఆదరించి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ పెద్దపెల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్ జీ విజ్ఞప్తి చేశారు. వేములవాడ దేవస్థానం అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ చెప్పినట్లు నిధులు వెచ్చించి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం వల్ల వేములవాడ పట్టణానికి భక్తుల తాకిడి పెరిగి పట్టణవాసులకు ఆర్థిక వెసులుబాటు కలిగిందన్నారు. ప్రతి కుటుంబానికి ఉచితంగా సన్న బియ్యం, రేషన్ కార్డు లేని వానికి రేషన్ కార్డులు మంజూరు చేశారని, సన్న వడ్లకు 500 బోనస్, రైతు భరోసా ను న్యాయంగా రావలసిన వారికి వర్తింపజేయడం, దాదాపు 75 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడం లాంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేస్తూ అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకువచ్చింది అన్నారు. ప్రజా ప్రభుత్వాన్ని బలోపేతం చేయాలంటే మున్సిపాలిటీలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉండాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో వేములవాడను మరింత అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గోటికార్ కిషన్ జీ కోరారు.

## ప్రభుత్వ భూమి అక్రమణకు గురవుతోంది

కాకినాడ జగ్గంపేట మండలం, గోవిందపురం గ్రామంలో రహదారి పక్కనే వున్న ఆక్రమణకు గురవుతున్న స్థలాన్ని ప్రభుత్వం. స్వాధీనం చేసుకుని పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు ఎగుపాటి అర్జునరావు డిమాండ్ చేశారు.

గోవిందపురం గ్రామ శివారున ఉన్న పొలం గల రైతు రహదారి పక్కనే ఉన్న స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారని మేము జెండాలు వేసామని బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి జుత్తుక నాగేశ్వరరావు అన్నారు. సర్వే నెంబర్ 72 లోని రైతు వారి పొలానికి చేర్చి ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి పెన్సినింగ్ వేస్తున్నారన్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోకపోతే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తానని హెచ్చరించారు.

## తాడేపల్లిగూడెం పట్టణంలో దారుణం

## ప్రియురాలిపై ప్రియుడి కుటుంబం దాడి..మృతి

తాడేపల్లిగూడెం ప్రేమించిన యువతిని బండారు సురేష్ అనే యువకుడు నమ్మించి మోసం చేసాడు. కైకలూరు లోకుముడి గరువు గ్రామానికి చెందిన వసంత, తాడేపల్లిగూడెంకు చెందిన బండారు సురేష్ కు మధ్య ప్రేమ వ్యవహారంనడిచింది. విజయవాడ ఒక ప్రైవేట్ యూనివర్సిటీలో బీటెక్ వసంత, సురేష్ చదివారు. సురేష్ చెడు వ్యసనాలకు బానిసై చదువు మధ్యలోనే ఆపేసినట్లు సమాచారం. ప్రేమించిన సురేష్ కి రూ.లక్ష నగదు వసంత ఇచ్చింది. డబ్బుల కోసం సురేష్ ఇంటికి తాడేపల్లిగూడెం ఆదివారం వచ్చిన వసంతపై సురేష్ కుటుంబ సభ్యులు దాడి చేసారు.

తాడేపల్లిగూడెం ప్రైవేట్ హాస్పటల్ లో చికిత్స పొందుతూ తమ్మిరెడ్డి వసంత (22) మృతి చెందింది. టీబీ టాబ్లెట్స్ ఇచ్చి తమ కుమార్తెను చంపేశారని బంధువులు ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## దేశ భవిష్యత్తుపై కీలక ప్రశ్నలు

## కేంద్ర ప్రభుత్వంపై ఎంపీ గడ్డం వంశీకృష్ణ తీవ్ర విమర్శలు

ఇరోజు దేశం ముందుకు ఒక అత్యంత కీలకమైన ప్రశ్న సూటిగా నిలుస్తోందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. నరేంద్ర మోదీ భారతదేశాన్ని ఢిల్లీ నుంచి నడిపిస్తున్నారా? లేక వాషింగ్టన్ డీసీ నుంచి ట్రంప్ నడిపిస్తున్నారా? అనే సందేహం ప్రజల మనసుల్లో స్పష్టంగా కనిపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు.

ఇది సాధారణ రాజకీయ అంశం కాదని, దేశ భవిష్యత్తుకు సంబంధించిన అత్యంత కీలకమైన విషయం అని స్పష్టం చేశారు. బీజేపీ నేతలు భయంతో, విదేశీ ఒత్తిళ్లకు లొంగిపోయినట్టు పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు.ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అడుగుతున్న ప్రశ్నలు దేశం ముందు ఉన్న నిజాలను బయటపెడుతున్నాయని అన్నారు. ఇప్పటివరకు కొనసాగిన ద్వంద్వ వైఖరిని తొలగించి, కేంద్ర ప్రభుత్వ వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకువచ్చారని పేర్కొన్నారు. మోదీ ఎక్స్‌పోజ్ అయ్యారని, నిజం ఇప్పుడు దేశ ప్రజల ముందుకు వచ్చేసిందని తెలిపారు.ఈ నిర్ణయాల భారం నేరుగా భారతదేశ ప్రజలపై పడుతోందని ఎంపీ గడ్డం వంశీకృష్ణ హెచ్చరించారు.

ప్రస్తుతం భారత్ దిగుమతి చేసుకుంటున్న రష్యన్ ఆయిల్ సుమారు 40 శాతం వరకు ఉండగా, ట్రంప్ ఒత్తిడి వల్ల ఆ దిగుమతులను 20 శాతానికి తగ్గించాలని చెప్పడం వల్ల దాదాపు ఒక లక్ష కోట్ల రూపాయల వరకు నష్టం సంభవించే ప్రమాదం ఉందని వివరించారు.అలాగే, కేంద్ర ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసిన “మేక్ ఇన్ ఇండియా” విధానాన్ని పక్కన పెట్టి, అమెరికా ఉత్పత్తులపై ఉన్న టారిఫ్‌లను పూర్తిగా తొలగించడం ద్వారా దేశీయ పరిశ్రమలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నారని ఆరోపించారు. దీని వల్ల మొత్తం మీద రెండు లక్షల నుంచి మూడు లక్షల కోట్ల రూపాయల వరకు భారత ఆర్థిక వ్యవస్థకు నష్టం కలగనున్నట్లు అంచనా వేశారు.ఈ కీలక అంశాలపై బీజేపీ నేతలు సమాధానం చెప్పే ధైర్యం లేకుండా, వాస్తవాల నుంచి తప్పించుకుంటున్నారని విమర్శించారు. లోక్‌సభలో రాహుల్ గాంధీ గారు ఈ ప్రశ్నలను సూటిగా అడుగుతుంటే, అధికార పక్షం స్పందించలేక ఇబ్బంది పడుతోందని తెలిపారు.చివరగా, దేశ ప్రయోజనాలను కాపాడేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడే పోరాటం కొనసాగుతుందని వంశీకృష్ణ స్పష్టం చేశారు.

## కోతుల దాడిలో చిన్నారికి గాయాలు

మెదక్ నర్సాపూర్ లో ఆరు సంవత్సరాల పాపపై కోతులు దాడి చేసాయి. ఘటనలో చిన్నారికి కాలికి గాయాయ్యాయి. కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో 2వ తరగతి చదువుతున్న జోష్ణవి స్కూలుకు వెళుతుండగా కోతులు ముకుమ్మడిగా దాడి చేసాయి. టిఫిన్ బాక్స్ తో స్కూల్ బస్సు ఎక్కుతుండగా కోతులు దాడి కి దిగాయి. కుటుండికులు పాపను చికిత్స నిమిత్తం నర్సాపూర్ ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు.

# కత్తిపూడిలో ఘోర రోడ్డు ప్రమాదం



కాకినాడ కత్తిపూడిలో రోడ్డు ప్రమాదంజరిగింది. ఆటో లారీని ఢీ కొట్టింది. ఘటనలో ఒకరు మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా వుంది. పదిమందికి తీవ్ర గాయాలు అయ్యాయి.ఉప్పాడ కొత్తపల్లి మండలం శ్రీరాంపురం నుంచి ప్రత్తిపాడు మండలం ధర్మవరం చెట్లు నరికేనీదుకు 15 మంది కూలీలతో వెళుతున్న ఆటో కత్తిపూడిలో పిఠాపురం నుంచి రౌతులపూడి వెళుతున్న టిప్పర్ లారీని ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో శ్రీరాంపురం గ్రామానికి చెందిన పితాని కామరాజు (65) మృతి చెందారు. గాయాపడిన వారిని ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు.

## జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ పై అనర్హత పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్ జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ మీద దాఖలైన అనర్హత పిటీషన్ ను ఇచ్చిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కొట్టివేసారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్కు క్లిన్ చిట్ ఇచ్చారు. ఆయన పార్టీ మారారు అనడానికి ఆధారాలు లేవని స్పీకర్ తేల్చి చెప్పారు. సంజయ్ బీఆర్ఎస్ టికెట్ పై గెలిచి తరువాత కాంగ్రెస్ లో చేరారు. నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే కానీ కాంగ్రెస్ పార్టీతో పనిచేస్తున్నాను. కేవలం నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేస్తున్నానని సంజయ్ అంటున్నారు. సంజయ్ పార్టీ ఫిరాయించారని అయనపై అనర్హత వేటు వేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి పిటిషన్ దాఖలు చేసారు.

## కొత్తగూడెంలో గులాబీ జెండా ఎగరడం ఖాయం ఎంపీ వద్దిరాజు



కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ గా అవతరించిన తర్వాత జరుగుతున్న మొట్టమొదటి ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ధీమా వ్యక్తం చేసారు. బీఆర్ఎస్ శ్రేణులు ఉత్సాహంగా ముందుకు సాగుతున్నారని,అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుందని, ఇంతకుముందు కూడా ఈ మునిసిపాలిటీ ఛైర్ పర్సన్ తమ పార్టీకి చెందినవారేనని చెప్పారు.ఎంపీ రవిచంద్ర బుధవారం తనను కలిసిన ఒక టీవీ ఛానెల్ ప్రతినిధితో మాట్లాడుతూ, ధర్మం-అధర్మానికి జరుగుతున్న పోరులో తప్పకుండా ధర్మమే గెలుస్తుందన్నారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చనందున బడుగు బలహీన వర్గాల వారంతా కాంగ్రెస్ పాలకులపై మండిపడుతున్నారన్నారు.వృద్ధులు,దివ్యాంగుల పింఛన్లు పెంచలేదని,రైతుబంధు సక్రమంగా ఇవ్వట్లేదని, నిరుద్యోగ యువతకు,కౌలు రైతులకు చేసిన వాగ్దానాలను తుంగలో తొక్కారని ఎంపీ రవిచంద్ర ఆవేదన వ్యక్తంచేశారు.మాజీ మంత్రి హరీష్ రావు బొగ్గు కుంభకోణాన్ని వెతికి తీయడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కక్ష సాధింపు చర్యలకు దిగి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు,ఆయన కుటుంబ సభ్యులకు వరుసగా నోటీసులిచ్చి “డైవర్షన్ పాలిటిక్స్”చేస్తున్నారని ఎంపీ రవిచంద్ర వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ సర్కార్ పనితీరును చూసి తాము నష్టపోయ్యిందేమిటో ప్రజలు బాగా అర్థం చేసుకోవడం జరిగిందని ఎంపీ రవిచంద్ర వివరించారు.కొత్తగూడెంతో పాటు ఖమ్మం ఉమ్మడి జిల్లాలోని అన్ని మునిసిపాలిటీల్లో బీఆర్ఎస్ ప్రచారం ముమ్మరంగా సాగుతున్నదని,అన్ని చోట్లా కూడా గులాబీ జెండా రెపరెపలాడడం తథ్యమని ఎంపీ వద్దిరాజు స్పష్టం చేశారు.

## తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ న్యాయ బద్ధంగా ప్రవర్తించడం లేదు

## మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

హైదరాబాద్ జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ పార్టీ మారిన ఫిర్యాదును డిస్మిస్ చేసిన స్పీకర్ నిర్ణయం పై మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి స్పందించారు. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ న్యాయ బద్ధంగా ప్రవర్తించడం లేదని అన్నారు. బహిరంగంగా పార్టీ మారి కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొంటున్నా.. స్పీకర్ కి కనపడకపోవడం విచారకరం, చర్య తీసుకోకపోవడం దురదృష్టకరం. స్పీకర్ ఏకపక్ష నిర్ణయం ప్రజలు గమనిస్తున్నారు. కాంగ్రెస్ చర్యల పట్ల ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నది కనబడటం లేదా అని ప్రశ్నించారు.

ఫిరాయించిన ఎమ్మెల్యేలు బహిరంగంగా సభలకు, కాంగ్రెస్ కార్యక్రమాలకు హాజరువుతున్నారు.. అది స్పీకర్ కి కనపడలేదు అంటా . స్పీకర్ ఆత్మసాక్షిగా, చట్ట పరంగా నిర్ణయం తీసుకోలేక పోతున్నారు. స్పీకర్ పిటిషన్ను డిస్మిస్ చేయడం చట్టవిరుద్ధమే. స్పీకర్ వదిలినా కోర్టుల్లో శిక్ష తప్పదు.. వాళ్లను డిస్మిస్ చేయడం ఖాయమని అన్నారు.

## బరిలో భారీ సంఖ్యలో ఇండిపెండెండ్లు

నల్గోండ ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా మున్సిపాలిటీ ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది.నామినేషన్ల ఉపసంహరణ పూర్తవడంతో అసలు పోరు మొదలైంది.బరిలో నిలిచిన అభ్యర్థుల బలాబలాలను అంచనా వేస్తూ కాంగ్రెస్,బీఆర్ఎస్,బీజేపీతో పాటు ఇండిపెండెంట్లు,రెబల్స్ వ్యూహాత్మకంగా కదులుతున్నారు. మొత్తం 407 వార్డుల్లో ఏడుగురు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా మిగిలిన 400 వార్డులకు 1659 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు.భారీ సంఖ్యలో ఇండిపెండెంట్లు బరిలో ఉండటం ఈ ఎన్నికల ప్రధాన ప్రత్యేకతగా మారింది.అధికార,ప్రతిపక్ష పార్టీలకు రెబల్స్ బెడద కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది..

నల్లగొండ జిల్లాలో ఒక కార్పొరేషన్ తో పాటు ఆరు మున్సిపాలిటీల్లో మొత్తం 162 వార్డులు ఉండగా 648 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మిర్యాలగూడ మున్సిపాలిటీలో 48 వార్డులకు 193 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్లో 48 డివిజన్లకు 221 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు.సూర్యాపేట జిల్లాలో ఐదు మున్సిపాలిటీల్లో 141 వార్డులు ఉండగా కోదాడలో మూడు, హుజూర్నగర్లో ఒక వార్డు ఏకగ్రీవం కావడంతో ప్రస్తుతం 137 వార్డులకు మాత్రమే ఎన్నికలు జరగనున్నాయి.ఈ వార్డుల్లో 615 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆరు మున్సిపాలిటీల్లో 104 వార్డులు ఉండగా రెండు వార్డులు ఏకగ్రీవం అయ్యాయి.మిగిలిన 102 వార్డులకు 396 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

'మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఖాతా తెరిచింది.ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏడుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.కోదాడ మున్సిపాలిటీలో దేవరపల్లి మల్లేశ్వరి,కట్టబోయిన జ్యోతి,ఎర్నేని కుసుమకుమారి,హుజూర్నగర్లో నాగలక్ష్మి,హాలియాలో సీతమ్మ, యాదగిరిగుట్టలో గుండ్లపల్లి వాణి భరత్,చౌటుప్పల్లో చింతల ఉమామహేశ్వరి ఏకగ్రీవంగా గెలిచారు.మరోవైపు టికెట్లు దక్కని పలువురు భారీ సంఖ్యలో ఇండిపెండెంట్లుగా,రెబల్స్ గా బరిలోకి దిగారు.దీంతో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలే అవకాశముందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## ఘనంగా తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం నిర్వహణ

### అడిషనల్ కలెక్టర్ మాధురి



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 4(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/వివక్ష, అసమానతలకు తావు లేకుండా సమానత్వంతో కూడిన సమాజాన్ని నిర్మించడమే తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం యొక్క ప్రధాన లక్ష్యమని అడిషనల్ కలెక్టర్ మాధురి పేర్కొన్నారు,సమాజంలోని ప్రతి వర్గానికి సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఫిబ్రవరి 4న తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని అధికారికంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు,కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు,ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాధురి మాట్లాడుతూ, సామాజిక న్యాయం అనేది ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందన్నారు, దళితులు,గిరిజనులు, వెనుకబడిన తరగతులు, మైనారిటీలు,మహిళలు, దివ్యాంగుల అభ్యున్నతికి అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు,రాజ్యాంగం కల్పించిన మౌలిక హక్కులు, సమానత్వం, సోదరభావం వంటి విలువలను ప్రతి పౌరుడు ఆచరణలో పెట్టినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందన్నారు,ఈ సందర్భంగా అందరితో తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవ ప్రతిజ్ఞను చేయించారు,ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి జగదీష్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి విశాలాక్ష్మి, ఇతర జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



## క్యాన్సర్ మహమ్మారిని నిర్మూలిద్దాం...




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 4(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/ప్రపంచ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి తారా ప్రభుత్వ కళాశాలలో జువాలజీ, ఎన్ఎస్ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ తెలిపారు,ప్రస్తుత జీవన విధానంలో అనేక మార్పులు రావడం వల్ల పలువురు అతి ప్రమాదకరమైన క్యాన్సర్ బారిన పడుతున్నారని, ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూలించవలసిన అవసరం ఉందని, అయితే ఈ వ్యాధిని ప్రాథమిక స్థాయిలోనే గుర్తిస్తే వ్యాధి తీవ్రత తక్కువగా ఉంటుందన్నారు,తరచుగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవలసి ఉంటుందన్నారు,క్యాన్సర్ వ్యాధికి వయస్సుతో సంబంధం లేదని ,ఈ వ్యాధిని దేశం నుండి తరిమి వేయవలసిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు,ఈ కార్యక్రమంలో జీవశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రమేష్, అధ్యాపకులు డాక్టర్ అనిత, డాక్టర్ మిథున్ కుమార్ రాథోడ్ ,ఇతర అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ సదయ కుమార్ ఇతర అధ్యాపక బృందము విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## వికారాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల్లో వికారాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు పక్క

### మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సనగారి కొండల్ రెడ్డి



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఫిబ్రవరి 4 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** వికారాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం అనన్య గెలుపు పక్కా అని మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సనా గారి కొండల్ రెడ్డి తెలిపారు, కాంగ్రెస్ పార్టీ తోనే అభివృద్ధి సాధ్యమని మున్సిపాలిటీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి గడ్డం అనన్య ఘన విజయం సాధిస్తుందని తెలిపారు వికారాబాద్ నియోజకవర్గం మండలాల నుండి భారీ ఎత్తున క్యాన్ వర్ సింగ్ లో పాల్గొని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలుసంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇల్లు ఉచిత బస్సు సౌకర్యం సన్న బియ్యం ఇలా అన్ని సంక్షేమ పథకాలు వెనువెంటనే అమల్లోకి వస్తాయని ప్రజలకు వివరిస్తూ క్యాన్ వర్ సింగ్,చేస్తున్నట్లు తెలిపారు



## వార్డును సుందరవనంగా తీర్చిదిద్దుతా...

### కొత్తకాపు శిరీష సురేందర్ రెడ్డి..

### 16 వార్డు మాణిక్ ప్రభు వీధి ఉంగరం గుర్తు అభ్యర్థి..



**జహీరాబాద్ ప్రతినిధి ఫిబ్రవరి 4(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:జహీరాబాద్/** జహీరాబాద్ పట్టణంలోని 16 వ వార్డులో భారీ జనసంద్రోహంతో గడప గడప తిరుగుతూ ప్రతి ఓటరును ఆకర్షిస్తూ కరపత్రాన్ని పంచుతూ 16 వ వార్డు మాణిక్ ప్రభు వీధి అభ్యర్థి కొత్త కాపు శిరీష సురేందర్ రెడ్డి దంపతులిద్దరూ స్వతంత్ర అభ్యర్థిగా ఉంగరం గుర్తుకు మీ అమూల్యమైన ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించగలరని ఓటరు మహాశయులను విజ్ఞప్తి చేశారు,ఈ సందర్భంగా కొత్త కాపు శిరీష సురేందర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో తన సొంత డబ్బులకు పలు కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని,ముఖ్యంగా మహిళలకు దాదాపుగా 300 కుట్టు మిషన్లను పంపిణీ చేశామని, పలు కమిటీ హాల్లు అభివృద్ధికి కృషి చేశామని, అదేవిధంగా పురాతన మాణిక్ ప్రభు వీధి లో ఉన్నటువంటి అమ్మ గుడిలకు మరమ్మత్తుల కొరకు తమ వంతు సేవలు అందించామని అందువల్లన ప్రజలందరూ మా వెనకాలనే ఉన్నారని అన్నారు. కావున మీ అమూల్యమైన ఓటు ఉంగరం గుర్తుకే ప్రజలు ఓటు వేసి గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో 16వ వార్డు మాణిక్ ప్రభు వీధి ప్రజలు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా మహిళలు అభిమానులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు..

## ఒక అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తా

### వార్డు ప్రజల ఆశీర్వాదాలు దీవెనలు నాపై ఉండాలి

### 13వ వార్డు బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి మ్యాదరి పాపయ్య

**అందోల్ నియోజకవర్గంలో ప్రతినిధి ఫిబ్రవరి 4 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా** :ఆందోల్ జోగిపేట మున్సిపల్ పట్టణంలోని 13వ వార్డులో ఎన్నికల ప్రచారంలో బిజెపి పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి మ్యాదరి పాపయ్య, తన ప్రచారంలో దూసుకుపోతున్నారు, బుధవారం గడప గడపకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, వార్డు సమస్యలను నేరుగా తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారు."చెట్టు నీడ కావాలంటే వేరుకు నీళ్లు పోయాలి" అన్న నానుడిని గుర్తు చేస్తూ, అభివృద్ధి జరగాలంటే సరైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని ప్రజలకు తెలియజేశారు.ప్రజల సమస్యలను తన బాధ్యతగా తీసుకుని పరిష్కారం కోసం నిరంతరం పోరాడతానని హామీ ఇచ్చారు.మాటలకన్నా పనితోనే తనను తాను నిరూపించుకుంటానని, వార్డును అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తానని మ్యాదరి పాపయ్య అన్నారు.



## అవకాశం ఇస్తే వార్డు ప్రజలు గర్వపడేలా పనిచేస్తా

### మున్సిపల్ ఎన్నికల బరిలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ అభ్యర్థి గుజ్జరి శంకర్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 4(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** సదాశివపేట/మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా గొల్లకేరి 16వ వార్డులో బరిలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ అభ్యర్థి గుజ్జరి శంకర్ నిలుచోవడం జరిగింది,అనంతరం గుజ్జరి శంకర్ మాట్లాడుతూ ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమ్యస్యలను ఎప్పటికప్పుడు తీరుస్తూ ముఖ్యంగా నీటి కష్టాలు,మురికి కాలువలు,స్ట్రీట్ లైట్లు,కావచ్చు రోడ్లు అధికారులతో మాట్లాడి కాలనీ అభివృద్ధికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి నీరుపేద కుటుంబాలు అయిన ఆడబిడ్డల పెండ్లిలకు తన వంతు సాయం కృషి చేస్తా అని మీ అమూల్యమైన ఓటు కత్తెర గుర్తుకు వేసి గెలిపించాలని ప్రజలను కోరుతున్నా అని అన్నారు.

## 6వ వార్డులో బిజెపి పార్టీ అభ్యర్థి భారీ ప్రచారం...





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 4(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సదాశివపేట/ మున్సిపల్ లోని 6వ వార్డు ప్రజలు తనను ఆశీర్వదించి ఓటు వేయాలని వార్డును మరింత అభివృద్ధి చేస్తానని వార్డు బిజెపి పార్టీ అభ్యర్థి సౌడపురం కావ్య తెలిపారు,బుధవారం నాడు బిజెపి ఎమ్మెల్సీ అంజిరెడ్డి బిజెపి పార్టీ అభ్యర్థి తరఫున 6వ వార్డులో భారీ ఎత్తున ప్రచారం నిర్వహించారు,ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే చిత్తశుద్ధితో వార్డు సమస్యలు తీర్చి అభివృద్ధికి చేయటానికి కృషి చేస్తానని ముఖ్యంగా నీటి కష్టాలు,మురికి కాలువలు,స్ట్రీట్ లైట్లు, శ్మశాన వాటికలు,రోడ్లు అధికారులతో మాట్లాడి కాలనీ అభివృద్ధికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి నీరుపేద కుటుంబాలు అయిన ఆడబిడ్డల పెండ్లిలకు తన వంతు సాయం కృషి చేస్తా తెలిపారు.

# వేములవాడలో మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై ఏఎస్పీ సమీక్ష.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ఫిబ్రవరి నెలలో జరగనున్న మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను వేములవాడ ఏ ఎస్ పి రిత్విక్ సాయి స్వయంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆలయ పరిసరాలలో ఏర్పాటుచేసిన క్యూలైన్లు, పార్కింగ్ స్థలాలు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు తదితర అంశాలను ఆయన వివిధ ప్రదేశాలలో క్షేత్రస్థాయిలో తిరిగి పరిశీలించారు.

అనంతరం ప్రోటోకాల్ కార్యాలయంలో ఆలయంలో శివరాత్రి జాతర ఏర్పాట్లపై ఆలయ ఈవో ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో రాజన్న ఆలయ ఈవో రమాదేవి, ఈ ఈ రాజేష్, వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజన్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఏఎస్పి రిత్విక్ సాయి అధికారులకు సూచించారు.

# కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి.

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.

## 26 వ వార్డులో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన విప్.





**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** వేములవాడ లో జరిగే మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం రోజున వేములవాడ మున్సిపల్ పరిధిలోని 26 వ వార్డులో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించాడు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన జరగనున్న వేములవాడ మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది, వేములవాడ లో నేను ఎమ్మెల్యే గా ఉన్నాను, వేములవాడ పట్టణంలో, రాజన్న ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు.

గతంలో బిజెపి, బిఆర్ఎస్, పార్టీలకు అవకాశం ఇచ్చారని, గతంలో వారికి అవకాశం ఇస్తే వేములవాడ పట్టణ అభివృద్ధిని విస్మరించారని, ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత చేసిన అభివృద్ధి పనులను బేరీజు వేసుకోవాలని అన్నారు.

రాజన్న ఆలయాన్ని నాలుగు ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేస్తున్నామని, ఒక కన్ను రాజన్న ఆలయం, ఇంకో కన్ను పట్టణ అభివృద్ధిగా ముందుకు పోతున్నామని 1000 సంవత్సరాల పాటు ఉండేలా రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు.

50 సంవత్సరాలు రాజన్న భక్తులు, వేములవాడ పట్టణ ప్రజలు ఎదురుచూస్తున్న రోడ్డు వెడల్పు పనులు శరవేగంగా సాగుతున్నాయని, ప్రజలు కోరుకునే విధంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు.

పట్టణ ప్రజలు మీకు విజ్ఞప్తి చేస్తున్నాను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి, మీ వార్డు అభివృద్ధి చేసే బాధ్యత నాది అన్నారు.

మున్సిపల్ ఎన్నికలలో మీ అమూల్యమైన ఓటు కాంగ్రెస్ పార్టీకి వేయాలని రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని, వేములవాడ ఎమ్మెల్యేగా నేను మీకు అండగా ఉంటానని, నాకు చెయ్యి తిరిగే విధంగా అధికార పార్టీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో 26వ వార్డు కౌన్సిలర్ గా పోటీ చేస్తున్న అభ్యర్థి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో బిజిగిర్ షరీఫ్ గ్రామంలో షబేబరాత్ వేడుకలు..

జమ్మికుంట, ముస్లింల పవిత్ర మాసమైన షాబాన్ సందర్భంగా జమ్మికుంట మండలం బిజిగిర్ షరీఫ్ గ్రామంలోని జామే మస్జిద్ హజ్రత్ సయ్యద్ ఇంకుషావలీ రహమతుల్లాహ్ అలై దర్గాలో మంగళవారం రాత్రి భక్తి పారవశ్యంతో ముస్లిం సోదరులు షబేబరాత్ వేడుకలు జరుపుకున్నారు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మానవులందరి భవిష్యత్తుకు షబ్ ఎ-బరాత్ రాత్రి మార్గనిర్దేశనం చేస్తాడని ముస్లింల విశ్వాసం, ఈరోజు అల్లాహ్ తన భక్తుల 'రిజక్' (జీవనోపాధి)ని తదుపరి సంవత్సరానికి నిర్ణయిస్తాడు. రాబోయే ఏడాదికి ఎవరు ఏమి సాధిస్తారు? ఎవరికి ఎంత జీవనోపాధి లభిస్తుంది? ఇలా ప్రతి ముస్లిం యొక్క విధిరాత ఈరాత్రి నిర్ణయించబడుతుంది. అల్లాహ్ అందరి పాపాలు క్షమించడమే కాకుండా, ఏడాది పొడవునా చేయవలసిన కార్యాలను కూడా తన సేవకులలో ప్రతి ఒక్కరికీ పంచిపెడతాడు.ప్రతి వ్యక్తి ఏడాదిలో చేసిన పాప పుణ్యాల లెక్కలు కూడా ఈ రాత్రికి అల్లాహ్ ఎదుట ప్రవేశపెట్టబడుతాయి అని ప్రతి ముస్లింల విశ్వాసం. షబ్ ఎ-బరాత్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పవిత్ర ఖురాన్ ను పఠించినారు. మానవజాతి శ్రేయస్సు కోసం దువా చేశారు. జామే మస్జిద్ లో మత గురువులు మౌలానా నౌమాన్ హష్మి , మౌలానా ఇర్ఫాన్ రజా, మౌలానా అక్మల్ రజా, అల్లాహ్ సందేశాలను, ఖురాన్ లోని సూక్తులను వివరించారు. ప్రత్యేక నమాజు చదివించినారు. అనంతరం మౌలానా నౌమాన్ హష్మీ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త (స) సతీమణి హజ్రత్ అయిషా ఒకసారి అర్ధరాత్రి నిద్రలేచి చూసేసరికి మొహమ్మద్ ప్రవక్త కనిపించలేదు. ఆమె వెతుక్కుంటూ బయటికి వెళ్లింది. జన్నతుల్ బఖీ అనే ఖనన వాటికలో సమాధుల మధ్య (ప్రవక్త (స) కనిపించారు. హుటాహుటిన ఆయన దగ్గరికి వెళ్లింది. భార్యను చూసిన ప్రవక్త (స) 'అయిషా! నన్నే అనుమానిస్తున్నావా? అల్లాహ్ మన్నింపు, కారుణ్యం కురిసే చేయి ఇది, అందుకే ఈ సమాధుల్లో శాశ్వతంగా నిద్రిస్తున్న వారి మన్నింపు కోసం అల్లాహ్ ను వేడుకుంటున్నాను' అని తన సతీమణికి వివరణ ఇచ్చారు. ముహమ్మద్ ప్రవక్త (స).షాబాన్ నెల 15వ తేదీ అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన ఇస్లామీయ చరిత్రలో నిలిచిపోయింది. రంజాన్ నెలకు 15 రోజుల ముందు జరిగిన ఈ ఘటనను "షబే బరాత్"గా జరుపుకొంటారు అని చెప్పారు. మంగళవారం రాత్రంతా ముస్లింలు జాగారం చేస్తూ మసీదుల్లో నమాజులు ఆచరించారు. షాబాన్ మాసంలో మృతి చెందిన తమ పూర్వీకుల ఆత్మకు శాంతి చేకూర్చాలని వారి యొక్క సమాధుల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తమ పూర్వీకుల సమాధులను సందర్శించినారు. వారి మగ్ఫిరత్ (మన్నింపు)కోసం దువా చేసినారు. దువా అంటే వేడుకోలు షాబాన్ నెల తొలి పదిహేను రోజులు ప్రవక్త (స) ఉపవాసాలు పాటించి రమజాన్ కు సంసిద్ధులయ్యే వారు. శుభాలు సమృద్ధిగా వర్షించే షాబాన్ నెలలో నిర్లక్ష్యానికి తావివ్వకుండ రంజాన్ నెలను స్వాగతించే విధంగా ఎవరికి వారు సన్నద్ధం కావాలి. వీలైనన్ని ఎక్కువ ప్రార్థనలు చేసి దైవ సాన్నిధ్యాన్ని పొందాలి' అంటారు అబ్దుల్ ఖాదిర్ జిలాని రహ్మతుల్లా అలైహ్. సమాధులను సందర్శించడం వల్ల కనువిప్పు కలుగుతుందని ఉలేమాలు షబే బరాత్ సందేశాన్ని వివరించినారు. ఖబరస్తాన్ (ఖనన వాటిక)లో ప్రవేశించేటప్పుడు అస్సలాము అలైకుం 'యా ఆహలల్ ఖుబూర్' అని చెబుతూ లోనికి ప్రవేశించారు. 'సమాదుల్లో నిద్రిస్తున్న మీపై శాంతి శుభాలు కురియుగాక అన్నది దాని అర్థం. ముస్లిం సోదరులు అందరు కలిసి దర్గాలోని హజ్రత్ సయ్యద్ ఇంకుషావలి రహమతుల్లాహ్ ఆలై, హజ్రత్ సయ్యద్ అజ్మత్ షావలి రహమతుల్లాహ్ ఆలై, హజ్రత్ సయ్యద్ ముర్తుజాషావలి రహమతుల్లాహ్ ఆలై, హజ్రత్ సయ్యద్ అక్బర్ షావలి రహమతుల్లాహ్ ఆలై సమాధులకు దర్శించుకున్నారు.ముస్లిం సోదరులు రాత్రంతా జాగరము చేశారు. ఈ వేడుకల్లో జమ్మికుంట మండలం మాజీ కోఆప్షన్ సభ్యులు సయ్యద్. అంకుషావలి, దర్గా కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ ఇక్బాల్, దర్గా కమిటీ కార్యనిర్వాహణ అధ్యక్షుడు మొహమ్మద్ తౌపిక్ హుస్సేన్, దర్గా కమిటీ కార్యదర్శి మహమ్మద్ జమాల్ అష్రఫ్,దర్గా కమిటీ సంయుక్త కార్యదర్శి మహమ్మద్ నయిముద్దీన్, సభ్యులు లతీఫ్ హుస్సేన్, అహ్మద్, జలీల్, ఇమ్రాన్ హుస్సేన్, తాజ్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో గడప గడపకు బీఆర్ఎస్ పార్టీ ప్రచారం.

## అభివృద్ధి బిఆర్ఎస్ పార్టీతోనే సాధ్యం.

## వేములవాడ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ చల్మెడ.









**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** బుధవారం రోజున వేములవాడ మున్సిపల్ ఎన్నికలవేళ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా వేములవాడ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు గడపగడపకు తిరుగుతూ ప్రచార పర్వాన్ని వేగవంతం చేశారు. వేములవాడ మున్సిపల్ ఒకటవ వార్డు రెండవ వార్డు లలో సీనియర్ బిఆర్ఎస్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి తో కలిసి ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ గడచిన రెండున్నర సంవత్సరాలలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమీ లేదని, ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసిందని ఆయన ధ్వజమెత్తారు.

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 1వ వార్డు అభ్యర్థి రేగుల లతబిరాజేశం, రెండవ వార్డ్ అభ్యర్థి ఏనుగు జ్యోతిబితిరుపతి రెడ్డిలతో కలిసి గడపగడపకు వెళ్లి ఓటర్లను కలుసుకొని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేసిన మోసాలను తిప్పి కొట్టాలని, అభివృద్ధి కేవలం బిఆర్ఎస్ పార్టీ తోనే సాధ్యమని ప్రజలకు వివరించారు. కారు గుర్తుపై ఓటు వేసి తమ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ఈ సందర్భంగా ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

వేములవాడ మున్సిపల్ పరిధిలో కేసీఆర్ ఆయాంలో జరిగిన అభివృద్ధి పనులను గుర్తు చేస్తూ, మళ్లీ అభివృద్ధి పట్టాలెక్కాలంటే బిఆర్ఎస్ అభ్యర్థులు గెలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ ప్రచారానికి ప్రజల నుండి అపూర్వ స్పందన లభించింది. ఓటర్లు అడుగున కారు గుర్తుకే మన ఓటు అంటూ చెల్మెడకు నీరాజనాలు పలికారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# భీమన్న ఆలయంలో చురుగ్గా మహాశివరాత్రి జాతర ఏర్పాట్లు.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ఫిబ్రవరి నెల 14,15,16 తేదీలలో జరిగే మహాశివరాత్రి జాతర సందర్భంగా ఏర్పాట్లను ఆలయ అధికారులు ముమ్మరం చేశారు.

భీమేశ్వర ఆలయం మరియు అనుబంధ ఆలయాలలో కలర్స్, క్యూలైన్లలో పరిశుభ్రత పనులు చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేయడంతో పాటు, పార్కింగ్ ప్రాంతాల్లో చలువ పందిళ్లు, తాత్కాలిక టెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా టాయిలెట్స్, విద్యుత్ దీపాలు, అదనపు క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు.



వృద్ధులు, వికాలాంగ భక్తులకు ఆలయంలోకి సులభంగా వెళ్ళుటకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నారు. ఆలయ పరిసరాలలో వివిధ ప్రాంతాలలో భక్తులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు మెరుగైన రీతిలో అందుబాటులోకి తెస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని అధికారులు పేర్కొన్నారు.

# వికారాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భారీ ఎత్తున పాల్గొన్న మర్పల్లి నాయకులు

## మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ ఆధ్వర్యంలో





**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 4 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం నుండి భారీ ఎత్తున వికారాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నాయకులు వికారాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల్లో గడ్డం ప్రసాద్ కుమార్ కుమార్తె గడ్డం అనన్య వికారాబాద్ మున్సిపాలిటీ చైర్మన్ గా పక్కా గెలుస్తుందని మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ కుమార్, తెలిపారు ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ నాయకులు గూడెం రాములుయాదవ్ ,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మనీలా సురేష్, మాజీ ఎంపిటిసి సురేష్, సీనియర్ సర్పంచ్ రఫీ యో దిన్, పట్లూర్ సర్పంచ్ పరు శురాం, మరియు నూతనంగా ఎన్నికైన సర్పంచులు పెద్దలు సీనియర్ నాయకులు మాజీ సర్పంచులు మాజీ ఎంపిటిసిలు యువ నాయకులు పెద్దలుఉప్పరి నగేష్,పెద్ద ఎత్తున వికారాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో మర్పల్లి నాయకులుపాల్గొన్నట్టు మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ కుమార్ యాదవ్ తెలిపారు

# పుప్పాలగూడ పి.వీ.ఎన్.ఆర్ పార్కు పర్యవేక్షణ లోపం



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 4 ఫిబ్రవరి 2026**భారత రాష్ట్ర సమితి స్థానిక నాయకులు చేపట్టిన మీ సమస్య – మా బాధ్యత, ప్రజలతో – ప్రజల కోసం కార్యక్రమంలో భాగముగా బుధవారం రోజున పుప్పాలగూడ బాలాజీ నగర్ లో గల పి.వీ నరసింహారావు పార్కు పరిసర ప్రాంతాలలో పర్యవేక్షణ చేయడం జరిగినది. పార్కులో అసంపూర్తిగా సమకూర్చిన ఆట పరికరాల వలన, అట్టి ఆట పరికరాలు నిలబడడానికి రాళ్ళను పేర్చడం, కనీసం ఇసుక కూడా వేయకుండా ఉన్నందున పిల్లలు, వయోజనులు ఇబ్బందుల పాలవుతున్నారని, సరియైన పద్ధతిలో సమకూర్చక పోవడం మునిసిపల్ అధికారుల ఘనతగా ఉన్నదని వెల్లడిస్తూ, సంబంధిత కాంట్రాక్టర్ పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయమై 370 మంది స్థానికులు సంతకాలు చేసి వినతి పత్రం సమర్పించి నను అధికారులలో స్పందన కరువైనదనీ వాపోయారు. పార్కు లోపల చుట్టూతా రాళ్లు రప్పలు ఉన్నవని వాటిని తొలగించి చెట్లునాటి సుందరీకరణ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కే.పి.ఆర్ కాలనీ, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల పర్యవేక్షణ సందర్భముగా ఇక్కడ కుక్కల బెడద మెండుగా ఉన్నదని తెలియ జేసినారు,



తత్ ద్వారా స్థానికులు బయ భ్రాంతులతో కాలం గడుపుతున్నారని. ప్రజా సౌకర్యార్థం సంబంధిత అధికారులు స్పందించి సమగ్ర పరిశీలిన చేయాలని, పనులు చేపట్టాలని స్థానికులతో పాటు భారత రాష్ట్ర సమితి పార్టీ స్థానిక అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ, వర్కింగ్ ప్రెసిడెంట్ కుంబగళ్ళ ధనరాజ్, ముఖ్య కార్యదర్శి గుట్టమీది నరేందర్, మహిళా అధ్యక్షురాలు రూపా రెడ్డి, ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు, ఎస్.సి విభాగపు అధ్యక్షుడు యాలల కిరణ్, సోషియల్ మీడియా కార్యదర్శి సుమనళిని, క్రీడా విభాగపు అధ్యక్షుడు భాను, క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు జయరామ్, నాయకులు బాబు రావు, రఫిక్, సాగర్, హిరు సింగ్, సురేఖ తది తరులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు.

# కబ్జాదారులను కట్టడి చేసిన హైడ్రా










**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 4ఫిబ్రవరి 2026**నెక్నంపూర్ డివిజన్ – 128 పరిధిలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో ప్రజా ఉపయోగ స్థలాలపై జరిగిన ఆక్రమణల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. హైడ్రా పరిశీలనలో కమ్యూనిటీ హాల్ స్థలానికి సంబంధించిన ఎల్.ఆర్.ఎస్ నకిలీ అని గుర్తించ బడింది. టెంటేటివ్ లే అవుట్ 1996 ను ఆమోదించ బడిన లే అవుట్‌గా చూపిస్తూ, లే అవుట్‌లో ఉన్న ప్లాట్ల వివరాలను ఆధారంగా చేసుకుని భూకబ్జా దారులు ఇప్పటికే కమ్యూనిటీ హాల్ మరియు సెప్టిక్ ట్యాంక్ స్థలాలను ఆక్రమించి నట్లు హైడ్రా అధికారులు గుర్తించినట్లు సమాచారం. హైడ్రా పరిశీలనలో సెప్టిక్ ట్యాంక్ స్థలం విషయంలో అక్రమంగా హౌస్ నంబర్ అసెస్‌మెంట్ ఆధారంగా హెచ్.ఎమ్.డీ.ఏ అనుమతులు పొందినట్లు గుర్తించబడింది. అనంతరం జరిగిన విచారణలో సంబంధిత ఎల్.ఆర్.ఎస్ నకిలీ అని హెచ్.ఎమ్.డీ.ఏ నిర్ధారించి నట్లు హైడ్రా తెలిపింది. ఈ పరిణామాల నేపథ్యంలో హైడ్రా అధికారులు ఇప్పటికే ఆక్రమణకు గురైన స్థలంలో నిర్మించిన ఐదు అంతస్తుల భవనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కాలనీ అసోసియేషన్ సభ్యులు దాఖలు చేసిన కోర్టు రిట్ పిటిషన్ నేపథ్యంలో, హైడ్రా ద్వారా ఓపెన్ స్పేస్, సెప్టిక్ ట్యాంక్ మరియు కమ్యూనిటీ హాల్ స్థలాల పునరుద్ధరణ అంశం ప్రాధాన్యత సంతరించుకుంది.

# మృతిరాలి కుటుంబానికి ఎస్ కే ఆర్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 4 (ప్రజాబలం)వికారాబాద్ జిల్లా:**మర్పల్లి మండల పరిధిలోని కోట్ మర్పల్లి గ్రామానికి చెందిన కమ్మరి అమృతమ్మ మంగళవారం రాత్రి మృతి చెందింది.. అట్టి విషయం తెలుసుకున్న ఎస్ కే ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, వికారాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సనగారి కొండల్ రెడ్డిఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు, అమృతమ్మ అంత్యక్రియల నిమిత్తం 5 వేల రూపాయలు పంపించారు.. స్థానిక సర్పంచ్ మల్లారెడ్డి గ్రామస్తులతో కలిసి మృతురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఎస్ కే ఆర్, ట్రస్టు వ్యవస్థాపకులుపంపిన నగదును అందజేశారు. కార్యక్రమంలో కృష్ణరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రామ్ రెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు..

# అరుణాచల నృత్యోత్సవంలో నాటరాజ కళాక్షేత్రం విద్యార్థుల ప్రతిభ




**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 04 :** అరుణాచలంలోని లంబోదర అకాడమీ ఆధ్వర్యంలో జనవరి 31న నిర్వహించిన అరుణాచల నృత్యోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జన్నారం,దండేపల్లి,లక్షెట్టిపేటలోని నాటరాజ కళాక్షేత్రం విద్యార్థులు పాల్గొని తమ అద్భుతమైన నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. గురువు నర్మదా మార్గదర్శకత్వంలో శిక్షణ పొందిన విద్యార్థులు సాంప్రదాయ శాస్త్రీయ నృత్యాలకు ప్రతీకగా నిలిచే విధంగా ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తమ నైపుణ్యం,భావప్రకటన, లయాత్మకతతో నృత్యోత్సవానికి మరింత శోభను తీసుకొచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకులు విద్యార్థులను అభినందించగా,తల్లిదండ్రులు,కళాప్రియులు గురువు నర్మదా శిక్షణను,నాటరాజ కళాక్షేత్రం సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని కార్యక్రమాల్లో పాల్గొని కళారంగంలో మరింత ఉన్నత స్థాయికి చేరాలని విద్యార్థులకు ఆకాంక్షలు తెలిపారు.



# మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

## జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 04 :** 2వ సాధారణ మున్సిపాలిటీ/మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో భాగంగాఈ నెల 11వ తేదీన జరుగనున్న పోలింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలో పి.ఓ., ఎ.పి.ఓ.లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ 2వ సాధారణ మున్సిపాలిటీ/మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో భాగంగా పోలింగ్ ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు.ప్రతి పోలింగ్ కేంద్రంలో 800 ఓటర్లకు మించకుండా పోలింగ్ జరిగేలా ఏర్పాట్లు చేయడం జరిగిందని,ప్రతి పోలింగ్ కేంద్రంలో కేటాయించబడిన సిబ్బందికి పోలింగ్ ప్రక్రియలోని ప్రతి అంశం తెలిసి ఉండాలని, ఓటింగ్ కంపార్ట్మెంట్ గోప్యత నిర్వహణ సక్రమంగా చేయాలని తెలిపారు.ఇతరులకు బదులుగా ఓటు వేయడం,ఒకటికి మించి ఓటు వేయడం జరగకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని,పోలింగ్ ముగిశాక తీసుకోవలసిన జాగ్రత్తలు,పాటించవలసిన నియమాలపై శిక్షణలో తెలియజేయడం జరుగుతుందని తెలిపారు.పోలింగ్ అధికారులకు కేంద్రాలలో త్రాగునీరు, మూత్రశాలలు,లైటింగ్,ఫ్యాన్ వంటి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, గర్భిణీ స్త్రీలు, బాలింతలు మినహాయింపు కోరినట్లయితే ఆమోదించడం జరుగుతుందని, మిగతా వారికి అత్యవసర ఆరోగ్య పరిస్థితులు,ఇతర ఇబ్బందులు తలెత్తితే తప్ప పోలింగ్ విధులలో మినహాయింపు ఉండదని తెలిపారు. 11వ తేదీన పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, 12 రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల నగరపాలక సంస్థ కమిషనర్ అన్వేష్,మాస్టర్ ట్రైనర్ హరిప్రసాద్,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.






# బ్యాలెట్ పేపర్ల ముద్రణలో అప్రమత్తంగా వ్యవహరించాలి

## జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 04 :** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా బ్యాలెట్ పేపర్ల ముద్రణలో అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో బ్యాలెట్ పేపర్ల ముద్రణ కొరకు ఎంపిక చేసిన శారద ప్రింటింగ్ ప్రెస్ ను కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్ తో కలిసి ఆకస్మికంగా సందర్శించి ముద్రణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ...2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా నామినేషన్ల ప్రక్రియ ముగిసిందని, నామినేషన్ల ఉపసంహరణ అనంతరం అర్హత గల అభ్యర్థులకు నిబంధనల ప్రకారం ఎన్నికల గుర్తులు కేటాయించడం జరిగిందని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో 240 మంది, బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 34 వార్డులలో 173 మంది,చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని 18 వార్డులలో 107 మంది, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని 22 వార్డులలో 113 మంది, లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని 15 వార్డులలో 60 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారని తెలిపారు. జిల్లాలోని 1 మున్సిపల్ కార్పొరేషన్, 4 మున్సిపాలిటీలలో మొత్తం 693 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థులకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం గుర్తులు కేటాయించడం జరిగిందని, ప్రింటింగ్ ప్రెస్ యాజమాన్యం బ్యాలెట్ పేపర్ల ముద్రణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని,ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్, 12వ తేదీన రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13వ ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణ పనులను వేగవంతం చేయాలి
## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 04 :** ప్రభుత్వం విద్యా వ్యవస్థను పటిష్టపరిచేందుకు చేపట్టిన చర్యలలో భాగంగా బెల్లంపల్లి పట్టణంలో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం బెల్లంపల్లి పట్టణంలో కొనసాగుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను ఆకస్మికంగా సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా అనేక చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగా 25 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో 200 కోట్ల రూపాయల వ్యయంతో పాఠశాల నిర్మాణానికి చర్యలు చేపట్టిందని తెలిపారు. జిల్లాలోని మంచిర్యాల,చెన్నూర్ నియోజకవర్గాల పరిధిలో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలలో సకల సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించి వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం జరుగుతుందని తెలిపారు.నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 3వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి గా మర్రి అరుణ కుమార్ మద్దతుగా బత్తిని మౌనిక నామినేషన్ ఉపసంహరణ



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 4 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:**అందోల్--జోగిపేట్ మున్సిపల్ ఎన్నికలలో మూడో వార్డు నుండి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన బత్తిని మౌనిక,మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఆదేశాల మేరకు ఆమె పోటీ నుండి స్వచ్ఛందంగా తప్పుకుంటూ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మర్రి అరుణ కుమార్,కి పూర్తిస్థాయి మద్దతు ప్రకటించి, ఆయన విజయానికి కృషి చేస్తానని తెలియజేశారు,బత్తిని మౌనిక,తనకు మద్దతు తెలిపినందుకు అభ్యర్థిని అరుణ కుమార్, ఆనందం వ్యక్తం చేస్తూ, సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు జగన్మోహన్ రెడ్డి కృష్ణారెడ్డి, సురోత్తమ్ రెడ్డి, పెంద్యాల రాములు లకు,ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు, మంత్రి ఆశీస్సులతో 3వ,వార్డులోని ప్రతి సమస్యను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని కాంగ్రెస్ అభ్యర్థి మర్రి అరుణ కుమార్, ఈ సందర్భంగా స్పష్టం చేశారు,ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మర్రి అరుణ కుమార్‌తో పాటు పార్టీ నాయకులు సదాశివుడు, కుమార్, అవినాష్, సతీష్, ప్రశాంత్, శివకుమార్, వెంకటేష్, సంతోష్, జోగినాథ్, చాపల మహేష్, ఎల్లప్ప, బన్నీ, తదితరులు పాల్గొన్నారు.

## మహనీయులు.. అమరులు మగ్దూం మోహియోద్దీన్ ఘనంగా 118వ జన్మదిన వేడుక




**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 4 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా** గొప్ప మహనీయుడి మగ్దూం మొహియుద్దీన్ 118వ,జన్మదినోత్సవ సందర్భంగా బుధవారం జోగిపేట పట్టణంలో, మగ్దూం మొహియుద్దీన్ ప్రెస్ అసోసియేషన్, ఆందోల్ నియోజకవర్గం జోగిపేట, ప్రధాన కార్యాలయంలో, అధ్యక్షుడు మెట్టు రమేష్, గౌరవ అధ్యక్షులు చాపల సత్యం, కార్యదర్శుల, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమరులు మహనీయుడు ఉర్దూ కవి,కమ్యూనిస్ట్ యోధుడు, అందోల్ ముద్దు బిడ్డ, మగ్దూం మొహియుద్దీన్ 118వ,జయంతి వేడుక సంబరాన్ని ఆ యూనియన్ పాత్రికేయులు ఘనంగా జరుపుకున్నారు, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి ఘన నివాళులు అర్పించారు, ఈ సందర్భంగా ఆ యూనియన్ నాయకులు మాట్లాడుతూ, మగ్దూం పల్లెలో పుట్టి పల్లెలోనే పెరిగాడు, అందుకని పల్లెజనం బాధలు, కష్టాలు ఆయన కవితల్లో ప్రస్ఫుటమవుతుంటాయి, మగ్దూం నిరంకుశ రాజరిక వ్యవస్థను ప్రశ్నించాడు, ఆయన స్ఫూర్తి అడుగుజాడల్లో ముందుకు కొనసాగుతామని అన్నారు.



తెలంగాణ నేలలో వీరుల రక్తం, గాలిలో శౌర్యం ఇమిడి పోయిందని పోరాటాల ద్వారా, కవిత్వం ద్వారా ప్రపంచానికి తుపాను మోతతో వినిపించిన ప్రజా కవి మగ్దూం మొహియుద్దీన్ ఘనత ఆయనది.ఈ యూనియన్ లో ఉన్న వర్కింగ్ జర్నలిస్టులకు రావాల్సిన సంక్షేమ పథకాల కోసం మా నిరంతర కృషి ఉంటుందని ఈ సందర్భంగా వారన్నారు. ఈ కార్యక్రమంలో జోగిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ మైనార్టీ యూత్ నాయకులు చోటు ఖాన్, పోసానిపేట సర్పంచ్ గోపాల్, పాత్రికేయ మిత్రులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ ఎన్నికలలో ఆందోల్ -జోగిపేట 20 వార్డులకు 63 మంది అభ్యర్థులు బరిలో




**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 4 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా, ఆందోల్-జోగిపేట, మున్సిపాలిటీ పరిధిలో, నామినేషన్ల ప్రక్రియలో 219, మంది నామినేషన్ దాఖలు చేయగా, కొందరు అభ్యర్థులు నామినేషన్లను విత్ డ్రా చేసుకోగా, ఎన్నికల్లో 20 వార్డులలో 63 మంది, వివిధ పార్టీల నాయకులు, ఎన్నికల రంగంలో ఉన్నట్లు, మున్సిపల్ కమిషనర్ రవీందర్ తెలిపారు, 20 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులు, పోటీదారులుగా, 20 వార్డుల్లో బిఆర్ఎఫ్ అభ్యర్థులు, పోటీదారులుగా, భారతీయ జనతా పార్టీ( బిజెపి) అభ్యర్థులు 14 మంది వివిధ వార్డుల్లో కోటి రంగంలో ఉండగా, ఇండిపెండెంట్ అభ్యర్థులు, 9 మంది, ఎన్నికల రంగంలో ఉన్నట్లు, ఎన్నికల నిర్వహణ అధికారులు ప్రకటించారు......

## వికారాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల్లో వికారాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు పక్క మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సనగారి కొండల్ రెడ్డి



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఫిబ్రవరి 4 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** వికారాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం అనన్య గెలుపు పక్కా అని మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సనా గారి కొండల్ రెడ్డి తెలిపారు, కాంగ్రెస్ పార్టీ తోనే అభివృద్ధి సాధ్యమని మున్సిపాలిటీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి గడ్డం అనన్య ఘన విజయం సాధిస్తుందని తెలిపారు వికారాబాద్ నియోజకవర్గం మండలాల నుండి భారీ ఎత్తున క్యాన్ వర్ సింగ్ లో పాల్గొని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలుసంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇల్లు ఉచిత బస్సు సౌకర్యం సన్న బియ్యం ఇలా అన్ని సంక్షేమ పథకాలు వెనువెంటనే అమల్లోకి వస్తాయని ప్రజలకు వివరిస్తూ క్యాన్ వర్ సింగ్,చేస్తున్నట్లు తెలిపారు

## అక్షర దినపత్రిక 2026 నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఖమ్మం జిల్లా రవాణాశాఖ అధికారి ధర్మపురి జగదీష్



**ఖమ్మం ప్రతినిధి ఫిబ్రవరి 4 (ప్రజాబలం)** ఖమ్మం ప్రజల సమస్యలు వెలికి తీసి పరిష్కరించడంలో మీడియా పాత్ర మరువలేనిదని ఖమ్మం జిల్లా రవాణా శాఖ అధికారి ధర్మపురి జగదీష్ అన్నారు బుధవారం ఖమ్మం జిల్లా అక్షరం దినపత్రిక స్టాఫ్ రిపోర్టర్ దేవబత్తిని సీతారాములు ఆధ్వర్యంలో జిల్లా రవాణా శాఖ కార్యాలయం నందు నూతన సంవత్సర 2026 నూతన క్యాలెండర్ ను జిల్లా రవాణాశాఖ శాఖ అధికారి ధర్మపురి జగదీష్ చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు వెతికి తీసి, అధికారులు, ప్రజా ప్రతినిధుల చేత పరిష్కరించడంలో అక్షరం దినపత్రిక మరువలేనిదని ఆయన అన్నారు. ప్రజా క్షేత్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను అధికారుల పాలకుల దృష్టికి తీసుకోవడంలో మీడియా ఎంతో కాలంగా చాలా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

అనంతరం దేవబత్తిని సీతారాములు జిల్లా రవాణాశాఖ అధికారి ధర్మపురి జగదీష్, ఆర్టిఏ నెంబర్ గజ్జెల్లి వెంకన్న ఆర్ స్వర్ణలత లకు జ్ఞాపికం అందించి శాలువా తో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ మిత్రులు రవాణా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# పాత తరం పాత్రికేయులను మార్గదర్శకంగా తీసుకోవాలి

హైదరాబాద్ తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ పాత్రికేయులపై అకాడమీ ప్రచురించిన చిరు పుస్తకాల (మోనోగ్రాఫ్స్) ఆవిష్కరణ, ఇటీవల మరణించిన పాత్రికేయుల కుటుంబాల పెన్షన్ చెక్కుల ప్రదాన కార్యక్రమం బుధవారం జరిగింది.ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, విద్యా, ప్రజా వ్యవహారాల సలహాదారు కె. కేశవ రావు, తెలంగాణ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ మోనోగ్రాఫ్స్ పుస్తకాలు యువ జర్నలిస్టులు చదవాలి. సీనియర్ పాత్రికేయుల అనుభవాలు , ఆలోచనలు ఈ పుస్తకంలో పొందుబారిచారు. ఇది నేటి జర్నలిస్టులకు దిక్సూచిగా నిలుస్తుందన్నారు.పాత్రికేయులుగా పని చేస్తూ మరణించిన వారి కుటుంబాలకు మీడియా అకాడమీ అండగా నిలవడం అభినందనీయం. వారి కుటుంబాలకు అండగా ఉన్నామని చెప్పేందుకు పెన్షన్ ఇస్తున్నారు. పాత్రికేయ రంగం అంటే ఎన్నో ఒడిదుడుకులు ఉంటాయి. సోషల్ మీడియా వచ్చాక వారిపై మరింత ఒత్తిడి పెరిగింది. సమాజంలో మార్పు తీసుకురావడంలో పాత్రికేయులది కీలక పాత్ర. పాత తరం పాత్రికేయులను మార్గదర్శకంగా తీసుకొని కొత్తవారు ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నారు.

# జన్మదినం కాదు జనసేవా పండుగ

## తుమ్మల యుగంధర్ జన్మదిన వేడుకలు

## ఖమ్మంలో జనసంద్రమైన సేవా సంబరాలు

## మెగా రక్త దాన శిబిరం విజయవంతం

**ఖమ్మం ప్రతినిధి ఫిబ్రవరి 4 (ప్రజాబలం)**ఖమ్మం నగరంలో బుధవారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు తుమ్మల యుగంధర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. నగరమంతా పండుగ వాతావరణాన్ని తలపించేలా కార్యకలాపాలు కొనసాగాయి. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని సంబరాలు నిర్వహించారు. ప్రతి డివిజన్‌లో యువత









ఉత్సాహంగా వేడుకలు జరిపారు. తుమ్మల యుగంధర్ పేరుతో నినాదాలు మార్మోగాయి. అభిమానులు భారీగా చేరి జన్మదినాన్ని పండుగలా తీర్చిదిద్దారు. నాయకుడి పట్ల ఉన్న అభిమానాన్ని ప్రజలు ఈ వేడుకల ద్వారా చాటారు. తుమ్మల యుగంధర్ సామాజిక సేవల పట్ల ఉన్న నిబద్ధతను గుర్తు చేశారు. నగరమంతా కాంగ్రెస్ జెండాలతో కళకళలాడింది. తుమ్మల యుగంధర్ జన్మదినం ఖమ్మానికి ప్రత్యేక గుర్తింపునిచ్చింది.డివిజన్ డివిజన్‌లో కేక్ కట్ ఖమ్మం నగరంలోని అన్ని డివిజన్లలో తుమ్మల యుగంధర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. యువకులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు తుమ్మల యువసేన నాయకుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు సాగాయి. ప్రతి డివిజన్‌లో పెద్ద కేక్‌లను కట్ చేసి సంబరాలు చేశారు. యువతలో తుమ్మల యుగంధర్ పట్ల ఉన్న అభిమానాన్ని ఇది ప్రతిబింబించింది. నాయకుడి సేవలను గుర్తు చేస్తూ ప్రసంగాలు చేశారు. పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న కృషిని కొనియాడారు. తుమ్మల యుగంధర్ యువతకు ఆదర్శమని పలువురు అభిప్రాయపడ్డారు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు అభిమానులు బంధువులు స్నేహితులు కార్యకర్తలు పాల్గొన్నారు

# ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి పట్టం కట్టండి

## ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ప్రచారంలో పాల్గొన్న మల్లి బాబు యాదవ్

**ఖమ్మం ప్రతినిధి ఫిబ్రవరి 04 (ప్రజాబలం)** ఏదులాపురం మున్సిపాలిటీ మేనిఫెస్టో ప్రకారం మాట తప్పకుండా ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రభుత్వ ఖజానా లోటు బడ్జెట్ లో ఉన్నప్పటికీ తెలంగాణ ప్రజల సంక్షేమం అభివృద్ధి కి పట్టం కట్టిన రేవంత్ ప్రభుత్వం చేస్తున్న కృషిని దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను.. గెలిపించవలసిందిగా మాజీ జెడ్పిటిసి, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పిలుపునిచ్చారు నూతనంగా ఏర్పడిన
ఏదులాపురం మున్సిపాలిటీ తొలిసారిగా జరుగుతున్న ఎన్నికల ప్రచారం నిమిత్తం మున్సిపాలిటీ పరిధిలోని వెంకటగిరి, గుర్రాలపాడు తదితర గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం బుధవారం నాడు మేకల మల్లిబాబు యాదవ్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రియతమ గౌరవనీయులైన మంత్రివర్యులు,



తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారి కోరిక మేరకు పాలేరు నియోజకవర్గం లోని 12 గ్రామాలలో అభివృద్ధి కోసం ఏదులాపురం మున్సిపాలిటీ ఏర్పడిందని, తొలిసారిగా జరుగుతున్నఈ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం తద్యమని, ఆకాంక్షించారు. మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఫ్రీ బస్సు పథకం, ఉచిత కరెంటు, ఇందిరమ్మ ఇండ్లు, రైతుబంధు పథకం, రేషన్ కార్డుల పంపిణీ, లాంటి కార్యక్రమాలు తెలంగాణ ప్రజలు అందరికీ
రాజకీయా లకతీతంగా, వర్గాలకతీతంగా ప్రతి వ్యక్తికి చేరేటట్లుగా ప్రభుత్వం పని చేస్తున్నదని, గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం కేవలం తమ పార్టీ వారికే పని చేసిందని,



దాదాపు పది సంవత్సరాలపాటు అరాచక అవినీతి, దోపిడీకి తెలంగాణ గురైందని, మళ్లీ అలాంటి పొరపాట్లు చేయకుండా విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం ఏడవ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిబుర్ర మహేష్,మద్దులపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కర్లపూడి భద్రకాళి, బొల్లం వెంకన్న, దాసరి బుర్రయ్య ఏదులాపురం మున్సిపాలిటీ యాదవ సంఘం అధ్యక్షులు నెత్తి కొప్పుల గోపరాజు, మాజీ కార్పొరేటర్ చేతుల నాగేశ్వరరావు, మాదరబోయిన శ్రీనివాసరావు గజ్జి సూర్యనారాయణ, మెండే వెంకటేష్ బుర్ర రాధాకృష్ణ, బొల్లినేని నవీన్ మరియు తదితర యాదవులు బంధుమిత్రులు భారీ ఎత్తున పాల్గొన్నారు

# ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్ మార్గదర్శకాలు

## అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



**మేడ్చల్ -- మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఫిబ్రవరి 04:**జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల కు చెందిన 9, 10వ తరగతి విద్యార్థుల ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్లు అందించేందుకు అవసరమైన కుల, ధృవీకరణ పత్రాల నమోదు విషయంలో ప్రభుత్వ, ప్రైవేటల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు.

బుధవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వినోద్ కుమార్, డిఈఓ విజయ కుమారి, ఎల్డిఎం శివ ప్రసాద్ లతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్ నమోదు కోసం ఎస్సీ విద్యార్థులకు కుల, ఆదాయ ధృవీకరణలు వెంటనే జారీ చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు.ఈ ప్రక్రియలో నమోదు నుండి జారీ వరకు విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి, అదే విధంగా సంబంధిత తహసీల్దార్లతో సంప్రదించి ధృవపత్రాల జారీలో జాప్యం జరుగకుండా చూడాలని తెలిపారు. విద్యార్థులకు బ్యాంకు అకౌంట్, పోస్టల్ అకౌంట్ తెరిపించడంలో విద్యార్థులకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ముందుగా జాప్యంలేకుండా స్థానిక విద్యార్థుల కుల, ఆదాయ ధృవీకరణలు పెండింగ్ లో లేకుండా చూడాలని అదేశించారు. పోస్టాఫీస్ లో 10 సంవత్సరాలు నిండిన విద్యార్థుల పేరు మీద వంద రూపాలయలతో అకౌంట్ ఓపెన్ చేసి స్కాలర్ షిప్ కొరకు అకౌంట్ వివరాలు అనుసంధానం చేయాలని, ఈ అకౌంట్ తెరవడానికి ఆధార్, పోన్ నంబరు ఉంటే చాలని వివరించారు.

జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో ని షెడ్యూల్డ్ కులాల కు చెందిన 9, 10 వతరగతి విద్యార్థులు అర్హులు మరియు కుటుంబ ఆదాయంరూ. 2.5 లక్షల లోపు ఉండాలాన్నారు. ఆధార్, కుల, ఆదాయ ధృవీకరణలతో పాటు బోనఫైడ్, పాస్ పోర్టు సైజ్ ఫోటో బ్యాంక్ అకౌంట్/ పోస్టల్ అకౌంట్ కలిగి ఉన్న విద్యార్థులుఈ పాస్ వెబ్ సైట్ ష్ట్రజూం://ఱఱఖ.స్త్రవజూఖం.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.ఱఅ నందు ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్ నమోదు చేసుకోవాలని తెలిపారు. అనంతరం ప్రధానోపాధ్యాయుల సందేహాలకు అదనపు కలెక్టర్ సలహాలు, సూచనలు అందించారు.

# బిజెపికి వేములవాడ మున్సిపాలిటీని అప్పగించండి.

## నిధుల వరద పారిస్తా, బండి సంజయ్.

## బిఆర్ఎస్ కారు కరాబ్ అయింది, కాంగ్రెస్ వద్ద పైసలు లేవు,

## వేములవాడ కార్నర్ మీటింగ్లో కేంద్రమంత్రి నిప్పులు చెరిగారు.





**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** బుధవారం రోజున మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వేములవాడ పట్టణంలోని అంజనీ నగర్, తిప్పాపూర్ మహంకాళి చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్లో కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వేములవాడ మున్సిపాలిటీని బిజెపి పార్టీకి అప్పగిస్తే కేంద్రం నుండి నిధుల వరద తీసుకొచ్చి, రాజన్న ఆలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. బిఆర్ఎస్ కారు పూర్తిగా ఖరాబు అయిందని, దానిని బాగు చేయడం ఎవరి వల్ల కాదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద కనీసం నయా పైస నిధులు లేవని, 6 గ్యారంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. ఆసరా పింఛన్లు పెంచలేదని, మహిళలకు 2500 రూపాయలు ఇవ్వలేదని, కళ్యాణ లక్ష్మికి తులం బంగారం ఇవ్వలేదని, విద్యార్థినిలకు స్కూటీలు ఇవ్వలేదని, శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ 420 అమలు కానీ హామీలు ఇచ్చి తెలంగాణ రాష్ట్ర ప్రజలను ఆగం చేస్తున్నారని, నిధులు ఇచ్చేది మోడీ అని, నిధులు తెచ్చేది నేను అని, వేములవాడ పట్టణం అభివృద్ధి కావాలంటే పువ్వు గుర్తుకు ఓటు వేయాలని అని పిలుపునిచ్చారు.

వేములవాడ స్థానిక ఎమ్మెల్యే బీజేపీ కార్యకర్తలను బెదిరిస్తుంటే, పోలీసులు వంత పాడటం సరికాదని బండి సంజయ్ హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే డిజిపిని, జిల్లా ఎస్పీని ఇక్కడికే రప్పిస్తానని, అరాచకాలు చేస్తే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. రాజన్న ఆలయం ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతూ భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, వేములవాడ నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ చెన్నమనేని వికాసరావు, జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప్ రామకృష్ణ, వేములవాడ మున్సిపల్ లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

### ముడి పొగాకు ఉత్పత్తులపై సున్నా సుంకం

### కేంద్ర ఆర్థిక శాఖ జారీ చేసిన గెజిట్ కు మద్దతు తెలిపిన ఏపీ

### రాష్ట్రంలోని పొగాకు రైతులు, చిరువ్యాపారులకు ప్రయోజనమన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 04: ఎలాంటి బ్రాండ్ లేని ముడి పొగాకు ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకాన్ని సున్నాకు తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు స్వాగతించారు. ఇది రాష్ట్రంలో జరిగే అన్ బ్రాండెడ్ పొగాకు వాణిజ్యానికి ప్రయోజనం చేకూరుస్తుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈమేరకు కేంద్ర ఆర్థిక శాఖ జారీ చేసిన గెజిట్ ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. శుద్ధి చేయని పొగాకుకు(హెచ్ఎస్ కోడ్ 2401) వర్తించే సుంకం విధానాన్ని స్పష్టం చేస్తూ ఆర్థిక శాఖ ఈ గెజిట్ ను జారీ చేసింది. ఇక నుంచి అన్ బ్రాండెడ్ పొగాకు రీటైల్ విక్రయాలకు ఎక్సైజ్ సుంకం సున్నా గా పేర్కొంటూ ఈ గెజిట్ ను కేంద్రం విడుదల చేసింది. పొగాకు విక్రయాలపై పన్నుల విషయంలో ఏకరూపత, స్పష్టత, పారదర్శకంగా ఉండేలా ఈ గెజిట్ ను కేంద్ర ఆర్థిక శాఖ జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం కీలకమైన ముందడుగని ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. గతంలో ఎలాంటి బ్రాండ్ లేని బల్క్ పొగాకు క్రయ విక్రయాలు, వాణిజ్యానికి స్పష్టమైన తేడా లేకపోవటంతో చట్టంలోని వేర్వేరు నిబంధనల కారణంగా ఇబ్బందులు తలెత్తేవి. ఈ తరహా అస్పష్ట విధానాల కారణంగా రైతులు, వ్యాపారులు నష్ట పోతున్న నేపథ్యంలో అన్ బ్రాండెడ్ ఉత్పత్తుల సుంకాన్ని సున్నా శాతానికి తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ గెజిట్ ద్వారా ఎక్సైజ్ డ్యూటీ విధింపులో వేర్వేరు వర్గీకరణల వల్ల జరిగే ఇబ్బందులు తగ్గనున్నాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పొగాకు రైతులందరికీ మేలు చేసే నిర్ణయమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రైతులకు మంచి ధర దక్కటంతో పాటు వ్యాపారులకు, ఎగుమతులకు కూడా ప్రయోజనం చేకూర్చనుందని వివరించారు. స్పష్టమైన మార్గదర్శకాలు, నిబంధనల కారణంగా ఎక్సైజ్ డ్యూటీ ఎగవేత గణనీయంగా తగ్గుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. తప్పుడు మార్గాల్లో పన్ను ప్రయోజనాలు పొందకుండా అడ్డుకునేలా ఉన్న ఈ విధానాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్థిస్తుందని అన్నారు. ఈ నోటిఫికేషన్‌ను దేశవ్యాప్తంగా ఒకేలా కఠినంగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని, కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డుకు ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com